# నాస్తి (న+అస్తి)

నవల

- వెల్చేరు చంద్రశేఖర్



శ్రీ కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: ౧౨౮

కౌముది మాసపత్రికలో

జనవరి 2018 సంచిక నుంచి నవంబర్ 2018 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

(ప్రారంభం)

## భూతం

ఓ పూనకంతో చేతిలో ఆయధం వుపయోగిస్తున్నా...ఎవర్ని?ఎందుకు? ఏమిటి? అన్న విచక్షణ మొదట్లోవుండేది. ఈ యుద్ధం మొదలవక ముందు వుండేది. ఇపుడది లేదు. ఈ వేడి, వాడి చప్పబడకుండా ఆవేశంతగ్గకుండా...ముందుకి దూసుకుపోతున్నా..మెళ్ళో రుద్రాక్ష అటు ఇటు ఎగురుతోంది. ఆయుధపు తళతళలు..శబ్ధాలు వినిపిస్తున్నా.., అరుపులు హాహాకారాలముందు వెలవెలబోతున్నాయి. అప్పుడప్పుడు హరహరమహదేవ్ అంటూ హూంకారం వినబడితే...హాహతవిధి అన్న అరపు దాన్నితినేస్తోంది.

ఏమిటి విచిత్రం నేనెవర్ని?ఎందుకిలా చేస్తున్నాను? ఎవర్ని చంపుతున్నా? ఎవడు వాడు ఎందుకిలా ఎదిరిస్తున్నాడు?వాడు ఎవరికోసమో? దేనికోసమో? పోరాడుతున్నాను. కానీ నాలాంటిఅనేకవేలమంది విజేతలమీద ఆధారపడివుంది. విజయం!!!

విజయం ఎవరిది?... ఎందుకు విజయం?ఇవన్నీ పోరుమొదలయినప్పుడు మదిలోలేవు పోరాడాలి. ఆఖరి రక్తబిందువు వరకూ పోరాడాలి. భండనంలో కసి క్రూరత్వం కోపం పగ..రగిలితే...కయ్యం కదనంగా మారుతుంది కదనంలో కచ్ఛిపుడుతుంది. ఆకచ్ఛితో ఎదుర్కొంటాం... కలయబడతాం... భంగపరుస్తాం.. మర్దిస్తాం... చంపుతాం..వీటన్నింటివెనక ఎవరున్నారు. మనంఎందుకిలాచెయ్యాలి? అన్న ఆలోచనేలేదు. ఎదురుగా ఎవడో శత్రువుగా...మనకి నచ్చనివాడుగా మనం వొప్పనివాడుగా..మనకి ప్రతి కూలుదు..కంటకుడు..ప్రత్యర్థి.. విరోధి..వాడ్ని మననివ్వకోడదు చంపేయాలి. చేతిలో ఆయుధం విచిత్రమైన పోకడలు పోయింది. ఎదుటివాడి హాహాకారం తర్వాత నెత్తుటిమడుగులో మూలిగిముగిసిపోయిన వాడి జీవితం!ఎందుకిలా?

వాడూ మనిషే బావున్నాడు. వాడితో బంధుత్వం నెరిపితే వాడు బంధువు,శత్రుత్వం నెరిపితే..పగవాడు..అహితుడు..చంపు..మట్టుపెట్టు తర్వాత అక్కడితో అయిపోయిందా.. లేదే మరో శత్రువుని వెదుక్కోవాలి!

ఈ వున్మాదంలో మరో శత్రువుని వెదుక్కోనక్కరలేదు. వాడు మనవాడే కావచ్చు... పరాయివాడే కావచ్చు..చంపాలి అన్న పిచ్చిలో పడిపోతాం... హింస పిచ్చి!

అయితే ఇలా ఎన్నాళ్ళు ఎందుకీ ఆరాటం...ఎందుకీ పోరాటం?అలుపెరుగని పోరాటం..సెదతీరని క్లేశం..బెరుకులేని బిరుసుదనం..ఎక్కడవెదికి చూసినా కంపితమేగాని అనుకంప(దయ)లేదే...జాలి చూపమే. అయితే ఇదంతా ఎవరి కోసం.. ఎవరికోసమో సంగ్రామం మొదలుపెట్టక ముందే నిర్ణయం అయిపోయింది. ఇపుడీ ఆలోచనకి..అర్ధంలేదు. తనచేతనైనది...చేస్తున్నాడు...చేతిలో వున్నది వుపయోగిస్తున్నాడు.

ఆ క్షణంలో...రెప్పపాటుకాలంలో వెన్నులోంచి గుండెల్లోకి ఆయుధం దిగింది!

నివ్వెరపాటు క్షణకాలం స్థంబించిన కాలం..చీకట్లు కమ్మినలోకం..వొరిగిపోయినదేహం ఎవరూ పట్టించుకోలేదు. దేహాన్ని తొక్కేస్తున్నారు. తప్పించేస్తున్నారు. కాల్చేసారు..ఎవరో ఏడ్చారు...కనబడని దేహంగురించి..,ఎందుకేడ్చారు? తెలియడం లేదు.

ఏదో జ్ఞానం నుండి విముక్తి.... పూర్తిగా తెలియకపోలేదు. తెలియడమూ లేదు. చాలా శక్తి మాత్రం వుంది.ఆశక్తికి రూపం లేదు. కల్పన చెయ్యాలి. రూపకల్పన జరగాలి.ఎలా జరుగుతుంది. కల్పన చెయ్యడానికి జ్ఞానం వుంది.కాని అదేమిటో మరుగున పడ్డట్టుంది. ఆశక్తి

ఏమిటో తెలియకుండా కల్పన చెయ్యడం ఎలా జరుగుతుంది. ఈశక్తి నాదికాదు. శక్తికి స్వేచ్ఛవుందా?సంకల్పంవుంది. స్వేచ్ఛలేదు. లేక స్వేచ్ఛపాలు తక్కువగావుంది.స్వేచ్ఛలేని శక్తి దేనికి కట్టుబడింది...విధికి___!

ఏమిటి విధి? విధి బలీయంగా వుంది. శక్తిని ఎక్కడికో నెట్టుతోంది. అందుకే శక్తికి స్వేచ్ఛనశిస్తోంది. విధి ఎందుకింత బలంగావుంది. కాలం గడిచిన కొద్దీ తహతహఎక్కువ అవుతోంది. విధి బలంగా తయారవడానికి కారణం ఏమిటి? శక్తికి మరుపు ఎందుకొచ్చింది? విధి తనపని తను చేస్తోందా.

మహాశక్తి నుండి శక్తి విడిపడి రూపం చెందుతోంది. ఎందుకు విడిపడ్డానన్న జ్ఞానం ఎక్కడో తెలుస్తోంది. రూపాంతరం చెందడం లేదు. రూపం సంతరించుకోంటోంది. ఓహో ఇది నా రూపం! నేను...,అన్న రూపానికి., ప్రక్రుతికి ఏదో అంతరం.

మహాశక్తిని వదిలేస్తున్నా తప్పుచేస్తున్నా ఒప్పుమహాశక్తితో మమేకం అయివుండడమే! కానీ విధిబలీయం... కుదరడం లేదు. నాకు తప్పొప్పులు తెలుస్తున్నాయి. బుద్ధి ఏర్పడుతోంది. అయినా శక్తిని పరిమితం చేసుకు, విధికిలోబడి,సంస్కారవంతమైన బుద్ధిని వదలి,ఇఛ్ఛాశక్తి ప్రకటించా, కదలిక ఏర్పడింది. ఏదో కదిల్చా ఏమిటి పంచభౌతిక శరీరం! అప్పుడే జన్మకల్పన జరగాలి. పుట్టాలి.

మరోజన్మఎక్కడ. నీ తీరని కోర్కెలు, నీ కర్మ నిర్వహణకి వీలైన,లేదా అవసరం అయిన గర్భం వెదుక్కో....,నాకవసరమైన గర్భం ఏది?తెలిసింది. నే గర్భంలో కదిలానని..అమ్మకి నిద్రచెడింది.

ఎన్నోప్రశ్నలు అన్నింటికీ సమాధానాలు.....

"ఎవరు నువ్వు?"

"ఆత్మను___!"

"మరీ రూపం ఏమిటి?"

"పంచభౌతిక శరీరం___!"

"ఈ గర్భంలోనే ఎందుకు?"

"పూర్వజన్మ వాసన___!"

"గర్భాన్ని నువ్వేఎంచుకున్నావా?"

"లేదు విధి నన్ను ఈ గర్భంలోకి నెట్టింది..!"

"తప్పు విధి నిన్నీ గర్భం నెట్టవలసిన అవసరం ఏముంది.?"

"పూర్వజన్మవాసన___!"

"పూర్వజన్మ సుకృతం కాదా___!"

"సుక్రుతమోదుష్కృతమో నాకెలా తెలుస్తుంది?"

"ఏం ఎందుకు తెలీదు?"

"మరుపు బలంగా వుంటోంది___!"

"మరుపా?"

"అవును చాలా మందికి ఈ జన్మలోనే అల్జిమర్స్ వస్తోంది కదా భౌతికదేహం తోనే ఆత్మస్థాయికి చేరుకుంటున్నారన్నమాట...!"

"అలాగే అనిపిస్తోంది___!"

“నీ శక్తివంతమైన ఆత్మ సంస్కారవంతమైన బుద్ధికన్నా దిగజారి...నీ మానసిక వ్యాపారం ఎప్పుడు మొదలవుతుందో, ఆనాటినుండి నీవు కర్మఠివి.నీకొత్త ప్రయాణం మొదలవుతుంది.”

“ఎందుకింత భేదభావన?”

“ఇది భేదభావన కాదు ప్రకృతి ధర్మం కర్మ అనుభవించక తప్పదు.”

“ఏకర్మ అనుభవం లోకి వస్తుంది? నిత్యం కర్మ చేస్తున్నాగా... కాదు గతంలో కర్మ చెయ్యడానికి నీలో తపన వుంది. ఫలితం పొందలేదు.”

“ఇప్పుడు తపన వుండదా?”

“తపన వుంటుంది... ఫలితం పొందుతావు కానీ...”

“కానీ...?”

“ఫలితం వుండదు..,”

“ఫలితం పొందడానికి..ఫలితం ఉండడానికి తేడా..?”

“ఈ జన్మ సంస్కారం వల్ల అలా ఫలితం వుండనట్టు అనిపిస్తుంది..!,”

“అదేమిటి?”

“నీకర్మ పరిపక్వానికి తగ్గటు నీవో గర్భం వెతుక్కు జన్మిస్తున్నావు.”

“ఏగర్భంలో పుడతానో ఎవరు నిర్ణయిస్తారు.?”

“ఏగర్భంలోనో అంటే?”

“బుద్ధిజీవుల గర్భంలోనా శ్రమజీవులగర్భంలోనా సేవాజీవుల గర్భంలోనా?”

“శ్రమజీవులలో.... సేవాజీవులలో.... బుద్దివుండదా?”

“అయితే నాప్రశ్న ఇలావేస్తా బుద్దిని మాత్రమే వుపయోగించే జీవులగానా? శ్రమమాత్రమే వుపయోగించే జీవులగానా? సేవమాత్రమే చేసే జీవులగానా?”

నీవు చాలాభ్రమలో వున్నావు. సృష్టిఎప్పుడూ అలా వుండదు. నీ అవకాశం కొద్దీ ఏదో ఏర్పాటు...చేసుకుని... అదేనిజం అనే వూబిలో కూరుకు పోయావు. బుద్దిజీవులలో పుట్టినంతమాత్రాన బుద్దివుండకపోవచ్చు... వాడు శ్రమజీవిగానే బతకవచ్చు... పుట్టుకతో వాడికర్మ నిర్ణయింపబడదు. వాడు బుద్దిజీవులలో పుట్టడం శ్రమజీవిగా బతకడం వాడి పూర్వజన్మ వాసన ఫలితం. శ్రమజీవులు బుద్దిజీవిని తమలో వొకడుగాచేర్చుకోలేకపోడం మనుషులు కృత్రిమత్వానికి నిదర్శం.అలాగే శ్రమజీవిగా పుట్టి లేదా సేవాజీవిగా బుద్దిజీవిగా జీవితాన్ని గడుపుతూ శ్రమజీవుల లేదా సేవాజీవుల, ఇడెంటింటీని వదిలి పెట్టలేకపోడం వారి కుత్రిమత్వం,కానీ లోకం బుద్దిజీవిని,బుద్దిజీవిగానూ,శ్రమజీవిని శ్రమజీవిగానూ సేవాజీవిని, సేవాజీవిగానూ, గుర్తిస్తాయి. మిగతావి అన్నీ కృతకం! కృత్రిమం!.

నాకర్థం కాలేదు. బౌద్ధికమైన ఆలోచన అంటే ఏమిటి? శ్రమఅంటే ఏమిటి? సేవఅంటే ఏమిటి? వీటిని నిర్వచించు.

సేవచేసేవాడు ఎందుకు సేవచెయ్యాలి. అన్న ఆలోచన చేస్తే... శ్రమ చేసేవాడు ఎందుకుశ్రమచెయ్యాలి అని ఆలోచిస్తేబుద్ధిజీవి నా బుద్ధిఇతరులకి ఎందుకు వుపయోగపడాలి. అనుకోడంతో స్వార్థం, సంఘర్షణ ఏర్పడచ్చు, విచిత్రమైన విషయం ఏమిటంటే ఈ సంఘర్షణ రాజకీయలబ్ధికి వాడుకోడం ద్వారా అన్ని సమస్యలు బయలుదేరుతాయి. అదితప్పదు.

ఇక్కడే మిగతా ఆలోచనా విధానాలకి, తాత్వికాలకి ఈ దేశపు ఆలోచనా తాత్వికవిధానానికి తేడా! ఎన్ని తాత్వికవిధానాలు అప్పుతెచ్చుకున్నా, అవి అప్పుగానే మిగిలాయి. కానీ ఇక్కడ మౌలిక మూలాల్ని ఛేదించలేక పోయాయి. సేవచేసేవాడు, బుద్ధి వుపయోగిస్తాడు. నేనెందుకు సేవచేయ్యాలి. అన్న ఆలోచనవస్తే అది తిరుగుబాటు. తిరుగుబాటు చెయ్యాలా?వద్దా? తిరుగుబాటుకి, నాయకుడు కావాలి.ఆ నాయకుడు యెప్పుడూ బుద్ధిజీవే!

వీటి నుండి స్వేచ్ఛ వుండదా?

మరణం వొక అద్భుతమైన స్వేచ్ఛ...!

అంటే?

సమయం, ఉనికి రెండూ మాయలే... ఇవి రెండూ మనిషి ఆలోచనా శక్తికి అందవు... నిర్వికల్ప కలయిక ఇందులో నువ్వు వుండవు...!

వున్నావా..? లేదా? అన్న ప్రశ్న వుండదు. వికల్పిస్తున్నావు... మాయలో పడుతున్నావు.

నీ వెందుకు మరుగున పడుతున్నావు.

నీవు లోకంలో పడుతున్నావు. అందుకే...

లోకంలో పడ్డవేమిటి?

నీవు పుడుతున్నావు. నీకో పేరుంది.

పేరా .....!

అవును ..చిరంజీవి,,,.

వర్తమానం.

ఆ రోజు వచ్చిన టెలిగ్రాం తనని తన జీవితాన్ని మార్చేస్తుందని...లేదా, దానికి అవకాశం కలుగచేస్తుందని తను అనుకోలేదు. ఆ టెలిగ్రాం మూడోది.

మామ్మకి బాగులేదని త్వరగా రమ్మని...,

నాన్నకి మొదటి టెలిగ్రాం వచ్చినప్పుడు, నాన్న అమ్మ,నేను క్షణం ఆలస్యం చెయ్యకుండా ఆ పల్లెటూరుకి వెళ్ళేం. అప్పటికి మామ్మ మంచం మీద స్పృహలేని స్థితిలో వుంది. ఆవూళ్ళోఆచారిగారు మందిస్తున్నారు.

నాన్న ఏదో చిన్నవుద్యోగం చూసుకు విశాఖపట్నం వచ్చేసినా,మామ్మ తాతలనాటి ఆస్తిని, ఆ యింటిని వదిలి నాన్నతో విశాఖపట్నం రాలేదు. నాన్నకి ఆవూళ్ళో వ్యవసాయం పేరుతో చేతికి మట్టంట్టించుకోడం యిష్టం లేదు.

నాన్నకి వచ్చేజీతం,మామ్మ పంపించే సహాయం,జీవితం ఘనంగా వున్నట్టు అనిపించినా అవసరాలు మాత్రమే తీరేవి.

అవసరాలు కాక కోర్కెలుకలలుకూడా జీవితాన్ని పట్టిపీడిస్తాయని నాకు తెలీదు. అలా పట్టిపీడిస్తున్న కలలు తపింపచేసేవి. దానికి డబ్బే ఊరట, దానికో లక్షవరకూ కావాలి యెవరిస్తారు. నాన్న మామ్మ దగ్గరకెళ్ళి వోరెండెకరాల పొలం అమ్మెయ్యమని,దాంతో చిరంజీవిని ఇంజనీరింగ్ చదివిస్తానని,శతవిధాల చెప్పారు. మామ్మ నీకొడుకు ఇంజనీరింగ్ చదవకపోతే వచ్చే నష్టం యేదీ లేదు...పొలాన్ని

అమ్మేదిలేదని.. ఖండితంగా చెప్పింది.అలా కల కరిగిపోయి, మనసుని వేధించి, కసిగా మారిపోయింది. నేను బియస్సి రెండో సంవత్సరంలో వుండగా మొదటి టెలిగ్రాం వచ్చింది.

ఆ టెలిగ్రాం చూసి వెళ్ళిన మాకు రోజులు గడుస్తున్నాయి,కాని మామ్మపరిస్థితి వొక కొలిక్కి రాలేదు.అలా పదిహేనురోజులు గడిచాయి. మామ్మ తేరుకుంది. మృత్యువును జయించింది. మమ్మల్ని విశాఖపట్నం తరిమేసింది. నాలుగైదు నెలల్లో రెండో టెలిగ్రాం,ఈసారి నాన్న వొక్కరే వెళ్ళారు. యెందుకో మామ్మముసలితనం మీదకన్నా,మామ్మమీదే నమ్మకం నాన్నకి. అలా వెళ్ళిన నాన్న పదిరోజుల్లో తిరిగొచ్చేసారు.

మూడో టెలిగ్రాం రావడానికి ఏడెనిమిది నెలలు పట్టింది. ఆ టెలిగ్రాం చూసి, "ఈవిడ చావదు మనల్ని బతకనివ్వదు." అంటూ విసుక్కున్నారు.

ఈ సారి అలాకాక అప్పటికే శలవులివ్వడంతో, ఇంట్లోఖాళీగా వున్న నన్ను చూసి "జీవీ నువ్వెళ్ళు యేదైనా అవసరం పడితే కబురు చెయ్యి." అంటూ నన్ను పంపేరు.

నాన్న నన్ను, "జీవీ" అంటూ పిలుస్తారు. అందుకే ఈ జీవీని జీవితంతో కొట్టుమిట్టాడుతున్న మామ్మ దగ్గరకి పంపేరు.

................................

నే వెళ్ళేసరికి అంత పెద్దయింటిలో వో మూలగదిలో నులకమంచం మీద మామ్మ జీవితం కోసం పోరాడుతోంది. మామ్మని కనిపెట్టుకుండానికి వో విధవావిడవుంది. ఆవిడే మామ్మకి వండి పెట్టేది.

ఇప్పుడు మామ్మని కనిపెట్టుకుంది. ఆవిడ వయసు నలభైవరకూ వుంటుంది. దూరపు చుట్టం ఆవిడకి ఎవరూ లేరు. మామ్మ ఆవిడ్ని చేరదీసింది. ఆవిడ యింటిపనుల్లో మామ్మకి సాయపడితే,బైటపనుల్లో సాయపడ్డానికి సాంబడున్నాడు. సాంబడు పాలేరు. పొలంపన్లు, బైటలావాదేవిలు అన్నీ వాడే చూసుకుంటాడు.

ఇంట్లో అడుగుపెట్టిన నన్నుచూసి,"నాన్నగారు రాలేదా?"అనడిగాడు.

"వెనగ్గా వస్తారు" అన్నా...

మామ్మని చూడ్డం అయిపోయింది. ఆచారిగారితో మాట్టాడ్డం అయిపోయింది. వూళ్ళోవాళ్ళ జాలి భరించా... యిప్పుడేం చెయ్యాలి?

రోజూ వంటావిడ వండుతోంది. తింటున్నాను. పొలంలో తోటలో తిరుగుతున్నాను. ఆ రోజు ఆచారిగారితో యధాలాపంగా అన్నా "మామ్మకెలావుంది" అని.

"మామ్మగారు తేరుకుంటున్న లక్షణాలు యేం కనబడటంలేదు. క్రిందటి సారంటే కొడుకు దగ్గరున్నాడన్న ధైర్యం కావల్ను తేరుకుంది" అన్నారు. అవకాసం దొరికితే వీళ్ళు పొడవడానికి వెనుదియ్యరు. ఈసారి నాన్న రాలేదని దెప్పిపొడుపు.

ఆచారిగారి కళ్ళద్దాలు బద్దలుకొట్టి మందులపెట్టె బైటకి విసెరెయ్యాలనిపించింది. అప్పుడే లేనిపోని ఆలోచన మొదలయింది. నాన్న రాకపోడమే మంచిదయింది. లేకపోతే మామ్మ తేరుకునుండేదేమో! ఈవిడ తేరుకుంటే మళ్ళీ మామోలే...యెక్కడ వేసిన గొంగళి అక్కడే...

ఈవిడ పోతే ఆస్తి చేతికొస్తుంది. నా ఇంజనీరింగ్ కోర్కె తీరుతుంది. నాన్న బిజినెస్ చేద్దామనుకుంటున్న ఆశ నెరవేరుతుంది.

రోజంతా ఇలాంటి ఆలోచనలతో చిరాగ్గా వుండి మధ్యాహ్నం సుబ్బరంగా పడకేసా,లేచేసరికి సాయంకాలమైంది. చీకటిపడితే చెయ్యడానికేమీ వుండదు.ఇంట్లో చీకటి గుడ్డిదీపాలవెలుగు. రచ్చబండ దగ్గర కెళితే, గ్రామంలో యువకులంతా చేరి, అక్కడున్న గుండ్రాయిని యెత్తుతారు. బస్కీలు తీస్తారు.కర్రసాము చేస్తారు. కాస్త వినోదం కానీ అదికూడా యెన్నాళ్ళు...?

రచ్చబండ దగ్గర్నుండి రాగానే వంటావిడ వడ్డన, భోజనం చేసి గదిలోకి వెళ్ళి పడక, వో చదువుకోడానికుండదు. పాట వినడానికివుండదు. చికాగ్గా మంచం మీదకి చేరా...పూరించి, పూరించి యెప్పుడో నిద్రపట్టింది. అందులో కల... కల చెదిరి మెలకువ వచ్చేసరికి,చుట్టూ చీకటి.... చింత గీర్లరొద ...యెదురుగా మామ్మ గదిలో దీపం...మామ్మ యెప్పుడు పోతుంది. తన కెప్పుడు ఇక్కడ నుండి విముక్తి? అనేక ఆలోచన్లు...

ఆలోచన్లని చెదరగొడుతూ ..గుసగుసలు, ..యెక్కడ నుండి? ఈ అర్ధరాత్రి యెవరు మాట్లాడుకుంటున్నారు. మెల్లగా మంచం మీదనుండి లేచా, అడుగులో అడుగువేస్తూ మామ్మ గదిలోకి వెళ్ళా, గుడ్డి దీపం వెలుతుర్లో వంటావిడ పక్క బోసిగా కనబడింది. ఆవిడే బాత్రూముకో పోయుంటుంది. అనుకుని మామ్మ మంచం చేరి మామ్మని పరిశీలనగా చూసా...యెగూపిరి తీస్తోంది. కళ్ళకింద ముడతలు,బుగ్గలులోతుకుపోయి దవడ ఎముకలు వెళ్ళుకొచ్చాయి. జీవితంలో చరమపోరాటం సాగిస్తోంది.

బతికున్నన్నాళ్ళు మొగుడికి లొంగలేదు...కొడుక్కి లొంగలేదు...పెత్తనం చేసింది. తనను కున్నది జరిపింది. జరిపించుకుంది. ఆఖరికి యముడిక్కూడా లొంగడం లేదు. యముడు గెలవడం తప్పదు, కానీ యెప్పుడో?

బాత్రూముకెళ్ళిన వంటావిడ యింకా రాలేదు. ఆశ్చర్యం వేసి, మామ్మ గదిలోనుండి వసారావేపు వెళ్ళా...అక్కడ పాలేరు పడుకుంటాడు. వాడొచ్చాడో లేదో చూద్దామనుకున్నా... వసారా తలుపు వేసుంది. వసారా తలుపుదాకా వెళ్ళాక వినిపించాయి. నిట్టూర్పులు... చాలా భారంగా వున్నాయి. గుసగుసలు...మూలుగులు...యెవరో యిద్దరున్నారు. వసారాలో...యెవరు?

వసారా తలుపు తీసి చూడచ్చు కాని తెరిచి చూడబుద్దెయ్యలేదు. పడుకున్నా... నిద్రరావడం లేదు. రాదు కూడా... వసారాలో దాంపత్యం యెవరిదో తెలుసుకోవాలి. యేదైనా యెదురు చూద్దం చాలా కష్టం, కానీ తప్పదు... వసారాలో వున్న దెవరో మెల్లమెల్లగా అర్ధం అవుతోంది... కాని స్పష్టంగా తెలుసుకోవాలి...చాలాసేపు చీకట్లో... సమయం తెలియలేదు...నిద్రరాలేదు..ఎదురుచూత ఫలించి, వసారా తలుపు తెరుచుకు వంటావిడ మామ్మగదిలోకి వచ్చింది. చిన్నగావున్న దీపాన్ని పెద్దదిగా చేసి, మామ్మ దగ్గరకెళ్ళి... పక్కబట్టలు చూసింది. పక్కబట్టలు తడిసినట్టులేవు వచ్చి దీపాన్ని తగ్గించి, లాంతరు గదిమూలగాపెట్టి పక్కమీదికి చేరుకుంది. తనువు అలిసినట్టుంది. వెంటనే నిద్రలోకి జారుకుంది.

కాసేపు యెదురు చూసి, మెల్లగా లేచాను. చప్పుడు చేయకుండా వసారాలోకి వెళ్ళా, సాంబడు సామ్రాజ్యాన్ని జయించిన వీరుడ్లా మైమరచి,గుర్రుపెడుతూ నిద్రపోతున్నాడు.

ఇంతగొప్పడ్రామా యెక్కడా చూడ్లేదు...అందుకే అర్ధంచేసుకునేసరికి చాలా సమయం పట్టింది. వచ్చి పడుకున్నా... నిద్రపట్టలేదు తలనిండా ఆలోచన్లు, యేవో అస్పష్ట ఆలోచనలు! నా ఆలోచనలు నాకే భయం వేసాయి. వీధిలో గంటలచప్పుడు, తెల్లారినట్టుంది. యెవరో యెడ్లని తోలుకుపోలానికెళ్ళున్నారు. పూర్తిగావెలుగురాలేదు. గాని తూర్పుయెర్రబడింది. కళ్ళని నిద్రకమ్మేసింది.

---

తెలివొచ్చేసరికి, ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.నేను లేవడం చూసి వంటావిడ లోపలినుండి చిన్న బకెట్ తో నీళ్ళు తెచ్చి వీధరుగు మీద పెట్టి "మొహం కడుక్కో బాబు కాఫీ పట్టుకొస్తా" అంది.

యెప్పుడూ వేరే దృష్టితో చూడ్లేదుగానీ రాత్రి జరిగిన సంఘటన తర్వాత దృష్టి అప్రయత్నంగా అటుపోయింది. వయసు నలభై అయినా శరీరంలో బిగి తగ్గలేదు. అది పొదుచుకు కనిపిస్తోంది. రవికముడి రంకెలేస్తోంది. వంటావిడ స్వరంలో నెమ్మది, కళ్ళల్లో అమాయకత్వం వెనుక కోర్కెల సమాధి,వెనుక యెత్తైన పిరుదులు, విచిత్రంగా లబ్జుగా వూగుతున్నాయి. సాంబడు అదృష్టవంతుడు!

ఆరోజు నేనెక్కడికీ పోలేదు. పగలల్లా నిద్రపోయాను. సాయంత్రం ఆచారిగారొచ్చి, మామ్మకి జ్వరతీవ్రత తగ్గుతోందని చెప్పిపోయారు. అంటే మామ్మమళ్ళీ యముడ్ని జయించి,ఈలోకం వేపు మళ్ళింది. యముడు నిస్సహాయంగా నిలబడి వింతగా చూస్తున్నాడు.

ఆరాత్రి నేను పడుకోలేదు. కానీ నేను వేసిన కాపు వృధాయింది. వంటావిడ సాంబడి పక్కలోకి వెళ్ళలేదు. యెదురుచూసి... యెదురుచూసి యెప్పుడో తెల్లవార్ఝమున నిద్రపట్టింది.

ఆరోజు మామూలే ఆచారిగారు చూడ్డానికొచ్చి,"ప్రాణం మహగట్టిదోయ్"అన్నాడు.

ఆ విషయం అతడు చెప్పక్కర్లేదు. మాకు తెలుస్తూనేవుంది. మామ్మకి ఈ జీవితం మీద యింత మోజెందుకో ...జీవితప్రయాణంలో కొందరు తొందరగా పోయేరని భావిస్తాం ..కొందరు యెప్పుడొదుల్తార్రాఅనిపిస్తుంది. మామ్మ జీవితం వల్ల యెవరికి మంచి యేం సాధించడం కోసం ఇంకా  ఈలోకాన్ని పట్టుకువేళ్ళాడుతోంది. మామ్మ వల్ల సాంబడు వంటావిడ తప్ప యెవరు లబ్ధిపొందుతున్నారు. ఆలోచన్లు ...మెదడ్ని తినేసే ఆలోచన్లు.

మామ్మ జీవితం ఏమిటో నాకర్ధం కాలేదు. ఎవరో అన్నట్టు ఈ ముసలాళ్ళలైఫ్ స్టయిల్ ఏమిటి?  ఈ పల్లెటూర్లో లైఫ్ స్టయిల్ వుంటుందా? లేదు వుంది. ఇక్కడ వున్నన్నాళ్ళు ఆమెకి తిరుగులేదు. ఆమె మాటకి విలువపోదు.అందుకే నాన్న ఏం మాట్లాడకుండా పట్నం పోయారు.

పట్నంలో మామ్మకి ఆ విలువే ఉండకపోను. స్ధానబలిమిగాని తనబలిమిగాదు. అందుకే నాలో మామ్మపట్ల ఏవిధమైన సెంటుమెంటు లేవు. కొందరు మనుషుల్ని పోగొట్టుకుంటే బాధపడతాం. మామ్మ ఎక్కువ జీవించిందా? అన్న అనుమానం. ఈచావు ఆవిడ జీవితంతో దోబూచులాడుతోంది.

చంపేస్తే ... అది హత్య అవదు ఆవిడ ఎలాగూ చస్తోంది. నేను కొంచెం సహకరిస్తున్నా ...అంతే ఎవరేనా చంపేసానని తెలుసుకుంటారా తెలుసుకోలేరు.అంత ఘర్షణ వుండదు. అర్భకురాలు, అయిదునిముషాల్లో పాడెకట్టేయచ్చు...కాని అంతవరకూ బాగున్నది అకస్మాత్తుగా నిర్జీవియితే అనుమానం రావచ్చా? రావచ్చు ఎవరు గమనిస్తారు?. వంటావిడ ... ఆవిడ మనసులో కలవరం లేపాలి. అంత వివరంగా చూడకుండా చెయ్యాలి ఎలా?.

రాత్రి వంటావిడ పడుకోదు. సాంబడు పడుకోడు. పగలు ఇద్దరూ మాట్లాడుకోరు. కానీ రాత్రయేసరికి పడక సుఖంకావాలి. అది రహస్యంగా వుండాలి. లేదా వంటావిడకి ఆవిడ బతుకుగల్లంతైపోతుంది. ఆవిడ కులం ఏమిటి? ఈ పల్లెలో వసారాదాటడానికే అర్హతలేని సాంబడికి, అంగసంగమం కలుగచేస్తోంది. అంగజుడికి స్త్రీ,పురుష బేధం తప్ప మరొకటి అక్కరలేదు. ఆకలికి అది కూడా అక్కరలేదు. వంటావిడ రహస్యం బైటపడేస్తే, తనకి లొంగి తన పక్క సాంబడి నుండి నా మంచం మీదకి మార్చేస్తుంది. తనకి కావల్సింది వంటావిడ పొంద కాదు, మరి ఆవిడలో తప్పు బహిర్గత మయిందన్న భయం రేపడం ...హడలగొట్టాలి. ..దాంతో ఆవిడ ఆలోచన నశించాలి. అప్పుడు ఆవిడ లొంగుతుంది. అనుకోకుండా కలిసొచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఎందుకిలాంటి ఆలోచన్లు వస్తున్నాయి?

మహత్వాకాంక్ష నాకోరిక తీరాలంటే సాహసం చెయ్యాలి. సాహసం చేసినంతమాత్రాన కోరిక తీరుతుందా? సాహసం చెయ్యకపోతే అదీ తీరదు. ప్రయత్నం చెయ్యాలి. అన్ని రాక్షసకృత్యాలకి రాత్రి బలాన్నిస్తుంది.

చీకటి వెయ్యికళ్ళ రాకాసి . రాత్రి మేలుకునుండాలి ఎలా? పగలంతా పడుకుంటే రాత్రి తెలివిగా వుండం సాధ్యం మేలుకునుంటే మిగత పనులు సానుకూలంవుతాయి.

సాధ్యాసాధ్యాలు తర్వాత ముందు మేలుకునుండాలి యెప్పటిలా ఆరోజు రాత్రి ఎనిమిదిగంటలకి భోజనం చేసి పక్కమీదకి చేరా, నే పక్కమీదకి చేరిన గంటకి సాంబడు కర్ర చప్పుడు వసారాలో వినిపించింది. సాంబడికి తలుపు తీసి, వాడు లోపలికి వచ్చాక, వంటావిడ మామ్మ మంచం చూసి, పక్క బట్టలు మార్చడం మొదలుపెట్టింది అంటే మామ్మపక్కబట్టలు పాడుచేసినట్టుంది. పక్కబట్టలు మార్చి మామ్మని సుభ్రం చేసి, నూతిగట్టుదగ్గరకెళ్ళి స్నానం చేసి వచ్చింది. అంటే ఈ రాత్రి మన్మధుడి విజిట్ వుందన్నమాట.

పగలల్లా నిద్రపోవడం వల్ల... కన్నురెప్పకూడా పడటం లేదు. వంటావిడ పక్క చేరేసరికి పదిదాటి వుంటుంది. చీకటి గాఢంగా చిక్కబడి, చింతగీర్ల ధ్వని ఎక్కువైంది. గదిలో బల్లులు "చప్ చప్" అంటూ శబ్ధం చేస్తున్నాయి. లోకం నిశ్శబ్ధనిశిలోకి జారుకుంది.

మనిషికి సహనం అవసరం...దానితో చాలా పనులు చక్కబడతాయి. అనుకున్న పని అతితక్కువ ప్రయత్నంతో సానుకులపడాలి అంటే...అనుకూలమైన సమయం కోసం వేచి చూడక తప్పదు. చాలా సేపటి తర్వాత మామ్మ గదిలోఅలికిడయ్యింది. అటు తిరిగి చూసా... మామ్మ గదిలో లాంతరు వెలుగు తగ్గింది. వంటావిడ నిశ్శబ్దంగా బైటికి వచ్చి, గుమ్మం దగ్గర నిలబడి నా గదివేపు చూసింది. అప్పుడనుమానం వచ్చింది. వంటావిడ నా చూపుని పట్టేసిందా, నేను తెలివిగా వున్నానని ఆవిడకి తెలిసిందా యెందుకక్కడ నిలబడింది? యేమిటి చూస్తోంది? నా అనుమానాలన్నీ తీరుస్తూ,వంటావిడ అడుగులోఅడుగేస్తూ వసారాలోకివెళ్ళి, వెళ్తూనే తలుపు మూసేసింది.

నేనింక ఆలస్యం చెయ్యలేదు. గబగబా లేచి దిండుకిందనుండి పెన్ టార్చి తీసా, చప్పుడు చెయ్యకుండా మామ్మగదిలోకి వెళ్ళా, మామ్మ గదిలో లాంతరు బాగా తగ్గించి వుండడం వల్ల, మసకమసకగా కనబడుతోంది. మామ్మ మంచం దగ్గరకెళ్ళి టార్చివేసి చూసా, చక్కిదవళ్ళు సాగదీసి నోరొదిలేసి వూపిరి పీలుస్తోంది మామ్మ,జీర్ణించిపోయిన చర్మం..అరిగిపోయిన యెముకల్ని... ఆశ్రయించిన ప్రాణానికింత గట్టిదనం యెలా వచ్చిందో ముక్కు దగ్గర వేలుపెట్టి చూసా. వెచ్చటి వూపిరి ఈలోకానికి పరలోకానికి ఈగాలే సంబంధం...నాలోమొదటిసారి వుద్వేగం మొదలయింది. నేను చేయదల్చుకున్నపనికి నానరాలు యెదురు తిరిగి నట్టయింది. కానీ ఆలోచనల్లో బలం పోలేదు. అవి చెప్తున్నాయి...ఆలస్యం చేస్తే వంటావిడ వచ్చేస్తుందని, మామ్మ కాళ్ళకింద దిండుతీసా దాన్నిమొహానికి ఆనించి గట్టిగా నొక్కా... యెంతసేపు నొక్కాను, యేమిటి నాకే అర్ధంకాలేదు. మామ్మలో చలనం లేదు. మొహం మీంచి దిండు తీసి ముక్కుదగ్గర వేలుపెట్టి చూసా, యిందాకటి గాలి..వెచ్చటి వూపిరి వేలికి తగల్లేదు.

అయినా యేదో అనుమానం మామ్మ అంత తొందరగా చచ్చిపోదని పెన్ టార్చివేసి మొహాన్ని పరీక్షించా..యిందాకటికన్నా నోరు తెరుచుకుంది. నోట్లో నాలుక కనిపిస్తోంది.కళ్ళు అరమోడ్పుకనుల్లా విచ్చుకున్నాయి. కళ్ళని నోటిని మూసి, దిండుని మళ్ళీ కాళ్ళకింద పెట్టా...మామ్మ పోయిందా వుందా అన్నది. రేపు వంటావిడ చెప్పాలి. మంచం దగ్గర నిలబడి క్షణం సేపు మామ్మని పరీక్షగా చూసా యిందాకటికి యిప్పటికి తేడా యేదీ కనిపించడంలేదు. టార్చి తీసుకు మామ్మ గదిలోంచి బైటికి వచ్చి వసారా తలుపు దగ్గర నిలబడ్డా...యేదో వుద్వోగం...గుండె చప్పుడు నాకే స్పష్టంగా వినబడుతోంది.

వసారాలో సాంబడు వంటావిడ యేస్థితిలో వున్నారు. ఇప్పుడే తలుపు తెరిస్తే మంచిదా లేక కాసేపు ఆగి గుండె చప్పుడు తగ్గించుకోడం మంచిదా యేదీ నిర్ణయించుకోలేని, నిస్సహాయత...సమయం ఆగిపోయింది. యెందుకింద నిశ్శబ్దంగా వుంది? ఆలోచన ముగియనేలేదు. నిశ్శబ్దాన్ని చీలుస్తూ మూలుగు తలుపువెనుక, సుఖమైన మూలుగు... నిట్టూర్పు భారంగా, వుద్వేగంగా వేగంగా..ఇంక తను యెదురు చూడక్కరలేదు. చప్పుడు చెయ్యడానికి తలుపు తెరిచి టార్చి వెలిగించి వాళ్ళమీదవేసా. నాగబంధంలో యిద్దరూ,కామశిఖరాల్లో... అగ్ని కీలల్లో... మైమరపు వదిలి నిశ్చేష్టులైపోయారు. నేను లైటార్చి వెనక్కి వచ్చి నా మంచం మీద పడుకున్నా...అనుకున్నది అనుకున్నట్టుగా జరిగింది. రేపేం జరుగుతుందో చూడాలి. ఇంక ఈలోకంతో పనిలేదు. అన్నట్టు గోడవేపు తిరిగి పడుకున్నా....

---

తెల్లవార్ఝామున“బాబూ బాబూ” అని సాంబడు లేపితే తెలివొచ్చింది విడీవిడని కళ్ళతో వాడ్ని చూసా, వాడు కంగారుగా ”బాబూ మామ్మగారు పోయారు” అన్నాడు.

నాన్నకి కబురెళ్ళింది...మధ్యాహ్నానికి నాన్నా అమ్మా వచ్చారు. నాన్న మామ్మదగ్గర కూర్చుని యేడుపు...ఈయేడుపు నిజమా అబద్ధమా జీవితంలో ప్రతి మలుపు దగ్గర...అడుగడునా..నటన అవసరం వుంటుంది. లోకం కోసం నైతికత ...లోకాన్ని మభ్యపెట్టడానికి...ఈ నిజంలాంటి అబద్ధం అవసరం...నిజానికి విలువుంటే...అబద్ధానికి బలం వుంది. లోకం మభ్యపోవడానికి సిద్ధంగా వుంటుంది. విచిత్రం!

నాన్న కర్మ చేసారు. ఆఖరి రోజున తిరుగు ప్రయాణం నాడు యిల్లు పొలం అమ్మకానికి పెట్టమని..వూరిపెద్దలకి చెప్పి, విశాఖపట్నం చేరాం.

..............................

మామ్మ పోయిన ఆర్నెల్లకి ఇల్లూపొలం అమ్ముడయాయి. అనుకున్న దానికన్నా తక్కువ వచ్చింది.

నేను లక్షరూపాయలు డొనేషను కట్టి ఇంజనీరింగ్ చదవడానికి బెంగుళూరు వెళ్ళాను . నాన్న వుద్యోగం మానేసి యెక్స్ పోర్ట్ బిజినెస్ లో కొంత డబ్బు పెట్టారని తెలిసింది. నాన్న పెట్టిన డబ్బు తిరిగి రాలేదు. పోగొట్టుకున్నారు. ఇంకెవరితోనూ పార్టనర్ గా జాయిన్ అవకుండా స్వయంగా రొయ్యిలఎగుమతి మొదలుపెట్టారు. నాచదువు సాగుతోంది. అడిగిన డబ్బు ఇంటినుండి వస్తోంది. శలవుల్లో ఇంటికి వెళ్ళకుండా ఫ్రెండ్స్ తో తిరుగుతున్నా..

నాన్న కొత్తగా ఇల్లు కొన్నారు చాలాపెద్దఇల్లు. ..దసరా శలవులకి ఇంటికి వెళ్ళా...అందరం మారాం నాన్నలో మార్పు.... నాలో మార్పు... కానీ అమ్మలో మార్పురాలేదు. ఇంతకు ముందు ముతకచీరలు వెడల్పాటి అంచువి కట్టేది. ఇప్పుడు టెప్టెడ్ జరీవున్న చీరలు కడుతోంది. కానీ...అభిమానంలో.. అమ్మ అమ్మే... తేడాలేదు. నాన్నలో విచిత్రమైన మార్పు మాటాడేవిధానంలో వో కాన్ఫిడెన్స్...మాట్లాడ్డంలో వో విధమైన బ్యూరోక్రెటిక్ టచ్ మోడష్టి వచ్చాయి.

”ఇంజనీరింగ్ తర్వాత యేం చేద్దామనుకుంటున్నావ్?”

“మేనేజ్ మెంటులో పోస్ట్ గ్రాడ్యుయేషను”

నేచెప్పిన సమాధానానికి వోహొ అనలేదు...సరె అనలేదు...మరి మాట్లాడేలేదు. ఆ విధంగా ఇంజనీరింగ్ అవగానే పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదలయింది. విద్యార్థి జీవితంలో వోమస్తి వుంటుంది. వో హాయి వుంది. అందువల్ల లోకంలో జరిగేవి.. జరుగుతున్నవి. మనసుకి పట్టవు...అవసరం లేదుకూడా. కాలం హారతి కర్పూరంలా హరించిపోతుంది. అలాగే హరించిపోయింది కూడా.... యెందుకంటే చేతిలో డబ్బువుంది.

..............................

మేనేజ్ మెంటు పి.జి చేసి ఇంట్లోఅడుగుపెట్టేసరికి, జీవితం మరో మలుపు తిరుగుతుందనిగానీ.... మళ్ళీ నా తత్వానికి విరుద్ధంగా ఆలోచించాల్సివస్తుందనిగానీ... అనుకోలేదు.ఆమలుపుకి నాంది.... అమ్మశోకం... కనీకనబడని వ్యధ యెందుకు బాధపడుతోంది. అసలు బాధపడుతోందా? లేక నేను లేనిపోనివి ఆలోచిస్తున్నానా? లేదు యేదో యెందుకో బాధపడుతోంది. నాన్న ఇంట్లోవుండటంలేదు వ్యాపారనిమిత్తం ఏవో పనుల్లో బిజీగా, టూర్లు వెళ్తున్నారు. అమ్మకి దేవుడిధ్యాస ఎక్కువైంది.

---

ఏపని తోచక నాన్నగారి ఆఫీసుకెళ్ళా... అక్కడ పనంతా దివాకర్ చూస్తున్నాడు. దివాకర్ నాన్నకి నమ్మినబంటు. నేను ఆఫీసుకి వెళ్తున్నరోజుల్లోనే అర్థం అయింది. ఆఫీసులో నాకన్నా యెక్కువ విలువ గౌరవం దివాకర్ కి దక్కుతున్నాయి. అంటే దివాకర్ బంటుమాత్రమే కాదు మరీ ప్రత్యేకతేమిటి.

యెవరో విసిరిన జోక్ తో పరిస్థితి అయోమయంగా అర్థం అయింది. దివాకర్ నాన్నకి బావ అవుతాడు. యెలా నాన్న రెండో పెళ్ళి చేసుకున్నారని తెలిసింది. టూర్లపేరుతో నాన్నఇంటికి రాకపోడానికి కారణం బిజ్ నెస్ కాదు. సమీర, సమీర దివాకర్ చెల్లెలు. దివాకర్ నాన్నగారి ఫర్మలో అకౌంట్ టెంట్ గా జాయిన్ అయాడు. ఇద్దరూ పాతకంపెనీ యూనియన్ కార్బైడ్ కొలీగ్స్. నాన్న పెట్టిన కంపెనీకి క్లర్కులు అవసరమై, సమీరని చేర్చాడు.సమీర యయ్. యస్. సి పాసయింది. చాలా కలలు కనే వుంటుంది. కానీ మధ్యతరగతి శాపం, ఆర్థికపరిస్థితి అడ్డొచ్చి చిన్నచిన్నవుద్యోగాలు చేస్తూవయసు ముప్పైకి పెంచింది. ఇంక కలలు కల్లలు అని తేలిపోయుంటాయి.

ఆ సమయంలో నాన్నగారి ఆఫీసులో జాయిన్ అయింది. అలా జాయిన్ అయిన కొన్నాళ్ళకి నాన్నగారితో అనుబంధం పెరిగింది. నాన్న ఆమెని రెండోపెళ్ళి చేసుకున్నారు. ఇప్పుడు ఇద్దరికీ పిల్లలుకూడా యాభైఏళ్ళవయసులో నాన్నకి పిల్లలు నాకు తోబుట్టువులు. అంటే సహించలేకపోయాను. కానీ నే చేయగలిగిందేమీ లేదు. వారసత్వపు ఆస్తి, నా సాహసం వల్ల తెగింపువల్ల, నాన్నకి దక్కింది. అందుకే యెంత సరిదిద్దుకుందామన్నా మనసు, నాన్న చేసిన పనిని అంగీకరించలేదు. నేఅంగీకరించినా అంగీకరించకపోయినా సమయం వెనక్కి రాదు.

ఇది నా ఆస్తి నేను దక్కించుకోవాలి. అది పరుల పాలుకావడం గానీ, దాన్ని ఇంకొకళ్ళు పంచుకోడం కానీ నాకిష్టం లేదు. కానీ యివేవీ పైకి చెప్పుకోలేను. లోపల దాచుకోనూలేను. ఆ సమయంలోనే మావయ్య జ్ఞాపకం వచ్చాడు.

మావయ్య విశాఖపట్నానికి దూరంగా యలమంచిలిలో 'లా' ప్రాక్టీసు చేస్తున్నాడు. రాబడి అంతంతమాత్రమే అయినా యలమంచిలికి దగ్గర్లో పల్లెటూర్లో భూములున్నాయి. వాటిని సాగుచేయించి వాటిమీద వచ్చిన రాబడితో... సంసారం బాగానే లాగుతున్నాడు. నాన్నకి మావయ్యంటే చిన్నచూపు. మాకన్నా తక్కువ ఆస్తిపరులని కావచ్చు. యితరత్రాయింకేమేనా కావచ్చు... అందుకే రాకపోకలు అంతంతమాత్రంగానేవున్నాయి.

తన యింట్లో నన్నుచూడగానే మావయ్య ఆశ్చర్యపోయాడు. యెందుకంటే నాకూ మావయ్యతో అంత పరిచయం లేదు అందుకే నన్ను చూడగానే "యేరా యిలా వచ్చావు? ...యేం పనుందేమిటి?" అంటూ పలకరించాడు.

నాకు పనుండేవచ్చాను. కానీ దాన్నవతలివాడు గుర్తించడం నాకిష్టం లేదు. అయినా నవుతూ "యేం పనుంటేనే రావాలా లేకపోతే రాకూడదా" అన్నా.

మావయ్య నవ్వాడు విచిత్రంగా నవ్వాడు. ప్రవర్తనలో కపటానికి పోతే అలాంటి నవ్వే యెదుర్కోవల్సి వుంటుంది. తప్పదు నా ఇబ్బంది పసిగట్టింది అత్తయ్య, మావయ్యని మందలిస్తూ.. "యెందుకా పుల్లవిరుపుమాటలు పైవాడా యేమేనా" అంటూ ఆహ్వానించింది.

అత్తయ్య ఆప్యాయతకి అభిమానానికి అర్థం చాలా సేపటికి తెలిసింది. అదీ రాగిణి ప్రవేశంతో ... రాగిణికి ఇరవైయేళ్ళుంటాయి. తలకి రాసిన నూనెజిడ్డు అనవసరంగా పోతున్న సిగ్గులఅడ్డు లేకపోతే యౌవ్వనం జిగి, వంటిబిగి ఆకర్షణీయంగానే వుంది.

మావయ్యంటికి నా రాకపోకలు జరుగుతూనే వున్నాయి. మావయ్యకి నా సమస్యఅర్థం అయింది. కానీ యే ఆలోచననా రాక, యే వుపాయమూ తోచక చెప్పిన వివరాలు వింటూ చాలా రోజులు గడిపేసాడు. నాకు కాలక్షేపం రాగిణి చూపులతో, కానీ మావయ్య వివరించి చెప్పిన,కంపెనీ లా...కూడా, చాలావరకూ నామేనేజ్ మెంటు బుర్రకి యెక్కింది,అన్నీ వివరంగా చెప్పాక వో రోజు , మావయ్య అన్నట్టుగా శాస్త్రప్రకారం జరిపితే కుక్కపిల్ల పుట్టిందని "ఈలాలన్నీ వుపయోగిస్తే దమ్మిడీ కూడా దక్కదు.ముక్కుసూటిగా ఆలోచించే వాడికన్నా, వంకరటింకరగా ఆలోచించే వాడంటే దేవుడికి ఇష్టంలా వుంది. అందుకే ..సీధా వుంగ్లీసె మఖ్ఖన్ నహి నికెలేగా, వుంగ్లీకో టేడాకరనా పడ్తాహై" అన్నాడు మావయ్య.

మావయ్య దగ్గర కంపెనీలా, నేర్చుకుంటున్నా, ప్రతిగా రాగిణికి సరసం నేర్పుతున్నా..,
రాగిణికి నేర్పే సరసం ఇష్టమై , అప్పుడప్పుడు ఏకాంతంగా చిక్కుతోంది. నాచిలిపితనానికి, నా తుందుదుకుని ఎంజాయ్ చేస్తోంది. చెయ్యి పట్టుకు మెలిపెట్టినా, బుగ్గలు పిసికినా... వొక అవ్యక్తానందం రాగిణిలో కలుగుతోంది. ఇదిక్కడితో ఆగుతుందా రాగిణి సహకారం ఎంత వరకూ వుంటుంది. నాలో విచిత్రమైన వుత్సాహం దానికి తగ్గట్టుగా ఆ రోజు కలిసొచ్చింది. కలిసొచ్చిన రోజున రాగిణి స్నానించి, జుత్తుకి సాంబ్రాణి పొగవేసి వాలుజడ వేసింది. నూనెజిడ్డులోంచి బైటపడ్డ మొహం, వింతగా ఆకర్షణీయంగా వుంది.

ఆ ఆకర్షణే నా పరిధిని మర్చిపోట్టుగా చేసింది. ఆ ఆకర్షణే సాహసానికి పురికోల్పింది. అది కళ్ళల్లో తమకంగా ప్రస్పుటమై, రాగిణిని బలంగా తాకింది.
రాగిణి నాకు సూచిస్తోందా అన్నట్టుగా "అమ్మా వేణ్ణీళ్ళు బాత్రూములో పెట్టా" అంటూ కేకేసి చావిట్లో ముందు గదిలోకి వెళ్ళింది. అది మావయ్యగది లా పుస్తకాలు, టేబులు కుర్చీవున్నగది. స్నానానికెళ్ళిన అత్త స్నానించి, పడకగదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకోడానికి చాలా టైము పద్తుంది.

కానీ రాగిణితో ఏకాంతానికి ఎంతసమయం కావాలి, మావయ్య ఆఫీసుగదికి ఒకే తలుపు. వెళ్ళి తలుపేసా.. రాగిణి వెనక్కి చూసి తొట్రుపాటు పడింది. టేబులు దగ్గరగా వున్న రాగిణిని వాటేసి బలవంతంగా ముద్దుపెట్టుకున్నా.... పెదాల్లో అందంకన్నా అలజడి శరీరపొంకంలో వెచ్చదనం.... నాతనువుకి హాయి నిచ్చాయి. నా పట్టుకి ఇబ్బంది నటిస్తూ, ఇష్టం వున్నా లేనట్టు అభ్యంతరపు గుసగుసల మధ్య రాగిణి పరువం...మరువంలా గుప్పుమంది...కానీ రాగిణి కనుకొలకుల్లో తమకం.., మైమరుపు యేదో యేదో చెయ్యమని ప్రేరేపించాయి. పట్టుబిగించాను. నేనింకొంచెం బలవంతపెడితే అంగజుడి పని సానుకూలం అవుతుంది. ఈ అవకాశాన్ని వొదులు కోలేదు. రాగిణిని వదలలేదు. సమయం గడిచిన కొద్దీ రాగిణి కళ్ళల్లో ఎర్రజీర గాఢమై, తమకంగా "బావా వద్దు" అంది. రాగిణి శరీరపు సెగలు నన్ను దహిస్తూ...నేను జ్వాలనై రాగిణిని దహించి.. జయించా... ఆ సమయంలో బాత్రూము తలుపు తీసిన చప్పుడు....

ఇద్దరం అయిష్టంగానే విడి... రాగిణి భారంగానే బట్టలు సర్దుకు బైటకి నడిచింది. బైటకివెళ్తూ వెనక్కి తిరిగి చూసింది. ఆ చూపులో మత్తు, జీర ఇంతకు ముందెప్పుడూ చూడలేదు.

పై అందాలకన్నా అంతర్ముఖ అందాల అనుభవం గొప్పది.

........................................................

రాగిణి విశ్వాశాన్ని ఎలా సంపాదించానో, ఇక్కడ ఆఫీసులో నాన్న విశ్వాశాన్ని అలాగే సంపాదించాను. నాన్న విశ్వాశాన్ని సంపాదించడంతో సరిపోదు. దివాకర్ ని దెబ్బతీయాలి. ఆప్రయత్నాలు చేసాను. అవి సఫలీకృతం అయాయి. రెండుమూడు పేమెంట్సు వచ్చిన డిమాండ్ డ్రాఫ్ట్స్ దివాకర్ టేబులు సొరుగునుండి తీసి చింపేసాను. దాంతో పేమెంట్సు ఆగిపోయాయి. ఎలాపోయాయి. అన్న తర్జనబర్జన జరిగింది. నేను మాత్రం దివాకర్ తరుపున మాట్లాడి, అదేమంత పెద్ద తప్పుకాదన్నట్టు తేల్చేసాను.

కాని సమయానికి పేమెంట్ అవక, నాన్న ఇబ్బంది పడ్డారు. అదికాస్తా దివాకర్ మీద చూపించారు. దాంతో దివాకర్ జాగ్రత్తపడ్డాడు. ఈసారి దివాకర్ని పేమెంట్సు విషయంలో ఏమర్చడం కష్టం కానీ సప్లై ఆర్డర్స్ విషయంలో ఏమర్చవచ్చు... అదే జరిగింది.
ఆర్డరు చేసిన పార్టీ ఆఫీసుకొచ్చి, రెండునెలలైనా సప్లైచెయ్యలేదంటూ, చాలా గొడవ చేసాడు. ఆ ఆర్డరు దివాకర్ టేబులుమీదకి వచ్చింది. మాయమైంది.

ఇది జరిగిన రెండ్రోజులకి దివాకర్ కి ఫోనొచ్చింది. తనకుసహకరించినందుకు పారితోషికం వుంటుంది. అంటూ ఆ న్యూసు నాన్న గారికి తెలిసింది. ఆయన దివాకర్ మీద కన్నేసి వుంచడంవల్ల, దివాకర్ మీద అనుమానం బలపడింది. అగ్నికి ఆజ్యంతోడు అన్నట్టుగా "దివాకర్ కి నేను ఆఫీసులో పనిచెయ్యడం ఇష్టం లేదేమోనాన్నా" అన్నా.

బ్లడ్ ఈజ్ థిక్కర్ దేన్ వాటర్, అన్నట్టు నాన్నలో అనుమాన బీజం చిగిర్చి... దివాకర్ని పైపన్లకి ఆఫీసునుండి పంపేసేవారు. నాకు కావలసిందీ అదే కంపెనీ లావాదేవీలమీద పట్టు, బేంకర్సుతో రాపోర్టు.

ఫైనాన్సియల్ మేటర్సు చేతికొచ్చిన కొన్నిరోజుల్లోనే అనుకున్న ప్లాన్ ని అమలుచేసా, దానికి మావయ్య సలహా ఎంతేనావుంది. మావయ్య ఇంటికి వెళ్ళినప్పుడల్లా రాగిణి వలపు ఇవన్నీ సవ్యంగా జరుగుతున్నాయి. కానీ రాగిణిమీద చిన్న అనుమానం వచ్చింది. మావ్యవహారం మావయ్యకు తెలుసా?, తెలిసే వూరుకున్నాడా?. అంటే మావయ్య తన పథకం పారుతుందనుకుంటున్నాడు. నేను కాలక్షేపం బావుందని అనుకుంటున్నాను.

మా మధ్య నలుగున్నది రాగిణి మాత్రమే!

------------

నేను ఆఫీసుజాయిన్ అయిన ఏడాదికి, నామీద అనుమానం కలిగింది నాన్నకి అది జరుగుతుందని నాకు తెలుసు అప్పటికే కంపెనీ చేసిన అప్పులకి, ఎసెట్స్ కి బ్రేకీవెన్ వచ్చేసి, కంపెనీ నాజూకు స్థితికి చేరుకుంది. అప్పుచేసి తెచ్చిన డబ్బుటర్నోవలోకి వెళ్ళలేదు. నా అకౌంటులోకి వెళ్ళిపోయింది.

నాన్న అనుమానం పెనుభూతమై ఆడిటర్స్ మీటింగ్ లో నిజం తెలుసుకునేసరికి, నేను కథని చాలా దూరం నడిపించా.

ఆరోజు నాన్నకోపంగా "జీవీ" అని పిలిచినప్పుడే నా సమాధానం సిద్ధంగా వుంచుకున్నా... నాన్న డబ్బు విషయం ఎత్తగానే...

"నువ్వు చేసిన మోసం ముందు ఇదో పెద్ద వంచనకాదు." ....అన్నా.

నిన్నటివరకూ నాన్న ఆఫీసులో వినయంగా నాన్న చెప్పినవన్నీవిని "వూ" కొట్టిన చిరంజీవేనా? వీడు.... ఇలా సమాధానం చెప్తున్నాడు,అని ఆశ్చర్యపోయారు నాన్న.

"నేను మోసం చేసానా" అన్నారు నాన్నకోపంగా.

"ఇది నాతాతలఆస్తి, నువ్వు సమీరని, పిల్లల్ని వారసులుగా తేవడం నా కిష్టం లేదు. అమ్మని నువ్వు మోసం చేసినప్పుడు, నేను నిన్ను మోసం చెయ్యడంలో తప్పులేదు. అమ్మని నువ్వు నీ సుఖంకోసం మోసం చేసావు. నేను నిన్ను నా ఆస్తి కోసం మోసం చేసాను. అమ్మని నువ్వు మోసం చేసానని నువ్వనుకోలేదు. నీ స్వార్థం నీ సుఖం నువ్వు చూసుకున్నావు. కానీ అది యెవర్ని బాధిస్తుందో అర్థం చేసుకున్నావా? లేదు ఎందుకు? ఆ అవసరం నీకు లేకపోయింది. అలాగే నేను ఇది నా ఆస్తి అని నమ్ముతున్నాను. దీన్ని రేపు పంచరా అంటే నాకు చికాకు. "

"ఇప్పుడు అమ్మకి భార్య దర్జా వున్నట్టా? లేనట్టా? అమ్మకి యేలోపం జరగలేదని నీ నమ్మకం అలాగే నాపేరు మీద జరిగే ఈవ్యాపారం ఈ కంపెనీకి నువ్వు జాయింటు డైరెక్టర్ వి. నీకు నెలనెల రేమ్యూనరేషన్ వుంటుంది. నీకు అన్యాయం జరిగినట్టు కాదు. ఇంక నీకీ ఇంట్లో ఏలోపం జరగదు దర్జాగా వుండచ్చు కానీ...."కానీకి అర్థం నాన్నకి తెల్సు. ...నన్ను నమ్మలేనట్టు చూసారు. నాన్నకి తెలుసు...కంపెనీకి ఎసెట్స్ మించిన అప్పులున్నాయి. నన్ను ఏవిధంగా వంచాలన్నా అమ్మ ఆసరా కావాలి. అది సాధ్యంకాదు. అప్పటికే అమ్మ నిర్లిప్తంగా తను కట్టుకున్న దేవుడిమీద నమ్మకం పోయి, నమ్ముకున్న దేవుడిమీదకి మనసు మళ్ళించేసి సమాధానం పడింది.

నాన్నకి కంపెనీని ఏం చెయ్యాలో అర్థం కాలేదు కొన్నాళ్ళు మౌనంగా ఇంట్లో గడిపారు. రెండుమూడు కోర్టుకేసులు తగిలేసరికి, నా సహాయం తీసుకోక తప్పలేదు. కంపెనీని నా పేర ట్రాన్స్ ఫర్ చేసేసారు.

కంపెనీ చేతికి రాగానే దానిస్వరూప స్వభావాలు మార్చేసా, దివాకర్ ని ఇంకోవుద్యోగం చూసుకోమని చెప్పా.... కంపెనీ వ్యవహారాల్లో తలమునకలై యలమంచలి వెళ్ళలేదు. మనసు రాగిణి పొందుకోసం తపించిపోతోంది. అదే సమయంలో మావయ్య ఏదో పనిమీద మద్రాసు వెళుతున్నాడని రాగిణి వుత్తరం రాసింది.

మావయ్య వూరెళ్ళిననాడే, నేను యలమంచిలి వెళ్ళా... రాగిణిలో వుద్యోగాన్ని...రాగిణిలో వెచ్చదనాన్ని పంచుకున్నా, రాగిణి పెళ్ళి విషయం కదిపింది. రాగిణిని చేసుకునే ఆలోచన నాకెన్నడూలేదు!. ఏం చెయ్యాలి? అత్తకి ఈ విషయం తెలీదా?. మావయ్యకీ తెలియదా? తెలుసనే నేను అనుకుంటున్నాను. వాళ్ళ ప్రోత్సాహం వుంది. మావయ్య అంత తెలివి తక్కువవాడు కాదు. కంపెనీ విషయంలో తేడా చేసినప్పుడే అర్థం అయింది. చాలా తేలికగా ఎదుటివాడి అలోచనని పసిగట్టి, ఎత్తుకు పైఎత్తు వేయగలిగాడు. రాగిణి ఆకర్షణలో నిజంగా పడ్డాననుకున్నాడా?

రాగిణిని దూరంపెడ్తే సరి, కొన్నాళ్ళకి పెళ్ళి చేసేస్తారు. అదే ఆలోచన అందుకే రాగిణిని దూరం పెట్టాను. రాగిణి వుత్తరాలు రాసింది. జవాబివ్వలేదు. బెదిరించింది . చలించలా.

......... ....

ఒనాడు మావయ్య అత్తతోఇంటికి వచ్చేసాడు. అప్పటికి నాన్న ఇంటికి రావడం మానేసి చాలా రోజులైంది.

మావయ్య ఏం చెప్పాడో... అమ్మ ఏం విందో నాకర్ధం కాలేదు. అత్త ఏడుస్తోంది. ఆడవాళ్ళకి కన్నీటివాడకం ఎక్కువ. మావయ్య "రాగిణిని పెళ్ళిచేసుకుంటానని నువ్వు మాటిచ్చావా?"అనడిగాడు.

"నేనేమీ ప్రామిస్ చెయ్యలేదు. మీఇంటికొచ్చినప్పుడు సరదాగా హాస్యాలాడేవాడ్ని."

"ఏరేయ్ అబద్దాలాడకురా అదన్నీ చెప్పింది. "

"ఏమిటి అన్నీ చెప్పింది. అంతకుమించి నాకేం తెలీదు" అన్నా.

"ఏమిటిరా తెలీదు దాని జీవితం పాడుచేసి.. అదిప్పుడు బావని తప్ప చేసుకోను అంటూ పట్టుపట్టి కూర్చుంది."

"నేను దాన్ని అసలు చేసుకోను అని పట్టుపట్టి కూర్చున్నాను."

మావయ్య గుర్రుగా చూసాడు.

"అదేమిటి బాబూ దాన్ని నమ్మించావట కదా"అమ్మ

"నమ్మించడం అంటే."

" నిన్ను పెళ్ళిచేసుకుంటానని ప్రమాణం చేసావటకదా .."

"నేను ప్రమాణం చేసినప్పుడు నువ్వున్నావా అత్తా"

"ఒట్టి ప్రమాణమేనా ఏమైనా చేసాడా?" ..అంది అమ్మ.

"అందుకే కదా ఇంతవరకూ రావడం" అన్నాడు మావయ్య.

"ఒట్టి ప్రమాణాలే అయితే ఏదో సరిపెట్టుకుంటాం వదినా... అది కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది. పైకి చెప్పుకోలేం .. దాని దుఃఖం భరించలేం" అత్త మాటల్ని బట్టి ఏదో జరగకూడనిదే జరిగింది. అని అర్ధం అవుతోంది. రాగిణి కడుపుతో వుందా? వుంటే నేనేం చెయ్యాలి. లొంగకూడదు.

రాగిణితో సరదాగా గడిపేనే గాని రాగిణి జీవితాంతం భరించడం ఇంపాజిబుల్ ఎంతాలోచించినా, రాగిణి నా మైండ్ సెట్ కి ఫిట్ అవలేదు. రాగిణి నా జీవితానికి సెట్ అవదు. రాగిణికి సేఫ్టీ కావాలి. అది మొగుడు ఇవ్వగలడు. అంతకు మించి రాగిణికి జీవితం మీద వో ఆశలేదు. జీవితంలో వో కల కనదు నేను అలాకాదు అందుకే రాగిణిని చేసుకుంటే నా విలువ తగ్గిపోతుంది. బ్రహ్మచారికి వున్న విలువ పెళ్ళైన వాడికి వుండదు. ఇంత తొందరలో పెళ్ళి ఆలోచన కూడా లేదు. రాగిణి కూడా అనుభవించింది. నేను రాగిణిని మోసం చెయ్యలేదు.

రాగిణిని దాదాపు మర్చిపోయా. మావయ్య ఏం చేస్తాడ్లే కాసేపు ఏడ్చి వెళ్ళిపోతాడు. తిట్టుకుంటాడు. ఇంటికి రావడం మానేస్తాడు. రాగిణి నన్నుసుఖపెట్టింది. తను సుఖపడింది కూడా. రాగిణి టెమ్ట్ అయింది. కాబట్టే ఇందులో నా బాధ్యత యెంతో రాగిణిది అంతే అదే అభిప్రాయం! అందుకే మావయ్యకి లొంగలేదు. ఇంక మావయ్య అవసరం నాకు లేకపోయింది. అందుకే చిరాగ్గా.. "రా అమ్మా .. ఆకలేస్తోంది," అన్నా.

"నువ్వెళ్ళు పెట్టుకుతిను..." అంటూవిసుక్కుంది అమ్మ.

అంటే అమ్మకి ఎక్కడో నామీద అనుమానం వుందన్న మాట ఎంతేనా మోసపోయిన జాతిలోదేకదా ఆమెకి తెలుసు మోసం దెబ్బ....

రెండు నిముషాలు అక్కడ నిలబడి అక్కడ్నించి భోజనం చెయ్యకుండా వెళ్ళిపోయా...

"నా కూతుర్ని పెట్టిన వుసురు వూరికే పోదే అక్కా....." అంటూ మావయ్య తన కోపాన్ని వెళ్ళకక్కాడు. ఆ తర్వాత మావయ్యతో సంబంధం తెగిపోయింది.

.

ఇటు నాన్న అటు మావయ్య అందరూ నన్నొదిలిపోయారు.

ఒంటరిగా మిగిలిపోలేదు. వ్యాపారం మీదే దృష్టి. వ్యాపారం చెయ్యడం తేలిక.... రూపాయే ముఖ్యం... అదే మూలాధారం.

ఇందులో నువ్విచ్చినమాటా నువ్వుపుచ్చుకున్నమాటా. ఇవేవీ ముఖ్యంకాదు. మనిషి ముఖ్యం కాదు. ఎవరు మోసపోతున్నారు. ఎవరి దగ్గర అబద్ధం ఆడాం, అన్నది ముఖ్యంకాదు. వాటన్నింటి వెనుకా ఆర్ వుయ్ గైనింగ్ ఆర్ నాట్ వొకే సూత్రం....ఏ పనికి రాని పనైనా చెయ్యి పర్వాలేదు, కానీ డబ్బురాని పని, డబ్బుమిగలని పని మాత్రం చెయ్యకు.

నేను వెధవనని... డబ్బుతప్ప ఇంకో దానికి విలువనివ్వనని దిగజారడంలో ఏ స్థితికేనా దిగజారతానని కొందరి అభిప్రాయం.

దిగజారడం. ఎగబాకడం. అన్నవి సాపేక్షాలు, రూపాయ జమ అవుతోందా? లేదా? అన్నది ముఖ్యం ఎప్పుడూ కొత్త మనుషులతోనే పరిచయం. ఎప్పుడూ వాళ్ళనే వుపయోగించాలి. వాళ్ళూ నాలుగురూకలు చేసుకుందామనే ఆశతో వుంటారు. దాన్ని మనం సొమ్ముచేసుకుంటాం వాళ్ళు నష్టపోయారా? లాభపడ్డారా? అన్నది మనకనవసరం ఈలావాదేవీలో ఎంత లాభపడ్డాం అన్నది ముఖ్యం.

ఇక్కడ నా సూత్రానికి సహకరించే వ్యాపారం రియల్ ఎస్టేట్ చదువు అక్షరజ్ఞానం లేని రైతులనుండి భూమికనుగోలు చేసినట్టు వొప్పందం రాయించుకుని, ప్లాట్లేసి అమ్మడం... ఇటురైతుకి మట్టినేల అమ్మేసిన ఆనందం ... అటు వాడికి ఇల్లుకట్టిన ఆనందం. ఇటుమనకి డబ్బులు మిగిలిన ఆనందం.

అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారం అంత తేలికకాదు. ఎక్కడో మారుమూల విశాఖకి దూరంగా వో ఎనిమిదెకరాలు కొన్నట్టు అగ్రిమెంటు రాయించుకుంటే దాన్ని భాగాలు చేసి కొన్న వెలకి మూడురెట్లుచేసి అమ్మాలి, కొనేవాడ్ని చూసుకోవాలి. కొనేవాడు అంతతేలికగా పడడు. అనేక వెరిఫికేషన్ల తర్వాత ప్లాటు కొనడానికి వొగ్గుచూపేవాడు. అదీ విశాఖ వాడు అసలుకొనడు., రంగురంగుల ప్లాన్లువేసి ముస్తాబుచేసి.... దూరంగా తీసుకపోయి విశాఖమీద ఆశలు వున్నవాడికి అమ్మాలి లేదా....

అలా కాకుండా, రాజకీయనాయకులు, ఇండస్ట్రియలిస్టులు ఎక్కడకొంటున్నారో తెలుసుకోవాలి. అటువేపు వెళ్ళి భూముల్ని కొనాలి. అప్పుడు కలిసొస్తుంది. అలాంటివి పట్టుకోవాలి. అంటే హైసొసైటీలో తిరగాలి.

దానికి శ్రీకారం చుట్టాను. వాల్తేరు క్లబ్బులో మెంబర్ షిప్ లయన్స్ క్లబ్బులో మెంబర్ షిప్ తీసుకున్నా పార్టీలకి, బ్లడ్ డొనేషను కేంపులకి, సోషల్ వర్కుకి ఎటెండ్ అయ్యాను.

అందులో భాగంగా ఒక పార్టీలో గిరిజాదేవి పరిచయం అయింది. గిరిజాదేవికి యేవ్యాపారం లేకపోయినా. అన్నింటిలో ముఖ్యంగా రియల్ ఎస్టేట్ లో బాగా డబ్బు పెట్టిందని తెల్సింది.

అందుకే గిరిజాదేవితో పరిచయం పెంచుకున్నా అప్పుడు తెల్సింది. గిరిజాదేవికి వొక కూతురుందని, పేరు వత్సల. గిరిజాదేవికి నలభైయిదేళ్ళు వుండచ్చు. చిన్నప్పుడే, విడో అయింది. మొగుడు రియల్ ఎస్టేట్ బిజినెస్ చేసేవాడు. ఇప్పుడీవిడా అదే చూసుకుంటుంది. కానీ ఆ పని చేసిపెట్టడానికి ఆవిడకి కావల్సిన వాళ్ళున్నారు. ఆవిడ ఈస్ట్ కోస్ట్ రియల్ ఎస్టేట్స్ కి మేనేజింగ్ డైరెక్టరు.

పేరుకి మాత్రం గిరిజాదేవి మేనేజింగ్ డైరెక్టరు. మిగతా విషయాలన్నీ అన్నయ్య చూసుకుంటాడు. మనిషి కరుకు. రాజకీయనాయకులతో పరిచయాలున్నాయి అతనికున్న ఏకైక గుణం అబద్ధం చెప్పడం,అందుకే గిరిజాదేవే బెటర్ అనిపించింది.

గిరిజాదేవితో పరిచయం పెరిగేకొద్దీ... వత్సల మీద మోజు పెరిగింది. అందంగా వుంటుంది. సన్నగా తెల్లగా పెదాలకి లిప్ స్టిక్ తో, ఆకర్షణీయంగా ప్లాస్టిక్ చుట్టిన చాక్లెట్ లా వుంటుంది. వత్సలని గమనిస్తున్నానని తెలియగానే గిరిజాదేవి నా మీద ఇంట్రస్టు చూపింది.

అందులో భాగంగానే వో ఆదివారం వాళ్ళింటిలో డిన్నర్ .

గిరిజాదేవి ఆడంబరం మనిషి. లాసెన్స్ బె కాలనీలో సముద్రపు ఘోషలో ప్రశాంతంగావుంది ఇల్లు. గిరిజాదేవి నాగురించి వాకబు చేస్తోందని తెల్సిన్నాడే నేకొంత వూహించాను. ఈ ఆహ్వానం కోసం ఎదురుచూసాను. ఆమెకి నా ఫ్రూడ్ నెస్ నచ్చి నన్ను విందుకి ఆహ్వానించి వుంటుంది.... కానీ విందునాడు వత్సల నచ్చింది నాకు....

స్లీవ్ లెస్ చూడిదార్ కుర్తా పల్చటి చున్నీ ముసుగులో తెల్లగాగుద్రంగా బుజాలు, వాటినిమేచ్ చేస్తూ ఎత్తులూ, ఇరవైనాలుగుకొల్తతో నడుము. వత్సల ఆకర్షణీయంగా వుంది.కళ్ళుతిప్పుకోడంకష్టం, మనసుకి హాయి కలిగించింది.

ఆ విందులో మాటల సందర్భంలో... వైజాగ్ భీమిలి బీచ్ రోడ్ లో ఎక్కడే నా ఓపదిఎకరాలుకొను అంది.

అది తప్ప మిగత కబుర్లన్నీ మామూలులే. మర్నాడే విశాఖభీమిలీ బీచ్ రోడ్ పట్టాను. రోడ్డానుకొని ఏభూమిలేదు. అన్నీ చీఫ్ మినిష్టరుగారి సంతానం లేదా కిత్ అండ్ కిన్ అంటారే వాళ్ళు కొనేసినవే రోడ్డుకి వెనగ్గా వెళ్ళి వో పదెకరాలు కొన్నాను. నా సర్వేలో తెల్సిన విషయాన్నే గిరిజాదేవికి చెప్పాను.

కానీ అప్పటికే గిరిజాదేవి చాలా భూములు బేనామి పేర్లమీద కొంది. అంటే రైతులకి అడ్వాన్స్ఇచ్చేసింది.

గిరిజాదేవి ఏసజషనూ వొట్టినే చేయదు దాని వెనకాల కథ కథనం వుంటాయి. ఆ భూముల విషయం కొన్న కొన్నాళ్ళకిగాని తెలియలేదు.

❦❦❦

ఈ కొత్త వ్యాపార సమాజంలో మోడష్టీకి చాలా విలువుంది.

మోడష్టీ వెనుక మోసం వుంటుంది. దానితోనే వ్యాపారం. అందరూ భూములు కొన్న తర్వాత ఎకరానికి లక్షరూపాయల చొప్పున కలెక్ట్ చేసి ముఖ్యమంత్రిపేర మొదలు పెట్టిన ట్రష్టు సహాయనిధికి సమర్పించారు.

దాంతో భీమిలీ టూరిష్టు ప్లాన్ ప్రకటించింది ప్రభుత్వం . పథకం ప్రకటించడం వరకే ప్రభుత్వపు పని. పథకం ప్రజలకి అమ్మిడబ్బుచేసుకోడం రియల్ ఎష్టేట్ వ్యాపారుల్ది.

ఆ విధంగా భీమిలీ బీచ్ రోడ్ లో గిరిజాదేవి వేసే వెంచెర్లని కేష్ చెయ్యడంలో నేను ముఖ్యపాత్ర వహించాను.

ఈ విషయాల్లో గిరిజాదేవికి సన్నిహితంగా తిరగడం వలన, గిరిజాదేవి మనసు ప్రసన్నం అయింది. వత్సలతో చనువు పెరిగింది.

..........................

మేం వేసిన వెంచెర్లు అడ్వర్ టైజ్ చెయ్యడానికి , ప్లాట్లు అమ్మడానికి కొన్ని ఆఫీసులకి కొన్నివూళ్ళకి వెళ్ళాల్సివచ్చేది.

గిరిజాదేవి అన్నయ్య గిరిజాదేవి డబ్బుతో రియల్ ఎష్టేట్ వ్యాపారాన్ని మొదలుపెట్టి తనకి అంటూ వొక ఇడెంటటీ సంపాదించాడు. దాన్ని వుపయోగించి వ్యాపారాన్ని ప్రమోట్ చేసుకోడానికి ఎక్కువ సమయం, ఇన్ ఫ్లుయెన్స్ వుపయోగిస్తున్నాడు. అది గిరిజాదేవి పసిగట్టింది. ఎందుకంటే వచ్చే ప్రాఫిట్ తగ్గింది. అందుకే అతన్ని రిప్లేస్ చెయ్యగల మనిషిని వెదుకుతోంది. గిరిజాదేవికి నామీద నమ్మకం కుదురుతుందా? వసరానికే నన్ను వాడుకుంటుందా? ఇవన్నీ ప్రశ్నలు కానీ అన్నయ్యని తప్పించే టైమొచ్చిందని గిరిజాదేవికి తను తప్పుకునే టైమొచ్చిందని ఆ అన్నయ్యకి అర్థం అయింది.

ఆయన తప్పుకున్నాడు. గిరిజాదేవి నన్ను వెంచర్లు అడ్వర్ టైజుమెంటుకి పంపుతోంది పొద్దున్నే కారులో వెళ్ళి వెంచర్లు కొందరికి చూపించి సాయంకాలం వెనక్కి వచ్చేసే అవకాశం, ప్లానింగ్ వున్నప్పుడు నాతోపాటు వత్సలని కూడా పంపుతోంది. వత్సలచిలకపలుకులు, వత్సల వొక ఆకర్షణ, అని ఆమెకి తెలుసు. నాకు తెలుస్తోంది.వత్సలకే తెలియదు. అందంగా అలంకరించు చిలకపలుకులతో మా విశాఖలో వెంచర్ వేస్తున్నాం... అంటూ అడిగిన ప్రశ్నలకి ముద్దుముద్దుగా జవాబులిస్తూ వగలుపోయే వత్సల ఈ బిజ్ నెస్ కి ఏడెడ్ ఏడ్వాంటేజ్.

వత్సలలో కబుర్లుచెప్తూ , హాస్యాలాడుతూ చేసే ప్రయాణం వోఅందమైన అనుభవం.

కలిసి ప్రయాణంచేసినప్పుడు, లేదా కలిసి మెలిసినప్పుడు చిలిపితనం చిగిరించకమానదు... చిలిపితనాలకి చిగురించని స్నేహం.... ఆనందించని మనసు వుండదు. అందమైన వత్సలకి పెదాలమీద నవ్వు... ముత్యాలపేరులా పలువరుస.... నాడ్రీమ్స్ కి పునాది అని చెప్తే ఏఆడది ఆనందించదు.

తిరుగు ప్రయాణంలో అలసి నాభుజంమీద సొలసిపోయే వత్సల నాకు చేరువయింది. ఇవన్నీగిరిజాదేవికి తెలుస్తున్నాయి. కానీ ఆటంకపర్చలేదు.

అంటే వత్సలతో చనువుపెంచచ్చు... కానీ వత్సలతో చనువుని గిరిజాదేవి చాలా సీరియస్ గా తీసుకుంటుంది. అదితెలుసు.

రోజులు గడుస్తున్నకొద్దీ చనువు పెరిగినకొద్దీ ... ఇద్దరిమధ్య ఆకర్షణ కూడా పెరిగింది.

గిరిజాదేవి వత్సలని ప్రపోజ్ చెయ్యడం నేను ముందువెనుకా చూడకుండా వొప్పేసుకోడం.

వత్సలతో పెళ్ళి జరిగిపోడం... కనురెప్పపాటుకాలంలో జరిగాయా అని అనిపిస్తోంది.

..............................

నాకు వత్సలకి పెళ్ళయి ఆరునెలలు దాటినా వత్సల మాయింటికి కాపురానికి రాలేదు. నేను రమ్మని బలవంతం చేయలేదు. అమ్మ దేవుడు భక్తిలో మునిగి ఆవిషయాన్ని పట్టించుకోలేదు.

నాన్న ఇంటిచాయలకే రావడం మానేసారు. కానీ పెళ్ళయిన పదినెల్లకి, గిరిజాదేవి విదేశాలకి వెళ్ళాల్సిన పని పడింది. , వెళ్ళింది. వత్సలని వొప్పించి మా ఇంటికి తీసుకొచ్చాను.

వత్సలని ఇంటికి తీసుకొచ్చే ముందు నాపడకగదిని రినొవేట్ చేయించా వత్సల ఇష్టానికి అనుగుణంగా .....

అందుకే వత్సల వచ్చింది. వచ్చిందిగానీ వత్సలకో రొటీన్ వుంది. దాన్ని కొంచెం కూడా మార్చుకోదు. నేను మార్చుకోమనిచెప్పను. వుదయం పదికిలేస్తుంది కాఫీ తాగుతుంది. ఫేషియల్ చేసుకు మేకప్ కార్యక్రమంలో వుంటుంది. పదకొండుగంటకి టిఫిన్ తింటుంది. తయారై క్లబ్బుకి వెళ్ళపోతుంది. మళ్ళీఏరాత్రితొమ్మిదికో, పదికో....ఇంటికి చేరి భోజనం చేసి తలనొప్పిగా వుందని నిద్రమాత్రమింగి నిద్రపోతుంది.

ఈ కార్యక్రమంలో మార్పులేదు.మాఇంటికి వచ్చాక తలనొప్పి మరీ ఎక్కువైంది. పగలుకూడా, తలనొప్పికి మాత్రేసుకోవల్సి వస్తోంది.

అమ్మతో మాట్లాడింది తక్కువ అమ్మకూడా కలుగచేసుకోలేదు. ఆవిడభక్తేమో ఆవిడేమో. నేలేనప్పుడు నాన్నగారోస్తారు. ఆయనతో ముక్తసరిగా మాట్లాడుతుంది. అంతకు మించి సంబంధం మాముగ్గురిమధ్యామిగల్లేదు.

పెళ్ళయిరెండేళ్ళలో మూడుసార్లు గిరిజాదేవి ఫారిన్ వెళ్ళింది. మూడుసార్లు వత్సల మా ఇంటికి వచ్చింది. ఎంత మాఇంటికొచ్చినా అంటీ అంటనట్టుండి వాళ్ళింటికి వెళ్ళిపోయేది.

ఏవిధమైన రియాలిటీ వుండదుగాబట్టీ వీళ్ళందర్నీరియల్టర్స్ అన్నారు.

-------------------------------

భూమి అమ్మిన రైతు అమ్మిన డబ్బుతో పెద్దకొడుకులిద్దరికి ఆటోలు కొన్నాడు. దాన్ని విశాఖటౌనుకి తీసుకెళ్ళి సాయంత్రానికి గూడు చేరుకునేవారు. అలావాళ్ళు. విశాఖవెళ్ళడం వలన వాళ్ళ ఆలోచనలో స్వభావంలో చాలా మార్పు వచ్చింది. నా మొదటి వెంచర్ అమ్మిన తర్వాత రెండో వెంచెర్ కోసం కష్టపడాల్చి వచ్చింది.

భూమి రేటును భారిగా పెంచాడు రైతు. ఆ రేటుకి కొంటే లాభం తగ్గుతుంది. గ్రామాల్లో ప్రతీ ఇంటికి ఆటోవో రిక్షావో కమాండర్ జీపో వుంటోంది. దినదినం వాటిమీద ఆదాయం వస్తోంది. ఆడబ్బు వడ్డీకి వెళ్తోంది.

భూమి రేటు పెరుగుతోంది. అందుకే చురుకుదనం చూపడం తప్పదు. అది భూమికొలతలవిషయం కావచ్చు, పవర్ ఆఫ్ అటార్నీ రాయించుకోడంలో కావచ్చు, వెంచర్ ని అమ్మడంలో కావచ్చు. రోజురోజుకి ఇటు రైతుల్లో అటు ప్రజల్లో పెరిగిపోతున్న ఇన్ పర్మేటివ్ తెలివికి తట్టుకోలేకపోతున్నాం .

అప్పుడప్పుడు ప్రాఫిట్ రాదేమో అనుకున్న చోట చిన్న మజిల్ ఫ్లెక్సింగ్ చెయ్యాల్సి వస్తోంది దానికి పెట్టేఖర్చుకన్నా మజిల్ ఫ్లెక్సింగ్ వాళ్ళొచ్చి అడిగే దేవినవరాత్రి చందాలుభారీగా వుంటున్నాయి. అది వాళ్ళు చేసే మృదువైన ఫ్లెక్సింగ్ ....,

వ్యాపారం పెరుగుతున్నకొద్దీ దాన్ని స్వంతంగా చూసుకోవలసిన అవసరం బాగా ఎక్కువ ..., వత్సలతో దూరం పెరుగుతోంది, క్లబ్బు, వాళ్ళిల్లూ, మా ఇల్లూ పరిమితి వల్ల వత్సలకి ప్రపంచం ఇరుగ్గా అనిపిస్తోంది.

గిరిజాదేవి ఏదో ఫారిన్ కొలాబరేషనుకి ప్రయత్నిస్తూ చాలాకాలం ఢిల్లీలో గడుపుతోంది. ఆమెకి తోడుగా రాజకీయనాయకులు వుంటున్నారు. ఆతోడు గురించి చాలామంది సెక్సీగా మాట్లాడుకుంటున్నారు. అది వేరే విషయం వత్సల మాఇంట్లో వున్నప్పుడు చిరాకుగా కరుకుగా వుంటోంది. ఎందుకు అన్నదానికి సమాధానంలేదు.

వత్సలకి నిద్రమాత్రల అవసరం ఎక్కువైపోతోంది. ఆరోజు తొమ్మిది గంటలకే నిద్రలేచిన వత్సల కాఫీకోసం కిందకి దిగింది. డైనింగ్ టేబులుదగ్గర అమ్మ కాఫీతాగుతూ ఎదురుపడింది.

"నిద్రబాగా పట్టిందా? వత్సలా" అనడిగింది.

"లేదు"

"ఏం"

"వొకటే తలనొప్పి నిద్రమాత్ర వేసుకున్నా నిద్రపట్టలేదండి." అంది చిరాకుగా.

రోజులా అయితే ఏముండకపోను కానీ అమ్మ నే చెప్పినట్టు చేస్తావా నీకు తలనొప్పి పోయి నిద్రపడుతుంది అంది ఏకళనుందో వత్సల వొప్పుకొంది.

ఇద్దరికి ఘర్షణ జరుగుతుంది. అమ్మ చెప్పినవి వత్సలకి నచ్చదు. వత్సల విసుక్కుంటే అమ్మ బాధపడుతుంది..... అనుకుని నేను ఆఫీసుకెళ్ళిపోయా.

అమ్మ లక్ష్మినిపిలిచి కొబ్బరినూనె తెప్పించి.... వత్సల తల మునిగిపోయేటట్టు నూనెరాసింది. రాస్తూ

"సహజమైన అందం వుండగా నీకు మేకప్పు అవసరమా?" అంటూ వత్సల అందాన్ని మృదుత్వాన్ని ఆకాశానికెత్తేసింది. దాని వల్ల వత్సల కూడా కిమ్మనలేదు. లేకపోతే దాని చిరాకంతా బయటపడిపోను.... కార్యక్రమం చెడిపోను. ఆరోజు నలుగుపిండితో వళ్ళంతా పట్టిపట్టి నలిచి కుంకుడుకాయపులుసుతో తలరుద్ది, స్నానం చేయించింది. అంతా అయాక మేడమీద పక్కమీద పడుకోపెట్టి తలకి చిక్కుతీస్తూ సాంబ్రాణి పొగేసింది.

సాంబ్రాణి మత్తుకే వత్సలకి మైకం కమ్మేసింది జుత్తుచిక్కులు విడుతున్నకొద్దీ మత్తుముడులు వేసేసింది.

లక్ష్మి సాంబ్రాణి పొగ పూర్తిచేసి లేచేసరికి వత్సల మంచినిద్రలోవుంది.

అలా పడుకున్న వత్సల భోజనానికి రెండుకి లేచింది. భోజనం చేసి మళ్ళీ పడుకుంది.

నేనింటికి వెళ్ళేసరికి, వత్సల హాల్లో కూర్చుని టీవీ చూస్తోంది. వత్సల రోజులా లేదు. మంచుకి తడిసిన చిగురుటాకులా వుంది. షిఫాన్, జార్జెట్ లాంటి చీరల్లో కాకుండా క్రేప్ సిల్క్ చీర శరీరానికి ముచ్చటగా అతుక్కుని అందం తీసుకొచ్చింది. ఎప్పుడూ లేనిది తల్లో పెద్దమల్లెచెండు, వదులు జెడ అంతా పెద్దయుటర్న్..., కోర్కె, వుద్రేకం ఈరెండే వత్సలకి నాకూ మధ్యరాజ్యమేలేవి. ఈ రోజుకోర్కె దాని మత్తు దాని మృదుత్వం చోటుచేసుకున్నాయి. ఇద్దరికీ శరీరం వొకటే చల్లబడలేదు. మనసు మురిపెంతో మత్తుగా జోలిసోలిపోయింది.

ఇదంతా అమ్మ సలహా తాత్కాలికం, కానీ గిరిజాదేవి వచ్చాక ఎలా వుంటుందో ఏమవుతుందో అన్న అనుమానం లేకపోలేదు.

.........................

వత్సల నాజూకుగా చిగురుటాకులా తయారయింది. గిరిజాదేవి గమనించకపోలేదు. అది నాకు ఆనందమే. వత్సల గిరిజాదేవికి దూరమై అమ్మకి దగ్గరైంది. రోజూ స్నానించిగాని టిఫిను చెయ్యదు. స్నానించగానే దేవుడిముందుధ్యానించవలసిందే ఇరుగుపొరుగు పేరంటానికి కూడా వెళ్తోంది.

ఇలాంటివి పసిగట్టిన గిరిజాదేవి లోలోపల ఆశ్చర్యపోయిన పైకి మాత్రం ఏం తేలలేదు.

వత్సలలో ఎంత మార్పంటే ... నాకన్నా ముందు లేచి కిందకి వెళ్ళి కాఫీ కప్పులతో వచ్చేది ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూ కాఫీ తాగేవాళ్ళం... తర్వాత స్నానించి కిందికి వెళ్ళి అమ్మకి వంటింట్లో సాయానికి వెళ్ళేది. ఇంట్లో వత్సల నాపై శ్రద్ధచూపుతోంది. కలిసిమెలిసి వుంటోంది.

గిరిజాదేవికి ఈమార్పు నచ్చలేదు.

ఓ రోజు నా సమక్షంలోనే

"నువ్వు చెయ్యకపోతే వొంటఅవదా?" అనడిగింది కూతుర్ని.

"ఏం అలా అడిగావ్"

"నువు వంటచేసేంత, అపరాధం ఏం చేసావో తెలుసుకుందామని."

"వంట చెయ్యడం అపరాధమా?"

"అవసరం లేని పనిచెయ్యడం, తనని తాను బాధించుకోడం మరి అపరాధమే"

"జీవికి వంట చెయ్యడం తప్పా"

"చేసేవాళ్ళున్నారు, నీకా అవసరం లేదు."

వత్సల మాట్లాడలేదు. తల్లి నిలదీయడం నచ్చలేదు. వత్సలకి చాలా నచ్చడంలేదు. కానీ ఏం చెప్పలేకపోతోంది. నేనేం మాట్లాడలేదు, కనీసం గిరిజాదేవి తరుపునగానీ వత్సల తరుపునగానీ మాట్లాడడం వల్ల ప్రయోజనం లేదు.

............................

వత్సలలో మార్పు గిరిజాదేవికి ఎలా నచ్చలేదో, వెనుకటి సెంటెడ్ జీవితంలో నకిలీతనం వత్సలకీ నచ్చలేదు. వత్సల మా ఇంటినే ప్రిపర్ చేసి ఇక్కడే వుండిపోతోంది. అదినాకు నచ్చుతోంది. గిరిజాదేవికి నచ్చడంలేదు. కానీ పనివత్తిడి వల్ల ఏం చెయ్యలేక పోతోంది.

ఇద్దరుముగ్గురు వ్యాపారస్థుల పెళ్ళిళ్ళకి వెళ్ళినప్పుడు అందరూ వత్సలలో మార్పుచూసి ఆశ్చర్యపోయారు.
కొందరు "ఏమిటి వత్సలా ఇలా వున్నావ్?" అన్నారు.

"నౌ అయామ్ మేరీడ్ వుమన్" అంది.

"వూ" అని దీర్ఘం తీసినా వాళ్ళ కళ్ళల్లో అప్రీసియేషను పసిగట్టేసింది వత్సల.

వత్సల అలంకారం కాక, నాపక్కన వత్సల అలంకారంగా వుంది. వత్సల వ్యక్తిత్వంలో కూడా మార్పొచ్చి... అది ప్రత్యేకంగా కొన్ని విషయాల్లో తెలిసేది. నా అవసరాలనూ గమనించి మెలుగుతోంది.

అమ్మ అవసరాలని పట్టించుకుంటోంది. ఇంటివిషయాల్లో కలుగచేసుకుని, అమ్మతో సమాధానపడి నిర్ణయాలు చేస్తోంది. అలాంటి నిర్ణయాల్లో వొకటి నాకు ప్రతిఫలాన్నిచ్చింది.

ఇలాంటి విషయాలు చెవుల్లోనే ఎందుకు చెప్తారు. రహస్యంగా ఎందుకు చెప్తారు. కాని మనసు పొందిన ఆనందం ముందు చాలా ప్రశ్నలు పుట్టలేదు.

"నిజంగా" అన్నా ఆశ్చర్యంతో.

"ఊ" అంది.ఎర్రపెదాల్ని సున్నాచుట్టి.......

"మరి మాత్రలు వేసుకోడం మానేసావా"

"మానేసి మూడునెలయింది."

"మరి ..అందం ..శరీరపు బిగి ...రా..",,

"ఊ" అంటూ కోపంగా చూసింది వత్సల.

"సరిసరి మరి ప్రిగ్నెంసీ అంటే భయమేమో"

"లేదు"

"అమ్మకి తెలుసా"

అత్తగారే మీతో చెప్పమన్నారు.

వత్సలలోలేని అందాలు కనిపిస్తున్నాయి. అందంగా వుంటారా కనబడతారా చూసేవాళ్ళదృష్టిలో వుంటుంది.

అమ్మకి మనసులో ధన్యవాదాలు చెప్పుకున్నా... గిరిజాదేవిని తలుచుకు భయం వేసింది.
కానీ ఇంట్లో బాబో పాపో తిరుగుతారంటేనే ఎంతో ఆనందంగా వుంటుంది.

"ఏరా నీలో నువ్వే నవ్వేసుకుంటున్నవ్" అంది అమ్మ

"నీకు తెలిసినా చెప్పలేదేం"

"ఎవరి హక్కు వారిదే ఎవరివార్త వాళ్ళే చెప్పాలి" అంది అమ్మ నవ్వుతూ.

..........................

ఈ వార్త గిరిజాదేవిని కలవరపెట్టి ... కోపగించింది. వత్సలని పాడుచేసావంది నాతో.....,
ఈ వయసుకే పిల్లలెందుకే అంటూ వత్సలని నిలదీసింది. వత్సల నవ్వేసింది.
"పిల్లల్ని కనడానికి ఇంకా టైముంది. ఎబార్షన్ చేయించుకో" అంటూ నిలదీసింది.

అన్ని అవాంతరాలనీ వత్సల చిరునవ్వుతో ఎదుర్కొంది. మగపిల్లవాడ్ని కంది. వాడికి వాళ్ళ నాన్నగారిపేరు పెట్టి, బాలసారె చాలా ఘనంగా జరిపించింది అమ్మ.

...............................

గిరిజాదేవి మారింది. బిజినెస్ లో నా సలహా... సహాయం అవసరంగా చేసుకు, నాకు సన్నిహితం అవడానికి ప్రయత్నిస్తోంది. నేను కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో కాకుండా ఫిషింగ్ ప్రాన్స్ ఎక్స్ పోర్టు లో తలదూర్చాను. అందుకే సమయం నడుస్తోందో, పరిగెడుతోందో అర్థం కావడంలేదు.

కానీ అమ్మకి వత్సలకి తాతగాడితో సరిపోతోంది. అందరూ అన్ని రకాలుగా బీజీ అవడంతో .. లేవిష్ పార్టీలు ... ఆదివారాలు అవుట్ డోర్ ఎంజాయ్ మెంట్సూ తగ్గిపోయాయి. అలసిన శరీరం అమ్మ స్వాంతనతో ... తాతగాడి చిలిపి తనంతో... వత్సల అందాలతో రోజులు గడిపేస్తున్నా తాతగాడికి నాలుగోఏడు ...వచ్చిందనగా

వత్సల మరో స్పెర్మ్ టోజోవా సక్సెస్ గురించి చెప్పింది... నో థ్రిల్... అది బయటపడ్లా ...అమ్మ ఆనందించింది.

"ఎంత మందిని కంటావే ...." అంటూ గిరిజాదేవి విసుక్కుంది. కొరియా వెళ్ళిపోయింది.

గిరిజాదేవి దేనికోసం ఇంతలా శ్రమపడుతోంది. ...డబ్బుకోసమా ... పేరుకోసమా...ఇదొక పూనకం, సక్సెస్ పూనకం సక్సెస్ అయితీరాలన్న వీక్ నెస్. ఇది గిరిజాదేవిని ఎక్కడా నిలవనీకుండా చేస్తున్నాయి. గిరిజాదేవి ఇండియా వచ్చిన కొద్దిరోజులకే జాయింటు వెంచర్ ప్రాజెక్టు కోసం కొరియన్ డెలికేషన్ విశాఖపట్నం వచ్చారు. వీళ్ళందర్నీ, అరకులో గెస్ట్ హౌస్ బుక్ చేసి అక్కడుంచింది గిరిజాదేవి. నేను గిరిజాదేవి అరకు వెళ్తే సరిపోతుంది. కానీ వత్సల కూడా రావాలని పట్టు పట్టింది గిరిజాదేవి. వత్సల ఎందుకూ? అని ప్రశ్నించలేదు. అలా ప్రశ్నించే ధైర్యం గిరిజాదేవి నాకు ఇవ్వలేదు....వత్సల చూపించదు.

అమ్మ కాస్త సణిగింది. "వత్సలెందుకురా. ఇక్కడ వుండనీ వుంటుంది." అందివత్సలెందుకు నిజమే తనని తీసుకెళ్ళవలసిన అవసరం లేదు. కానీ గిరిజాదేవి వొప్పుకోదు. వత్సలనిమార్చేసేరు అని ఆమెనమ్మకం. పైకి చెప్పదు కానీ ఆ విసుక్కి, కంటిచూపుకిఅదేఅర్థం.

.................................

నేను వత్సల గిరిజాదేవి గిరిజాదేవి కారులో అరకు బయలుదేరాం... దారిలో మలుపుల, వయ్యారాలూ, అరకులోయ ప్రకృతి సోయగాలూ మామనసుకు చాలా ఆహ్లాదాన్ని కలిగించాయి.

నాలుగురోజులు బిజినెస్, నెగోషియేషన్స్ అంటూ ఎక్కడా తీరికలేకుండా గడిచింది. వచ్చిన్నాడే , డ్రైవరుకి ఏదో సమస్య వచ్చి విశాఖపట్నం వెళ్ళిపోయాడు.

అయిదోరోజుకి వచ్చిన పనైపోయింది. కొరియన్ డెలిగేషన్ వైజాగ్ వెళ్ళపోయారు. మేం మాత్రం వెనక్కి వుండిపోయాం. డ్రైవరు లేడనే నెపంతో కొరియన్ డెలిగేషన్ తో ఆఫీషయల్స్ అందరూ వెళ్ళిపోయారు. ఆ రోజు రాత్రి డిన్నర్ చేసి తొమ్మిదిన్నరకి, నిండువెన్నెల్లో నల్లత్రాచులా మెలికలు తిరిగిన రోడ్డుమీద కారు మలుపులు తిరుగుతూ దూసుకుపోతోంది. పన్నెండుకల్లా విశాఖపట్నం చేరుకుంటాం అనుకున్నాం ... కానీ అనుకున్నవి అనుకున్నట్టు జరగవు.

జరిగిన సంఘటనల ప్రభావం ఎవరిమీద ఎలా వుంటుందో చెప్పలేం ...

గిరిజాదేవే కారు నడుపుతూ.. కారు తిరుగుతున్న మెలికల్ని ఆనందింస్తోంది. కొండమలుపులు...పిండి వెన్నెల... చెట్లనీడలు... లోయలోతులు వాతావరణం ఆహ్లాదంగా వుంది. ఎంతకీ తరగని బెండ్స్... అమ్మో మలుపులంటే నాకు భయం అంటూ వెనక్కి కూర్చుంది వత్సల.

తల్లికి కూతురికి ఎంత తేడా... వొకళ్ళకి మలుపుల్లో, ఘాటీలో కారు నడపడం సరదా... థ్రిల్...

ఇంకొకళ్ళకి ఆ మలుపులన్నా.. ఆలోయలన్నా భయం. భయం అంటే ఏమిటి ఎందుకు భయం వేస్తుంది? ఒక అభద్రతాభావం వల్ల భయం కలుగుతుందా? లేక భయం మానసికరోగమా? ఎందుకు భయం.. ఏపనిచెయ్యాలన్నా జంకు ఎందుకు కలుగుతుంది? అదే భయమా... గుండెచప్పుడు పెరుగుతుంది. అందరికీ భయం వెయ్యదా కొందరికి అరచేతిలో చెమట్లు... కొందరికి గుండె దడా ఎందుకు

పెరుగుతాయ్?భయం.. దేవుడంటే భయం... దెయ్యం అంటే భయం... ఎందుకుండాలి? భయాలన్నీ వొకటేనా.. వేర్వేరా... దెయ్యం హాని చేస్తుందనే భయం, దేవుడికి శిక్షించే అధికారం వుందని భయం, ఏదేనా పాపమో పుణ్యమో ఎలా తెలుస్తాయి.

దేవుడికి తెలుస్తాయనే నమ్మకం అన్నింటికీ మెదడే మూలస్థానం, అన్నీ మన ఆలోచనల్లోనే వున్నాయా నిజంగా అవేవీ లేవా.

కారు మలుపులు తిరుగుతూ బుర్రాకేవ్స్ దాటింది.

దబ్బని చప్పుడయి కారు ఎగిరి పడింది. గిరిజాదేవి సడన్ బ్రేక్ వేసింది. ఇంజన్ ఆగిపోయింది. మలుపులో నీడలో యేదీ కనబడలేదు. కారు దేన్ని గుద్దేసింది. యేం జరిగింది. ముందు చక్రం దాని మీదుగా వెళ్ళిపోయింది. కానీ అప్పటికే ఇంజను ఆగిపోవడం వల్ల వెనక చక్రం దాని మీంచి వెళ్ళలేదు. దాని బాడీ కారు ముందు, వెనుకచక్రాల మధ్య ఇరుక్కుపోయింది.

గిరిజాదేవికి భయం వేసుంటుంది... ఏం చెయ్యాలి. .. కారు దేన్ని గుద్దింది? ఆగిపోయిన కారులో గిరిజాదేవి నేను, వెనుక వత్సల మాటా పలుకు లేకుండా కూర్చున్నాం... నేను ముందసీటులో కూర్చోవడం వల్ల వత్సల ఏస్థితిలో వుందో నాకు తెలియలేదు. వెనగ్గా సీటులో నిద్రపోతున్న వత్సల, భూకంపం వచ్చినట్లనిపించిందేమో? జీవీ. అంటూ కీచుపెట్టింది.

ఇంజను ఆగిపోవడంతో headlights డిమ్ అయిపోయాయి. ప్రదేశం అంతా చీకటిమయం వత్సల,ఏమిటి అంటూ భయం భయంగా అడిగింది. నేను ఏం మాట్లాడుతాను. గిరిజాదేవి ఏక్సిడెంట్ షాక్ నుండి తేరుకోలేదు.

కానీ ఈ చీకట్లో చింతగీరులరణగొణధ్వనిలో... బిక్కుబిక్కుమంటూ ఎంతసేపు కూర్చుంటాం.

"దేన్ని డేషిచ్చిందో చూసారా?"

"ఏదో జంతువు వేమో,కానీ ఏశబ్దం చెయ్యలేదు అరవలేదు చచ్చిపోయిందేమో?"

"ముందు కారు స్టార్ట్ అవుతుందో లేదో చూడండి"

కారు స్టార్టు చేసింది గిరిజాదేవి. కారు స్టార్టు అయింది. పర్వాలేదు హెడ్ లైట్లు ఆన్ అయాయి. కానీ దిగడానికి భయం, ఏదేనా జంతువు అయితే, చచ్చిపోతే పర్వాలేదు కానీ బతికున్నా,ఇంకో జంతువు కూడావున్నా చాలా డేంజర్. ఏంచెయ్యాలి?కారు స్టార్టు చేసి ఫస్ట్ గేర్ వేసి ముందుకి నడిపించబోయింది. కానీ కారు కదల్లేదు.ముందు చక్రాలకి, వెనుకచక్రాలకి మధ్య ఏదో ఇరుక్కుంది, కారు దేన్నో గుద్ది దానిమీంచి ముందు చక్రాలు వెళ్ళిపోయాయి.

ఏ జంతువో రెండుచక్రాలమధ్య ఇరుక్కుంది. దాన్ని తప్పిస్తే వెళ్ళిపోవచ్చు రాత్రి పది దాటుతోంది. చుట్టూ చీకటి అటునుండి కాని అటునుండి కానీ ఏకారూ రావడంలేదు. వస్తే విషయం తెలిసేది. ఏం చెయ్యాలి?తలుపు తీసి దిగబోయాను. వత్సల భయంగా నాచెయ్యి పట్టుకుంది.

"పర్వాలేదు. హెడ్ లైట్స్ వున్నాయిగా" అన్నా.

అప్పటికి కళ్ళు చీకట్లో చూడడానికి అలవాటు పడ్డాయి. కారు దిగి నెమ్మదిగా గిరిజాదేవి కూర్చున్న వేపు వెళ్ళాను. కారుకింద రియర్ వీల్స్ దగ్గర ఏదో నల్లగా కనిపించింది. ఏజంతువో తెలియడంలేదు. కారులో లైట్ వెయ్యమని ఫుట్ బోర్డు లైటు కూడా వేసి వత్సలని డోరు తెరవమన్నా, ఫుట్ బోర్డు లైటువేసి భయంతో కొద్దిగా డోరు తెరిచింది వత్సల.

ఆలైటు వెల్తురులో చూసిన దృశ్యానికి నాపైప్రాణం పైనే పోయింది.

కారుకింద పడింది. జంతువుకాదు. మనిషి రెండుకాళ్ళూ కనిపిస్తున్నాయి.

నల్లటికాళ్ళు అక్కడక్కడ ఎర్రటి రక్తంమరకలు.

"కారుకింద పడిందిమనిషి" అన్నా

గిరిజాదేవి రెండు నిముషాలు అవాక్కయింది. వెంటనే కారు దిగి, దీర్ఘంగా చక్రాలకిందమనిషిని చూసింది.

కింద పడ్డవాడి కాళ్ళమధ్య నిక్కరు వుంది. వాడు దొడ్డికి కూర్చున్నట్టున్నాడు. ఎవరికీ కనబడకుండా నీడలో మలుపులో కూర్చున్నాడు. మలుపుతిరిగే టప్పుడు కారు ఆమూలకి వచ్చింది.

"ఎవరేనా వస్తే అనవసరంగా గొడవ అవుతుంది. కేసవుతుంది. నే కారు బాక్ చేస్తాను. కాళ్ళుపట్టుకు శవాన్ని బైటికి లాగెయ్" అంది.

నేనే మనడానికి లేదు. నిజమే ఎవరేనా వస్తే అనవసరంగా గొడవ అయితీరుతుంది. గిరిజాదేవి ఆలోచనకి, ప్రెజెన్స్ ఆఫ్ మైండ్ కి ఆశ్చర్యం వేసింది. ఇదే అడ్వంచరా? ఇదే థ్రిల్లా? ఘాటీ మలుపులు మజా అన్నీ నీరుకారిపోయాయి.

నేను నా ఆలోచన నుండి తేరుకోనేలేదు. గిరిజాదేవి కారు ష్టార్టు చేసి కొంచెం వెనక్కి పోనిచ్చి, ఆపింది. కారుదిగి మసకవెల్తురులోనే , "జీవీ బైటికి లాగు" అంది.

బైటికి కనిపిస్తున్న కాళ్ళు పట్టుకులాగాను. లోపలినుండి, ఎవరో కుర్రాడి శవం బైటికి వచ్చింది. పదిహేనేళ్ళుంటాయి. బక్కగావున్నాడు. వంటిమీద చొక్కావుంది. అంతా నెత్తుటి ముద్ద , కారు బలంగా తగిలింది. స్పీడుగా చక్రాలు పైకి ఎక్కాయేమో వెంటనే చచ్చిపోయాడు. పొట్టపచ్చడిలా అయిపోయింది.మసకచీకట్లో ఆదృశ్యం భయంకరంగా కనిపిస్తోంది.

కాలు పట్టుకులాగడం వలన, పొట్ట దగ్గర విడి, ఇంకా కొంత భాగం వెనుక చక్రంకిందే వుంది. గిరిజాదేవి "దేనికి ఆలోచిస్తున్నావు లాగు...." అంది.

ఆ దమాయింపుకి, వత్సల బైటికి తొంగి చూసింది. శవాన్ని చూసి కీచుపెట్టింది.

"చూడకు లోపలికెళ్ళు" అంటూ గదమాయించింది గిరిజాదేవి. చేతులు పట్టుకు బైటికి లాగాను. శవం బైటికి వచ్చింది. పొట్టమీంచి చక్రం వెళ్ళిపోయింది. మాంసం ముద్దలు ఎర్రగా కనిపిస్తున్నాయి. వాటిని పక్కనేవున్నచెట్లపొదల్లోకి ఈడ్చేసాను. గిరిజాదేవి కారులోంచి వాటర్ బాటిల్ తీసి "చెయ్యి కడుక్కో.." అంది.అప్రయత్నంగా చెయ్యికడుక్కున్నా...

బైటపడ్డ శవాన్ని దీర్ఘంగా చూస్తోంది. వత్సల... కళ్ళల్లో భయం కనిపిస్తోంది. "రా వెళదాం" అని కారులో కూర్చుని కారు ష్టార్టు చేసి ముందుకిపోనిచ్చింది. కారు ముందుకి కదిలింది. వత్సలనే చూస్తున్నాను. కళ్ళల్లో భయంపోలేదు. ఇంక కారు కదిలింది. కదా అని లైటు ఆఫ్ చేసాను. అందరి మనసులు చెదిరిపోయి చికాకుగావున్నాయి.

ఇంతకు ముందులా కారు పురకలు పెట్టడంలేదు. నెమ్మదిగా వెళుతోంది. చెట్లచాటునుండి వెన్నెల అప్పుడప్పుడు తొంగిచూస్తోంది. రోడ్డంతా నిర్మానుషంగా.. నిద్రరావడంలేదు.అయినా కళ్ళు మూసుకున్నా... కారులో వెనుక సీటు విండో తెరిచినట్టయి వెనక్కి తిరిగి చూసా, వత్సల తలబైటికి పెట్టి వాంతిచేసుకుంటోంది. కారుపక్కకి తీసి ఆపి డేష్ బోర్డులోంచి వొక వాటర్ బాటిలుతీసి వెనుకసీటులోకి వెళ్ళికూర్చున్నా .

గిరిజాదేవి కారు పోనిచ్చింది.

...............................

ఏక్సిడెంటు జరిగాక గిరిజాదేవి కారుని చాకచక్యంగా నడిపింది. బురదలోంచి నీళ్ళలోంచి , నడిపింది.

"అదేమిటి అలా నడుపుతున్నారు కారు టైరు గుర్తులు పడవా" అన్నా.

పకపకా నవ్వింది గిరిజాదేవి.

"మన అదృష్టం కొద్దీ ఏలారీ రాలేదు. తెల్లవారుతున్న కొద్దీ క్వారీ లారీలు మొదలవుతాయి,పోలీసులు కుర్రాడి శవం కనుక్కుని ఇది హిట్ అండ్ రన్ అని గ్రహించేసరికి, చాలాసమయం పడుతుంది. అయినా చనిపోయిన వాడ్ని చూసావుగా, వాడి తల్లో తండ్రో పోలీసుల్ని ఇన్ఫ్లుయన్స్ చేసి హిట్ చేసిందెవరో లోతుగా ఇన్వెస్టిగేట్ చేయిస్తారని అనుకోను, పోలీసులకి అంత ఇంట్రెష్టు వుండదు.మనం హిట్ చేసి వచ్చామని గెరేజ్ వాడికి తెలియకూడదు. కారుకి కిందభాగాన రక్తపు మరకలు వుండకూడదు అంతే. ఇలా నడపడంవల్ల, కారుటైర్లు వెనుక,ముందుభాగం పూర్తిగా బురదమయం అయిపోయాయి. దాన్ని క్లీనింగ్ కి గేరేజికి పంపేయచ్చు..."

కొత్తగా ప్రోజెక్టు మొదలుపెట్టామన్న సంతోషం యేవరికి లేదు. నాకు తరుచూ కారుకిందనుండి లాగిన శవమే కనిపిస్తోంది. వాడ్ని పక్కకి లాగేసిన క్రూరత్వం వెంటాడుతోంది. మామ్మ విషయంలోలా ఇది తొందరగా మరుగున పడలేదు.

అందరం జరిగిన సంఘటనని రెండుమూడురోజుల్లో మర్చిపోయాం. లేదా మర్చిపోయినట్టు నటించాం, కానీ వత్సలకి మర్నాడు జ్వరం వచ్చేసింది. జ్వరం చాలా తీవ్రంగా వచ్చింది. జ్వరంలో కలవరింతలు మొదలయ్యాయి, ఏం చెయ్యడానికి తోచేదికాదు.

ప్రోజెక్ట్ కి భూసేకరణలో, పెర్మిట్స్ కోసం మంత్రులతో సమావేసాలు, ఫారిన్ ఏక్స్చేంజు కోసం, ఈపనులవల్ల తీరిక లేక నేను గిరిజాదేవి ఇద్దరం బీజీయే.

వో అర్ధరాత్రి వత్సల లేచికూర్చుని యేడవడం మొదలుపెట్టింది. "ఏమయింది?"అనడిగా.

"నేచచ్చిపోతానేమో?"

ఆమెని లాలించగలిగాను గాని, వత్సల వ్యాకులతని పోగొట్టలేకపోయాను. అదే విషయాన్ని గిరిజాదేవితో చెప్తే నిబ్బరంగా వుండు సమయం అన్ని సమస్యల్ని పరిష్కరిస్తుందిఅంది.

అప్పుడు వో విచిత్రమైన తాత్వికత ఆలోచన్లోచోటుచేసుకుంది.

గిరిజాదేవి యెవరికోసం చేస్తోంది.? యెందుకీపరుగు?, యెందుకీయావ,? ఇలాంటి ఆలోచనల్కి జీవితంలో డబ్బు పూనకం, యేదో సాధించెయ్యాలన్న తపన, సాధించింది చాలదన్నమత్తు, కొన్ని ఆలోచనల్ని దగ్గరికి రానివ్వదు.

ఇంట్లో నర్సు, రోజూ రెండుపూటలా విజిట్ చేస్తున్న డాక్టరు వత్సల జ్వరాన్ని తగ్గించలేకపోయాయి.

గిరిజాదేవికి నచ్చచెప్పి వత్సలని ఇంటికి తీసుకెళ్తానన్నాను.

"ఏం ఈనర్సూ...డాక్టరు తగ్గించలేని జ్వరాన్ని మీఅమ్మగారు తగ్గించేస్తారా.."అంటూ దెప్పింది. కానీ ఏకళనుందో తీసుకెళ్ళమంది.

వత్సల ఇంటి కొచ్చింది మొదలు మొదట నర్సుని తప్పించిందిఅమ్మ. డాక్టరు వస్తున్నాడు పోతున్నాడు.

అమ్మ తన నర్సింగ్ తో... తన కబుర్లతో వత్సలకి మనశ్శాంతి కుదిరి, జ్వరం తగ్గింది, ... కానీ మానసికంగా చాలా చికాకుగా వుంటోంది. వోకసారి తాతగాడు ఎర్రచొక్కా వేసుకుంటే హిష్టారిక్ దాన్ని చింపేసింది. ఇంకెప్పుడూ అలాంటివి వేసుకో వద్దని వాడిని కొట్టింది. ఆచొక్కా నచ్చి వాడికి వత్సలే కొంది.

వత్సలని సైకియాట్రిక్ దగ్గరికి తీసుకెళదామనుకున్నా దానికి గిరిజాదేవి అనుమతి అవసరం యెంతేనా వుంది. ముందుగ వత్సలతో అన్నా..,"యేం నేను పిచ్చిదాన్ని అనుకుంటున్నారా?" అంటూ సీరియస్ గా చూసింది.

"యేం పిచ్చివాళ్ళే డాక్టరు దగ్గరికి వెళ్తారా?"

"––––––––––––––––––––"

“మానసికంగా కృంగిపోకుండా , ధైర్యంగా వుండడం కోసం డాక్టరు సలహా తీసుకుందాం” ,,అన్నా.

వత్సల ఏం మాట్లాడలేదు. రెండుమూడుసార్లు నచ్చచెప్పిన తర్వాత వొప్పుకుంది.

డా.స్నేహలత దగ్గరకి వెళ్ళాం , నేచెప్పింది విన్న తర్వాత , అత్తగారింటిలో ఆమెసంబంధాల గురించి వివిధమైన ప్రశ్నలు వేసింది. అన్ని సమాధానాలూ నార్మల్ గా వున్నాయి.

” సరిలెండి రేపురండి”. అంటూ పంపివేసింది.

మర్నాడు వత్సలని తీసుకు, డా, స్నేహలత దగ్గరకి వెళ్ళేసరికి , ఆమె ఎవరితోనో మాట్లాడుతోంది. వత్సలని కాని నన్నుగాని లోపలికి రమ్మనలేదు .ఇద్దరం చాలాసేపు వెయిట్ చేసాం నిరీక్షణలో అలసిపోయాం . వత్సల అయితే బాగా అలసిపోయింది.

అప్పుడు బైటికి వచ్చింది స్నేహలత,సారీ వత్సలా చాలాసేపు వెయిట్ చేయించాను. ఏమనుకోకు, రండి లోపలికి వెళదాం అని మమ్మల్ని చాంబరులోకి తీసుకెళ్ళింది.

“వత్సల ఫిజికల్లీ ఆల్ రైట్ మెంటల్లీ ఆల్ సో ఆల్ రైటు డిప్రషనుకి కారణం ఏమిటో తెలియడం లేదు.”

“మనం ఆగదిలో కూర్చుని మాట్లాడుకుందాం అక్కడ ఈజీచైర్ వుంది. వత్సలకి కాస్త రిలాక్సింగా వుంటుంది.” అని వత్సలని నన్ను తీసుకుని ఆగదిలోకి వెళ్ళింది.

ఆగదిలో ఎరేంజ్ మెంట్స్ చాలా విచిత్రంగా న్నాయి. ఈజీచైర్ కి ఎదురుగుండా దీపం ఉంది. అది ఈజీచైర్ లో కూర్చున్న వాళ్ళమీద పడుతోంది. పక్కనే టేబులు మీద క్రౌన్ పీసు సైజులో ఒక జింకప్లేటు ది. దాని మధ్య రాగిముక్క తాపడం చేసి ఉంది. అంతకుమించి గదిలో కూర్చోడానికి , మరే ఏర్పాట్లులేవు . గది చాలా శుభ్రంగా ది. గదికి ఒకపక్క స్నేహలత చేంబర్ ఉంది. దానికి దీని మధ్యగా పెద్ద గ్లాసుపేనల్ ది. ఈ గదిలో ఏం మాట్లాడినా పైకి వినిపించదు. స్నేహలత నన్ను తన చేంబరులో కూర్చోమంది.

వత్సలని తీసుకుని ఆగదిలోకి వెళ్ళింది. గదిలో వున్న లైట్లు ఆర్పేసింది.

వత్సలని ఈజీచైర్ లో కూర్చోబెట్టింది. వత్సల ఈజీచైర్ లో కూర్చున్న తర్వాత చేతులూ కాళ్ళూ రిలాక్సింగ్ గా ఉండేటట్లు , కూర్చోమని చెప్పింది. , వత్సల స్నేహలత చెప్పినట్టూ బుద్దిగాచేసేస్తోంది. టేబులుమీద ఉన్న జింకుప్లేటు తీసి వత్సలకి ఇచ్చి , దాని మధ్యనున్న కాపరు తాపడాన్ని చూపించింది. ఏదేదో చెప్తోంది. వత్సల వింటోంది. కళ్ళుమూస్తోంది మళ్ళీ తెరుస్తోంది.జింక్ ప్లేటు వేపు చూస్తోంది. తను అనుకున్నది జరక్కపోయేసరికి , వత్సల చేతిలోంచి జింక్ ప్లేటు తీసి బల్లమీద పెట్టి , మెల్లగా వత్సల దగ్గరికి వెళ్ళి రెండు అరచేతులని చెస్ట్ వరకూ తీసుకొచ్చి మళ్ళీ దూరంగా తీసుకెళ్ళి మళ్ళీ తల దగ్గరకి తీసుకు మళ్ళీ క్రింద వరకూ తీసుకొచ్చింది. అలా మూడుసార్లు చేసేసరికి వత్సల కళ్ళుమూసేసింది. మరి తెరవలేదు . మగతలోకి వెళ్ళింది . వత్సలని స్నేహలత హిప్నటైజ్ చేస్తోంది .నాకెందుకు చెప్పలేదు. సబ్ కాంక్షస్ లో వత్సల మనసులో వున్న భయాలూ ఆరోజు జరిగినవి చెప్పేస్తుందా ఈ విషయం గిరిజాదేవికి తెలుసా వెంటనే స్నేహలత చాంబరు నుండి గిరిజాదేవికి ఫోనుచేసి జరిగింది చెప్పాను.

వత్సలకి హిప్నటైజ్ చేస్తున్నట్లు తనకి తెలుసునని తనే చేయమన్నానని , వర్రి అవక్కరలేదని , చెప్పింది గిరిజాదేవి.

ఫోను పెట్టేసి నేను చాంబరులోకి చూసాను. స్నేహలత ప్రశ్నలు అడుగుతోంది. వత్సల జవాబులు చెబుతోంది. పెదిమలు కదిలీ కదల్చనట్లు గొణుగుతోంది. అప్పుడప్పుడు మొహం ప్రశాంతంగా ఉంటోంది. ప్రశ్నలు ఏమిటో తెలియలేదు. కాని అరగంట తర్వాత వత్సల మొహం బిగుసుకోడం ప్రారంభమయింది. కుర్చీలో కదిలింది. మొహంలో చికాకు, ఎక్కువైంది. సడన్ గా కళ్ళు తెరుచుకున్నాయి. మంచి నిద్రచెడి తెలివి వచ్చేసినట్టు వత్సల కళ్ళు ఎర్రగావున్నాయి.

స్నేహలత వత్సల భుజం మీద చెయ్యి వేసి , లేచి చేంబర్ లోకి వెళ్ళమని , చెప్పి, వత్సల లేచి చాంబరులోకి వచ్చేసాక ,స్నేహలత వత్సల కూర్చున్న కుర్చీదగ్గరకి వెళ్ళి చేత్తోతడిమింది.

తర్వాత బాత్రూములోకి వెళ్ళి చేతుల్ని సబ్బుతో కడుక్కుని వచ్చింది. వత్సల చాలా చికాకుగా ఉంది. నేను స్నేహలతనే గమనిస్తున్నాను. ఏప్రశ్నలు అడిగి ఉంటుంది. ఏసమాచారం ఆమెకి తెలిసింది. ఏమిటి చెబుతుంది అని.

షివజ్ సఫరింగ్ ఫ్రమ్ సివియర్ ఎమోషనల్ అప్ సెట్ . మీ అరకుప్రయాణం ముందు ఆమె చాల నార్మల్ , ఎనీహౌ నేను మందిస్తాను. రోజూ రాత్రి పడుకోబోయేముందు వేయండి. నిద్రభంగం కాదు అంది. అని ,ఎవర్ టిన్ , రాసింది.

తర్వాత వత్సల నేను బైటికి వచ్చాం . వత్సలని కారులో కూర్చోబెట్టి ,కారెక్కుతుండగా కంపౌండరు వచ్చి డాక్టరుగారు పిలుస్తున్నారు అని చెప్పాడు . వత్సలని కూర్చోమని నేను స్నేహలత దగ్గరకివెళ్ళాను.

“నేను హిప్నటైజ్ చేస్తుండగా వత్సలకి మధ్యలో బ్రేక్ అయింది ,తెలుసా?”అంది నన్ను చూసి .”అవును అబ్జర్వ్ చేసాను “అన్నాను.

“ఆమె బాగా భయపడింది దేనికో తెలియడం లేదు.”

“ఆ అనుభవం తలపులోకి రాగానే యూరినేషన్ అవుతోంది. అది ఆమెడీప్ స్లీప్ ని డిస్టర్బ్ చేస్తోంది. ఈ వయసులో యూరినేట్ చేసుకునేంత భయంకరమైన సంఘటన ఏం చూసిందో? ఎందుకంత భయపడిందో? తెలియకుండా వుంది?. ఈవిషయం నేను గిరిజాదేవితో మాట్లాడతాను లెండి” అంది స్నేహలత .

నేను వెనక్కి వచ్చేసాను. వత్సల యూరినేట్ చేసుకుందా? అంతలా భయపడిందా ? అనుకున్నాను.

ఈ విషయం విన్న దగ్గర్నించీ నా మనసు పాడైపోయింది. వత్సలకి కాన్పు సరిగా రావాలి ఏమీ అవకూడదు. అన్నీ సరిగా జరిగి మొత్తం ఈ గండం గడిస్తే తిరుపతి కొండకి ఫేమలీతో సహా వస్తానని మొక్కుకున్నాను. అమ్మనేర్పిన నమ్మకం .

..................................................................

స్నేహలత మందుల మహత్యం అయితేనేమి తిరుపతి దేవుడి మొక్కువలన అయితేనేమి వత్సల ప్రవర్తనలో ఉన్మాదం బాగా తగ్గింది. రాత్రి పూట నిద్రచెదరటం లేదు . పగలు కూడా నార్మల్ గానే ఉంటోంది.

ఈ విధంగానే వత్సలకి తొమ్మిది నెలలు నిండాయి . డాక్టరు చెప్పిన డేటుకి ఒకరోజు ముందుగా నొప్పులు మొదలయ్యాయి. నొప్పులు మొదలయిన దగ్గర్నించీ వత్సల చూపు మారిపోయింది. ఏదేదో తిడుతోంది. ..కారుకి కొడుకు పుట్టాడా నాకు పుడతాడు. చంపేయకండి. అంటూ ఏదేదో వాగుతోంది. నొప్పులు ఆగిపోయాయి. కాని వత్సలప్రవర్తనలో మార్పురాలేదు. ఇవన్నీ చూసిన డాక్టరు వత్సల సహకరించడం లేదు అని, ఏదో ఫారం తీసుకొచ్చి నా సంతకం తీసుకుని, చిన్న చీటీ ఇచ్చి , ఈగ్రూపు బ్లడ్ రెండుబాటిల్స్ తెమ్మని , సిజేరియన్ చేయడానికి అన్నీ సిద్ధం చేసింది. సిజేరియన్ అయింది. వత్సలకి ఆడపిల్ల పుట్టింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. నా మనసు నెమ్మదించింది.

పాపకి లాహిరి అని పేరు పెట్టాను. పురుడు అయిన దగ్గర్నించీ మళ్ళీ వత్సలలో మార్పు , ఆ పాపని ఎదురుగా పెట్టి నా పొట్టచింపి నిన్ను తీసారు . తెలుసా? అని అడిగేది . గట్టిగా నవ్వేది. వంటరిగా ఉన్నప్పుడు ఏడ్చేది. స్నేహలత ఇచ్చిన మందులు వత్సల మీద పని చెయ్యడంలేదు . ఎందకంటే నిద్రలో ఉన్న వత్సలని లాహిరి నిద్రలేపేది . దానికి పాలుఇచ్చి మరి తెల్లవార్లూ నిద్రపోయేది కాదు వత్సల .

ఆయాను పెడదాము పిల్ల విషయం , చూసుకుంటుంది. అని చెప్పాను వత్సలతో . అందుకు వత్సల వొప్పుకోలేదు. ఇంతకు ముందు వత్సలకి ఇప్పుడు వత్సలకి చాలా తేడా వచ్చేసింది. మళ్ళీ స్నేహలత దగ్గరకి తీసుకెళితే , వత్సల మామూలు మనిషిఅవచ్చు .

అనిపించింది. కాని హిప్నటైజ్ చేస్తే , ఈసారి చూచాయగా ఏక్సిడెంట్ విషయం స్నేహలతకి తెలుస్తుంది. ఆమె పోలీసులకి తెలియబరచ వచ్చు ఆ తర్వాత కూడా వత్సల బావుంటుందని గేరంటీ ఏమిటి? అనేకమైన ఆలోచనలతో , కొత్తగా తలదూర్చిన పనితో క్షణం తీరిక లేకుండా రెండేళ్ళు గడిపేను ఎందుకంటే?

---

ఆరోజుల్లోనే గిరిజాదేవి శ్రీనివాసచౌదరిని పరిచయం చేసింది. శ్రీనివాసచౌదరి పూర్వీకులు సాలూరుకి దూరంగా రామరాజపురంలో కొంత భూమికొని వ్యవసాయం మొదలుపెట్టారు.అక్కడఆకొండల మధ్యగ్రామాలన్నీ ఆదివాసీలవే ఏసంస్థానాలుగాని ప్రభుత్వాలుగాని వాళ్ళమీద దృష్టిపెట్టినట్టుగాని, పెట్టవలసిన అవసరంగాని లేకపోయింది. స్వాతంత్ర్యం వచ్చాక ఎలక్షన్లలో, ఆవూళ్ళకి దూరంగా ఎక్కడో ఏభూకామందుల ఇంట్లోనో ఆతిధ్యం స్వీకరించి ఎలక్షను కార్యక్రమం అయింది అనిపించేసేవారు. అలాంటి వూళ్ళమధ్యకి చౌదరి కుటుంబం వచ్చింది. ఆకుటుంబానికి అయిదో తరంవాడు శ్రీనివాసచౌదరి ఇతని పూర్వీకులు వ్యవసాయంతో పాటు గంజాయి పండించి డబ్బు గడించాడు. డబ్బుతోపాటు కొన్నివందల ఎకరాలు స్వంతం . ఆ రహస్యాల్ని కాపాడడానికి తన బంధువర్గాన్ని పెంచాడు.

ఇప్పుడు రామరాజపురంలో ఓఅరవైగడపలవరకూ చౌదరీ కుటుంబీకులే .అందరికీ శ్రీనివాసచౌదరే పెద్దకానీ చౌదరి పెద్దరికం నచ్చని వాళ్ళూ లేకపోలేదు . ఎలక్షన్లలో ఈవూళ్ళకి దూరంగా ఎక్కడో కూర్చుని ఎలక్షను జరిగే ప్రక్రియ రామరాజపురం శ్రీనివాసచౌదరి ఇంటికి చేరుకుంది. శ్రీనివాసచౌదరి ప్రస్తుతం ఇరవైఏళ్ళుగా ఎమ్. ఎల్ ఎ.గా వుంటూ ఆప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నాడు . ఆ అభివృద్ధి అంతా చౌదరీ కుటుంబాలకే పరిమితం అని అంటారు. కొందరు. అదికొంత నిజం . అయితే వాటాలు కుదరక వో చౌదరీ కుటుంబంలో వుడుకురక్తం , తనకున్న రాజకీయపలుకుబడినుపయోగించి నక్సలైట్లని వాళ్ళని ఆప్రాంతానికి రమ్మని అది దాక్కోడానికి మంచిప్రదేశం ,అని చెప్పి అక్కడకి రప్పించాడు. నక్సల్స్ కి కూడా అది అనువైన ప్రదేశంగానే కనిపించింది. వీళ్ళ ఆచూకి తెలిసి ఆంధ్రాపోలీసులొచ్చినా ,కొండకి అవతలికి పోయారు. అది ఇంకో రాష్ట్రంలోకి వచ్చేది. ఆంధ్రాపోలీసులకి , కొండదాటే అధికారం , అవసరం వుండేవికావు. నక్సల్ ఏక్టవిటీ వుందని ఎలక్షన్లలో పోలీసులతో సహా వచ్చేది ఎలక్షన్ సిబ్బంది

అప్పుడు చెదురుమదురుగా ఎలక్షన్లు అయేవి . స్వతంత్రం వచ్చిన ముఫ్ఫైఏళ్ళకి అక్కడ ప్రజలకి వోట్ల స్పృహకలిగింది. దాంతో శ్రీనివాసచౌదరిగారి పట్టు సడలింది. ఇంతకుముందు నయాపైసాఖర్చవకుండా పడ్డవోట్లు ఇప్పుడు కాస్తో కూస్తో మందుకి ,చీరకి అనే నివాదం మీద ఖర్చుచెయ్యాల్సి వస్తోంది. మగాడికి మందు పోయించడం ఆడవారికి చీరలు పంచడంచెయ్యాల్సి వస్తోంది. ఖర్చు పెరిగింది.

నక్సలైట్లు తిరుగుతున్న ప్రాంతంగా పేరురావడం వల్ల చాలా లావాదేవీలు తగ్గి రాబడి తగ్గిపోయింది. ఈ పరిస్థితినించి ఎలా బయటపడాలో శ్రీనివాసరెడ్డికి అర్ధం కాలేదు. అప్పటికి అతను రెండుసార్లు రాజకీయాల్లోకి ఎమ్.ఎల్.ఎఅవడం వల్ల చీఫ్ మినిష్టరు బంధువైన మూర్తిని సంప్రదించాడు . మూర్తి చౌదరే కానీ చౌదరీ శబ్దాన్ని విడిచిపెట్టాడు. చౌదరిత్వాన్ని కాదు . మూర్తికి అప్పటికే రెండోమూడో కాలేజీలు ఉన్నాయి.

ఇద్దరూ కలిసి రామరాజపురం వెళ్ళారు. రామరాజపురం ఎక్కడో ప్రపంచానికి దూరంగా మరో ప్రపంచంలో వుండడం నచ్చింది.

మరో ప్రపంచం మరోప్రపంచం మరోప్రపంచం పిలిచింది అంటే ఇదే అని , శ్రీశ్రీకి వున్న దూరదృష్టికి ఆశ్చర్యపోయాడు మూర్తి. ఈ ప్రపంచంలో దోనెంబరీని ఎంత కరిగిస్తే అంత మేలుజరుగుతుంది. లేదా చాలా భద్రంగా వుంటుంది అనిపించింది. వస్తే రిటర్న్స్ వస్తాయి . లేదా నలుపు డబ్బు రంగు మారుతుంది. అనే నిర్ణయానికి వచ్చాడు.

స్థలాన్ని ఎంచి అక్కడ ఇంజనీరింగ్ కాలేజీ ప్రపోజల్ పంపారు. అది పంపిన పదిరోజులకల్లా ఆ వూళ్ళల్లో ఆచుట్టుప్రక్కలఅడవుల్లో కూంబింగ్ ఆపరేషన్ జరిగింది. ఒకసారి కాదు నాలుగైదుసార్లు అయితే ఈకూంబింగ్ ఆపరేషన్లో పోరాటవీరు లెవరూ దొరకలేదా? దొరికితే ఏం చేసారు?. అన్నది చాలా రహస్యం . దాన్నలా వుంచితే , నక్సలైట్ల వుద్యమానికి భారీగా డబ్బుముట్టచెప్పడం వల్ల వాళ్ళు ఆ ప్రదేశాన్ని వదిలి కొండవతలికి ఇంకో రాష్ట్రంలోకి వెళ్ళారు అనే పుకారు...., ఏ వుద్యమమేనా రాజకీయం అయితే అంతే . ఏదేమయితే నేమి !

ఇంజనీరింగ్ కాలేజివచ్చింది. మూర్తి కాలేజీ తెచ్చాడు . శ్రీనివాసచౌదరి పెట్టుబడి తెచ్చాడు . కాలేజీ కేంటిన్ శ్రీనివాసచౌదరి తమ్ముడికి , స్టోర్స్ బావమరిదికి , కాలేజీ కన్స్ట్రక్షను శ్రీనివాసచౌదరి అన్నగారికి మొత్తం అరవై కుటుంబాలకి పెత్తందార్లగానో, , డబ్బులేనివాళ్ళకి వుద్యోగరూపంలోనో వుపాధి దొరికింది. వాళ్ళందరి దగ్గర్నించి కాలేజీకి వొకటిరెండు ఎకరాలు కొనుగోలు చేసాడు శ్రీనివాసచౌదరి . ఎక్కువహామీ ఇచ్చినవాళ్ళకి , ఎక్కువ ప్రతిఫలం ఎక్కువ ప్రాముఖ్యం దక్కాయి.

ఇంజనీరింగ్ కాలేజీ మొదలైన రెండేళ్ళకిశ్రీనివాసచౌదరికి ఇంక తన భూములు ఆస్థికి వచ్చిన నష్టం ఏం లేదనే ఆత్మవిశ్వాసం పెరిగింది. మూర్తికి శ్రీనివాసచౌదరి సంగతి బాగా తెలుసు , బలపడే వరకే తన అవసరం ఆ తర్వాత ఏం జరగాలి? , ఏం జరిగితే తను లాభపడతాడు అని ఆలోచించి కాలేజీ డెవలప్ మెంటుకని బేంకులదగ్గర తెచ్చిన సొమ్మును తనవూర్లో మరో ఇంజనీరింగ్ కాలేజీ కడతాననే నెపంతో భూముల్ని కొన్నాడు. .

కాలేజీని బేంకులకి తాకట్టుపెట్టాడు.కాలేజీ పేరు చెప్పి ఎవరి వ్యాపారం వాళ్ళు పెంచుకుంటున్నారు. అది శ్రీనివాసచౌదరికి నచ్చలేదు. కాలేజీ అతని చెప్పుచేతల్లోవుండలేదు. అందుకే నీదగ్గరకి వచ్చాడు. మేనేజింగ్ పార్టనర్ ని వెదుక్కుంటున్నాడు అంది గిరిజాదేవి.

"ఇప్పుడు అతనికి నేనేవిధంగా సాయపడగలను?"

"మూర్తిని తప్పించే తెలివితేటలు నీ దగ్గరున్నాయి".

"అది అతనే చెయ్యచ్చుగా?"....

"అదంత తేలికకాదు. మూర్తి వెళ్ళాక కాలేజీ నడవదు. శ్రీనివాసచౌదరికి ఆసత్తాలేదు . అతనో మట్టిమనిషి ,ఆపనికి వైట్ కాలర్ మోడష్టీ కావాలి. ,ఆజ్ఞానం శ్రీనివాసచౌదరికి వుంది"

"బావుంది కొత్త ఎసైన్ మెంటు అన్నమాట"

"కాస్త బిజీగా వుంటావు ,ట్రైచెయ్యి...."

కాలేజీకి కొత్తడైరక్టరుగా వెళ్ళా ....

కాలేజీ కుక్కలు చింపినవిస్తర్లావుంది. మూర్తి కాలేజీ మీద ఇంట్రస్టులేదు. పిల్లల ఫీజులు వసూలు చేసి పట్టుకుపోయి తనకొత్తకాలేజీలో పెడుతున్నాడు.

లోన్లు ఇచ్చిన బేంకులు వడ్డీకూడా వసూలు కాక లబోదిబోమంటున్నాయి. కాలేజీస్టాఫ్ సమయానికి జీతాలందక , చాలా అసహనంగా వున్నారు. అసలు కాలేజీ కొచ్చే కుర్రాళ్ళసంఖ్య( )తగ్గిపోయింది.

నేను డైరక్టర్ గా చేరిన నెలరోజుల్లో విషయం అర్థం అయింది. చాలా కష్టపడి , మార్కెటింగ్ చేసి ఆఏడాది విద్యార్థులసంఖ్య పెంచాను. నేతీసుకొచ్చిన విద్యార్థులరాబడే కాలేజీకి దక్కింది. మూర్తి ప్రాపకం ద్వారా విద్యార్థుల డబ్బు ఏ ఎకౌంటులోనూ జమ అవలేదు.

అన్నింటికీ మించి బోర్డు మీటింగ్ లో నే తెచ్చిన విద్యార్ధుల డబ్బు ఖర్చుకి సంజాయిషీ చెప్పాల్సి వచ్చింది. అదికొంచెం ఇబ్బందిగా అనిపించింది. ఇది ఇంక ఇలా కుదిరేపని కాదని, ఎదురుదాడి మొదలుపెట్టా.

కొందరు విద్యార్ధుల్ని ట్యూషన్ ఫీజు కట్టలేదని , హాస్టలుఫీజు కట్టలేదని నోటీసిచ్చా , వాళ్ళంతా శ్రీనివాసచౌదరి దగ్గరకి వెళ్ళారు. మరి కొందరు విద్యార్ధులు క్వాలిఫికేషన్స్ సరిపోవని వాళ్ళని తీసేస్తున్నట్టు నోటీసిచ్చా. అప్పుడు నేవిసిరినరాయి తగిలింది. మూర్తి ఫోనుచేసి, ఎందుకిలా చేసావన్నాడు. వీళ్ళకి ఎలా సీటొచ్చిందో , నాకైతే అర్ధం కావడంలేదు అన్నా, అంతా అర్ధం అవుతూనేవుంది.

“వాళ్ళంతా డొనేషన్ కట్టారయ్యా “ అన్నాడు.

“ఎంత డొనేషను కట్టినా ఎలిజిబులిటీ వుండాలిగా.”

“డోనేషనే ఎలిజిబులిటీ “

“అందులో చాలా మంది కంపార్టుమెంటులో పాసయారు.”

“పాసయారుకదా “

“వీళ్ళతో సమస్యే “

“నిజమే అందుకే డొనేషన్ కట్టేసారు.”

“డొనేషనొక్కటే పరిష్కారంకాదు.”

“ఎందుక్కాదు.?”

ఇంక నేను బయటపడక తప్పదు. ఈ విషయం తొందర్లోనే తేల్చాలి,అనుకున్నా.

“ప్రతి ఏడాదీ డొనేషను కట్టరు కదండీ” అన్నా.

“డొనేషను వొక్కసారెకదయ్యా కట్టేది.”

“మరి ప్రతీఏడాదీ మాకు సమస్యైపోతున్నారే”

“అదేమిటి అక్కడుండి చదవాలి కదా?”

” చదివితే సరే సమస్యగా మారితే కష్టం కదండీ.”

“అసలు నీవుద్దేశం ఏమిటి?”

“ఏమీ లేదండీ డొనేషను సుఖం మీరు, సమస్య మేము భరించడం కష్టంగా వుంది”.

“నువ్వెవరివయ్యా ఆమాట అనడానికి?“ అన్నాడు కోపంగా మూర్తి.

మూర్తి ఈ విషయాన్ని బోర్డుఆఫ్ గవర్నర్స్ లో పెట్టాడు. బోర్డులో శ్రీనివాసచౌదరి నా పక్షాన మాట్లాడేసరికి,మూర్తికి అసలు విషయం అర్ధం అయిపోయింది.

కోపంగా “నాకు సెటిల్ చేసెయ్యండి నేను వెళ్ళిపోతా “ అన్నాడు.

“సెటిల్ చెయ్యడానికి బేలెన్స్ షీటులో అప్పులవిలవే ఎక్కువుంది.”

“అప్పులు కాలేజీ కోసం చేసినవే.”

“కానీ కాలేజీకి ఖర్చుపెట్టినట్టులేదు.”

“అదెలా?.....”

"కాలేజీలో మూడేళ్ళనుండి పెరిగిన ఎసెట్స్ ఏమీలేవు. ..."

ఆఖరికి మూర్తి దారికి వచ్చి "గుడ్ విల్ ఏదీ వుండదా?" అనడిగాడు.

అంటే నేను గోలచెయ్యకుండా మర్యాదగా తప్పుకోడానికి నాకెంత ఇస్తావు. అన్నదే ఆప్రశ్న.

శ్రీనివాసచౌదరి "గుడ్ విల్ ఏముంటుంది మీరుండగానే కాలేజీ పేరు పడిపోయింది."అన్నాడు.

అంటే మూర్తికి అర్థం అయింది. అంతేకాదు ఆబోర్డ్ ఆఫ్ గవర్నర్స్ మీటింగులో ఇకముందు ఎడ్మిషన్స్ అన్నీ నా అనుమతిలేకుండా జరగకోడదన్న తీర్మానం జరిగింది. అంటే మూర్తిని డమ్మీ చేసేసాం.

ఇది జరిగిన రెండోరోజే ముఖ్యమంత్రి శ్రీనివాసచౌదరిని పిలిచి "ఏమిటి మూర్తిగారు ఏదో చెప్పారు ఆయన మీకాలేజీ చాలా డెవలప్ చేసాడు కదా?" అన్నారు.

శ్రీనివాసచౌదరి మూర్తి విషయం ఎత్తకుండా, "మీ పార్టీకి కోటిరూపాయలు విరాళం ఇద్దామనుకుంటున్నాం సార్, మాకొత్త మేనేజ్ మెంట్ బిల్డింగ్ కి మీపేరు పెడతాం సార్ . మీరు వోపినింగ్ కి రావాలి." అని చెప్పి పాతికలక్షలు చెక్కు, డెబైఅయిదులక్షలు కేషు ఇచ్చేటట్టు వొప్పందం చేసుకున్నాడు.

"మరి మూర్తిగారో?"అన్నా .

"ఆయనకిచ్చేదాంట్లో ఆ కోటి తగ్గిద్దాం "అన్నాడు.

ఆ రకంగా మూర్తి కాలేజీనుండి నిష్క్రమించాడు. ఆఏడాదినుండి డబ్బుసుఖం స్టూడెంట్ సమస్యల కష్టాలు మేమే అనుభవిస్తున్నాం. అయితే శ్రీనివాసచౌదరి అక్కడితో ఆగలేదు. నేను తన మనిషినని నిర్ధారణ చేసేసుకున్నాడు. మనిషి మనసులో అనేక కోణాలు వుంటాయి. అవి వాళ్ళకే తప్ప ఇతరులకు అందవు. అంది పుచ్చుకోడం కష్టంకూడా. శ్రీనివాసచౌదరి మనసులో కూడా ఏకోణం ఏదోతెలుసుకోడం కష్టం.

హాస్టలు మెస్ లో పెద్దగొడవ అయింది.మెస్ లో గొడవ అంటే ఫుడ్ బాగులేదనేగా,ఆరోజు రాత్రి కంచాలుపట్టుకు, నేవుంటున్నగెస్టుహౌస్ కి వచ్చేరు స్టూడెంట్స్. దాంతో అదొక ఇష్యూకింద అయింది. మెస్ ఇన్ చార్జ్, మెస్ కాంట్రాక్టరు,అందరం సమావేసం అయి కొన్ని పరిష్కారాలు ప్రతిపాదించాం కానీ స్టూడెంట్స్ ని అవి చల్లబర్చలేకపోయాయి. మెస్ విషయంలో స్టూడెంట్సు రోజుకో సమస్యలేపుతున్నారు.

ఇంక ఇది ఇలా వుంటే బావుండదని కాంట్రాక్టర్ని మార్చే ప్రతిపాదన వచ్చింది. ఆ ప్రతిపాదనతో మెస్ కాంట్రాక్టరు రాజాచౌదరి, శ్రీనివాసచౌదరి వేపు గుర్రుగా చూసి మెస్ కాంట్రాక్ట్ నుండి తప్పుకున్నాడు. రాజా శ్రీనివాసచౌదరికి, మేనమామకొడుకు, అక్కడితో ఆగలేదు. రాజా తనమకాం ఆవూరినుండి పక్కనున్న టౌనుకి మార్చేసాడు.

అతనితో పాటు,మరికొంతమందిని తీసుకుపోయాడు. మెస్ కి కొత్త కాంట్రాక్టరు వచ్చాడు. కానీ ఫుడ్ పాతదే.

............................

ఇది జరిగిన నాలుగునెల్లకి, కాలేజీ కోపరేటివ్ స్టోర్స్ లో పెద్దగొడవ అయింది. స్టూడెంట్స్ కోపరేటివ్ అద్దాలు అవీ పగలుకొట్టారు. కోపరేటివ్ ని వో విధంగా దోచుకున్నారు. ఇలా ఎందుకు జరిగింది?.

శ్రీనివాసచౌదరి చెప్పిన సమాచారం ఆశ్చర్యాన్ని కలిగించింది. కాలేజీకోపరేటివ్ స్టోర్స్ లో మందు బాటిల్సు అమ్ముతున్నారు. ఆ విషయంలో గొడవ అయింది. ఇంత వరకూ సజావుగా జరుగుతున్నది. ఇప్పుడు రగడకి కారణం ఏమిటి? దీనివెనకాలవున్నభావమేమిటి, వెంటనే మూర్తి పేరు బైటికి వచ్చింది. దానికి మూర్తి చౌదరి సపోర్టు ఎంతేనా వుంది. అందుకే ఇన్నాళ్ళూ తెలిసినా ఏం చెయ్యలేకపోయాం .

ఇంత వరకూ బాగానే వుంది. కాలేజీకోపరేటివ్ ని బైటవ్యక్తులకి కాంట్రాక్టు ఇవ్వడానికి నిర్ణయం అయిపోయింది. ఇప్పటివరకూ కాంట్రాక్టు చేసిన శ్రీనివాసచౌదరి పెదనాన్న గారి అబ్బాయి. కాలేజీ వదలి వెళ్ళక తప్పలేదు.

శ్రీనివాసచౌదరి "వాడెవడైతే నాకేం తప్పుచేసినప్పుడు మనం వొల్లక వుండకోడదు"అన్నాడు.

కాలేజీ కోపరేటివ్ కంట్రాక్టరు మొత్తంగా ఆవూరే వదిలోసి వెళ్ళిపోయాడని విన్నా.... కాని ఇది బైటికి కనిపిస్తున్నంత, సులభంగా అర్ధం అవదు.

అయితే మరేమిటి శ్రీనివాసచౌదరికి కాలేజీ కాదు కావలసినది. దానివెనుకాలున్నఆస్ధి. దానికోసం తనవాళ్ళందర్నీ తనకి పోటీగా రాగల సత్తావున్న వాళ్ళందర్నీ , అది తన పరసంబంధం లేకుండా తప్పిస్తున్నాడు.

ఆస్ధికి కులం, గోత్రం, బంధుత్వం ఏమీ వుండవన్నది అర్ధం అయింది.

ఆ ఆలోచన నన్ను చటుక్కున పొడిచింది.

నేను జాగ్రత్త పడాలి అనుకున్నా జాగ్రత్తపడ్డా.

.......................................

ఏ సంస్ధకేనా ఫినాన్స్ ముఖ్యం .

నేనూ మూర్తిలా చేస్తే అంటే ఇక్కడరాబడితో వేరే చోట ఆస్తులు కొంటే శ్రీనివాసచౌదరికి అర్ధం అయిపోతుంది.

అందుకే కుంతి నడకలు నడుస్తున్న వత్సలమాన్యుఫాక్చరింగ్ ఇండష్ట్రీని కాలేజీ ఎటాచ్ చేసాను. దానికి "ఎర్న్ వైల్ యులెర్న్" అన్న వొక నినాదం తోడు. శ్రీనివాసచౌదరి, తనకి పోటీ లేకుండా తనవాళ్ళని మెల్లగా తప్పిస్తోంటే .... నా ఇండష్ట్రీస్ లో కాలేజీవాళ్ళకి చోటు కలిపిస్తూ, టౌను అంటే ఇష్టపడే వాళ్ళని ఫైనలియర్ విద్యార్ధుల్ని, ఇండష్ట్రీయల్ ఎక్స్ పోజర్ పేరుతో ఇండష్ట్రీకి పంపి అక్కడ శిక్షణ ఇప్పించడం, అనే సదుద్దేశాన్ని, కాలేజీలో అందరూ ఏకగ్రీవంగా వొప్పుకున్నారు.

కానీ దానికోసం కొన్ని కోట్ల కాలేజీ సొమ్ము పెట్టి ఇండష్ట్రీని మోడ్రనైజ్ చెయ్యాల్సి వచ్చింది. అదీ అంచెలంచెలుగా జరిగింది. ఇక్కడున్న నిపుణులుఅక్కడికి మారిపోయారు.

వత్సల మాన్యుఫాక్చరింగ్ ఇండష్ట్రీస్ పుంజుకుంది. దాని ప్రాఫిట్స్ మీద ఎవరికీ హక్కుండదు. నాకు గిరిజాదేవికి వత్సలకి తప్ప రెండేళ్ళు సజావుగా సాగిన వొప్పందంలో చురుకుదనం లేదా (హిడెన్ ఎజెండా )శ్రీనివాసచౌదరికి అర్ధం అయింది. కాలేజీ బేలెన్స్ షీటు నష్టాల్లోకి వెళ్ళింది. కాలేజీ కొంచెం దెబ్బతింది.

అది శ్రీనివాసచౌదరికి రుచించని విషయం. కానీఏం చెయ్యడానికి లేదు.

ఈ ఇండష్ట్రీతో బంధాలు నచ్చలేదు. అన్నాడు. కాలేజీ వచ్చే రాబడి కాలేజీకే ఖర్చు పెట్టాలి, అన్నాడు. ఎక్కడా కాలేజీ రాబడి ఇంకో దగ్గర ట్రాన్స్ ఫర్ చేసినట్టు రికార్డుల్లో లేదు. ఈ కొత్త పరిస్ధితుల్ని ఎలా ఎదుర్కోవాలో ఎవరితో చర్చించాలో శ్రీనివాసచౌదరికి అర్ధం కాలేదు. అప్పటికే తనవాళ్ళని పోగొట్టుకుని వంటరివాడయ్యాడు. ఆసమయంలో నన్నుబెదిరించడమే అతనికి దారి.

"నాకు సెటిల్ చెయ్యి. నేను కాలేజీ పాడైపోతోంటే చూడలేను" అన్నాడు.

అందుకు నేను సిద్ధంగా వున్నా. రాజకీయంగా గిరిజాదేవికున్న పలుకుబడి ముందు శ్రీనివాసచౌదరి ఢీలాపడ్డాడు.

...................................

వత్సలకి సమయం ఇచ్చేసరికి వత్సల తేరుకుంది. పిల్లలతో పాటు అమ్మ,వత్సలనీ సాకుతోంది.

అమ్మకి క్రమేపీ చూపు తగ్గుతోంది. తిరుపతి తీసుళ్ళరా,అని అడిగింది. వత్సలని కూడా అడిగాను తిరుపతి వెళ్దామా అని వత్సల అలాగే అని బుర్రూపింది. ఎలాంటి వత్సల ఎలా అయిందో అనుకున్నాను. ఎక్స్ సివ్ మేకప్ తో క్లాష్టీగా తిరిగే వత్సల ఈ పన్నెండేళ్ళలో హైక్లాస్ ముత్తయిదువులా తయారైంది. ఇదంతా అమ్మమహత్యం ఇంతకు ముందులా ప్రతీ పార్టీకి తయారవడంలేదు. ఇప్పుడు గిరిజాదేవి పక్కన వత్సలని పెడితే ఇద్దరూ అక్కా చెళ్ళెళ్ళు అనుకుంటారేమో .

............................

తిరుపతి వెళ్ళడానికి ప్లాను చేసాను. కాని కోర్కె ప్రకారం అన్నవరం ద్రాక్షారామం,బెజవాడ కనకదుర్గ, కాళహస్తి,తిరుపతి చూసి రావాలంటే చాల హైరానాపడిపోతాం ఏం చెయ్యాలా అని ఆలోచిస్తోంటే గిరిజాదేవి స్పెషల్ వేన్ తయారు చేసి దాంట్లో వెళ్ళండి అని సలహా చెప్పింది. దానికి ప్లానింగ్ కూడా చెప్పింది. దాని ప్రకారం ప్లాంట్ ది టాటాసియారా తీసుకుని దానికి బాడీ మార్పించాను. వెనకాల వచ్చిన బాడీలో అయిదు ఫోల్డింగ్ బెడ్స్ వచ్చేటట్లు చూసాను. బాడీకి రెండు సైడుల్లో రెండు డోర్ మెట్రీ టైపు పడకలు, పక్కగా లాహిరికి చిన్నపడక ఏర్పాటుచేసాను. రూఫ్ కి పెద్దకబ్బోర్డు పెట్టించాను. దాంట్లో తినే వస్తువులు, బట్టలు అవీ పెట్టుకునేటట్లు అరలు పెట్టించాను.

బాడీ బలంగా తయారు అయింది. దాని వెనుక తలుపు పెట్టించి, దానికి చైల్డ్ లాక్ సిస్టమ్ ఏర్పాటు లోపలనుండి బైటనుండి లాక్ ఓపెన్ చెయ్యచ్చు మొత్తం ఇరన్ ఏంగిల్స్ స్కెలిటన్ తయారు చేసి మొత్తం బాడీచుట్టూ వెల్డ్ చేయించాను. లోపల బాడీ చాల ప్రొటెక్టివ్ గా తయారైంది. ఒకేసారి ప్రయాణానికి వీలుగా. బాడీకింద యాభైలీటర్ల ఎక్స్ ట్రా టాంక్ ఏర్పాటు చేయించాను. టాటాసియరా చాల బాగా తయారైంది. దానికి,విజయహంస,అని పేరు పెట్టాము. ప్రయాణానికి కావలసినవి అన్నీ పూర్తి చేసుకుని ఓమంచి ముహుర్తంలో బయలుదేరాము.

............................

విజయహంస డ్రైవరు చాల ఘటికుడు, ఎంత స్పీడులో నడిపినా బండి ఒడిదుడుకులు పడ్డం లేదు. చాల స్మూత్ గా నడుస్తోంది. ఓ రోజు పొద్దున్న ఎనిమిదిగంటలకి బయలుదేరి ఆసీలుమెట్ట వెళ్ళి, సంపత్ వినాయకుడి గుడి దగ్గర ఆగాము.అందరం వినాయకుడిని ప్రయాణం నిర్విఘ్నంగా జరగాలని కోరుకున్నాం. అమ్మ వినాయకుడికి కొబ్బరికాయ కొట్టింది.

అక్కడినుండి బయలుదేరి,విజయహంస,మధ్యాహ్నం పన్నెండయ్యేసరికి, అన్నవరం చేరుకుంది. అన్నవరంలో సత్యనారాయణస్వామి దర్శనం చేసుకుని, కొండదిగువకి వచ్చేసరికి మూడున్నర అయింది. అక్కడనుండి తిన్నగా సాయంకాలానికి కాకినాడ చేరుకున్నాం కాకినాడలో లాడ్జితీసుకు, విశ్రమించాం. పొద్దున్నే లేచి ద్రాక్షారామం భీమేశ్వరుడ్ని సందర్శించి, రాజమండ్రి వచ్చేసరికి సాయంకాలం నాలుగయింది. అక్కడ హోటలు రూము తీసుకుందామని నేను అమ్మవత్సల అంటే డ్రైవరు ఎందుకు మీరు పడుకోండి మెల్లగా తీసుకెళతాను. తెల్లవారేసరికి బెజవాడలో ఉంటారు అన్నాడు.

మొదట ఒప్పుకోకపోయినా సరే ఈ అనుభవం ఎలా ఉంటుందో చూడాలనిపించి, నేను డ్రైవర్ పక్షం వహించాను. అమ్మకి, వత్సలకి, ఇష్టం లేకపోయినా, మెల్లగా నడుపుతానన్నాడుకదా అని సరే అన్నారు.

గోదారి వొడ్డున ఇస్కాన్ టెంపుల్ కెళ్ళి, హారతి అయిపోయాక, రాజమండ్రిలో భోజనం చేసి రాత్రి ఎనిమిదిగంటలకి బయలుదేరాం. అందరం ఎవరి పక్కలమీద వాళ్ళుపడుకున్నాం. 'విజయహంస' మెల్లగా వయ్యారంగా గోదావరి బ్రిడ్జిమీంచి పోతోంది. గోదావరి హోరు, చల్లటిగాలి వేనులోకి చేరి మాకు మత్తును పంచుతున్నాయి. రాత్రి పన్నెండుగంటలకి 'విజయహంస' ఏలూరు చేరుకుంది. అక్కడ ఒక హోటలు దగ్గర విజయహంసని ఆపాడు డ్రైవరు. నేను డ్రైవరు చాయ్ తాగాం. తాతగాడు లాహిరి నిద్రపోతున్నారు. అమ్మ ని, వత్సలని అడిగితే చాయ్ తాగనన్నారు.

బాగా మెల్లగా తోలుతున్నావ్ ఎక్కడా నిద్రడిస్టర్బ్ అవలేదు. అన్నా, డ్రైవర్ని మెచ్చుకుంటూ. డ్రైవర్ నవ్వుతూ తలవూపాడు.

మళ్ళీ ఇద్దరం,విజయహంస, ఎక్కాం.....

విజయహంస విజయవాడ బయలుదేరింది. మెల్లగా నడవడం వల్ల విజయహంస తెల్లవార్ఝామున మూడుగంటలకి విజయవాడ చేరుకుంది. కనకదుర్గ కొండ దగ్గరగా ఒక లాడ్జి తీసుకుని విశ్రమించాం.

మర్నాడు ఎనిమిదిగంటలకి దుర్గమ్మ దర్శనం చేసుకు, అక్కడికి దగ్గరగా ఉన్న మంగళగిరి వెళ్ళి పానకాలనరసింహస్వామిని దర్శించి, ఇంక డైరెక్టుగా తిరుపతే అని బయలుదేరాం విజయవాడలో మేం బయలుదేరేసరికి, సాయంకాలం ఆరయింది. 'విజయహంస'నిన్న రాత్రి ప్రయాణ అనుభవం, డ్రైవరు మీద పూర్తి నమ్మకం పెంచింది. అందరం పడుకున్నాం, విజయహంస మెల్లగా తిరుపతి వేపు సాగుతోంది.

......................

విజయహంస మధ్యలో ఆగితే నిద్రలేచాను. అప్పుడు రెండుగంటలయింది. విజయహంస రోడ్డుసైడుగా ఉన్న టీదుకాణం దగ్గర ఆగి ఉంది. డ్రైవరు టీ తాగుతున్నాడు. నేను తాళం తీసి బయటికి వచ్చా...., అమ్మ వత్సల,తాతగాడు,లాహిరి గాఢనిద్రలో ఉన్నారు. టీ దుకాణం దగ్గర టీ తాగాను.

టీ తాగడం ముగించాక, డ్రైవరు, "బయలుదేరుదామా సార్" అన్నాడు.అలాగే అని పక్కకొట్లో సిగరెట్ కొని వెలిగించాను. వెనక్కి వెళ్ళి విజయహంస డోరువేసి లాక్ చేసి ముందుకొచ్చి డ్రైవరు పక్కన కూర్చున్నాను.

కటికచీకటిని చీలుస్తూ ...., హెడ్ లైట్లవెలుగులో విజయహంస మెల్లగ సాగుతోంది. నా సిగరెట్ మెల్లగా కాలుతోంది. గాలి జోరుగా సాగుతోంది. సిగరెట్ అయిన వెంటనే దాన్ని పారేసి సీటు వెనక్కి ఆనుకున్నాను. గాలి చల్లగా మొహాన్ని తాకి హాయినిస్తోంది. ఎదురుగా ఏ వెహికిల్ రావడం లేదు. యెంత మెల్లిగా వెళ్తుందనుకున్నా విజయహంస నలభైకిలోమీటర్ల వేగంతో వెళుతోంది. గొడిదుడుకులులేవు సాఫీగా సజావుగా పోతోంది. వాతావరణం చల్లగా వుండడం వల్ల, రోడ్డుసైడున చితుకులమంటలు ఆరుతూ వెలుగుతూ కనిపిస్తున్నాయి. కొన్ని చితుకుల మంటలు రోడ్డు మధ్యనే కనిపించాయి. వాటిని తప్పించినపుడు విజయహంస స్పీడు తగ్గుతోంది. చల్లగా గాలి మత్తుగా వుండి...మెల్లగా నిద్రలోకిజారిపోయాను.

'..ఢాం.'అన్న పెద్ద చప్పుడుతో తెలివి వచ్చింది.

రోడ్డుమీద విజయహంస ఆగిపోయింది. చీకటి చిక్కగావుంది. రోడ్డుకి పక్కల చెట్లనుండి కీచురాయలు అరుస్తున్నాయి. ఈ చప్పుడు వచ్చిన రెండు నిముషాల్లో విజయహంస వెనకాతల పెద్ద వెలుగు కనిపించింది. అది మంటల్లా పైకి వచ్చింది. నేను డోరు తెరుచుకు వెనక్కి పరిగెత్తాను. వెనకాల ఏర్పరిచిన ఎక్ ట్రా డీజిలు టాంక్ పగిలింది. డీజిల్ మండుతుంది. రానురాను డీజిలు మొత్తంగా చిమ్ముతోంది. మంటలు చాల ఎత్తుగా లేస్తున్నాయి.

ఆ మంటల వేడికి అమ్మ, వత్సల, లేచారు. ఇద్దరూ బెంబేలుపడిపోయారు. తాతగాడు లేచాడు. ఏడుస్తున్నాడు. డ్రైవరు రోడ్డుపక్కనున్న మట్టితీసి మంటలమీద పోస్తున్నాడు.ఏంచేయాలో నాకు క్షణం అర్థం కాలేదు. తలుపు తెరవాలంటే మంటల్లో నిలబడి తలుపు తెరవాలి. అది సంభవంగా తోచలేదు. వత్సలకి,కీ ఇస్తే తను తలుపు తెరిచి, బైటికి దూకేయగలదు. కొంచెం కాలినా ప్రాణాలతో బైటపడతారు.

వత్సలని కారు పక్కగా ఉన్న కిటికీ దగ్గరకి రమ్మని సైగచేసాను. వత్సల పిచ్చిచూపులు చూస్తోంది. నేను రమ్మన్నట్టు వచ్చింది. కాని నన్ను అర్థం చేసుకోలేకపోతోంది. అప్పుడు అమ్మని పిలిచాను. కాని అమ్మకి కొంచెం చెవుడు అంతగా కనబడదు. ఆ ఎర్రటి మంటలే అక్కడ కాంతిని ప్రసరిస్తున్నాయి. ఆ సమయంలోనే టాంకునిండి బైటికి వస్తున్న డీజిలు కారు చక్రాలకిందకి వెళ్ళి అవి అంటుకుని కాలడం మొదలుపెట్టాయి. దాంతో ఆప్రదేశం అంతా చిక్కని పొగలేచింది. పొగ వేనుని చుట్టేసింది వేనులోకి చొరబడితే వాళ్ళకి వూపిరి ఆడదు. ఏమి చెయ్యాలి? నా ఆలోచనలో నే వుండగానే పెద్దగాశబ్దం చేస్తూ టైర్లుపేలి విజయహంస వెనకభాగం మంటల్లో చతికిలబడిందిఅటుపక్క వో లారిగాని, వాహనం గాని రావడంలేదు.

నాకు ఆలోచన నశించిది ఏంచేస్తే లోపలివాళ్ళు బైటకివస్తారు అన్నఆలోచనేనేనుపరిగెత్తుకు డ్రైవరు సీటు దగ్గరకి వెళ్ళి సీటువనక ఉన్న విండో బద్దలు కొట్టి లోపలికి చూసాను. అప్పుడు వత్సల వెనక్కి తిరిగి నన్ను చూసింది. రమ్మనమని సైగచేసాను. నా జేబులోఉన్న 'కీ' ఇచ్చాను. ఆ 'కీ' తో తలుపు తెరవమన్నాను. వత్సల 'కీ' తీసుకుంది. గబగబా తలుపు దగ్గరకి వెళ్ళింది తలుపు పట్టుకుంది.

కెవ్వున కేకపెట్టి వెనక్కి పడిపోయింది. ఎవరూ గమనించలేదు. గాని తలుపు దాని లాక్ మొత్తం కాలి ఉన్నాయ్ వత్సల అరచేతి చర్మం ఊడిలాక్ కి అంటుకుపోయింది. కాసేపట్లో నల్లగా కమిలిపోయింది.

అప్పుడే ఆ 'కీ' వేనులో నేలమీద పడిపోయింది. నాకు ఏం చేయాలో తెలియలేదు. డ్రైవరు సీటులోంచి వెనక్కి వచ్చాను. నేచేసినతప్పు అదే తొందరలో డ్రైవరు సీటు తలుపు వెయ్యలేదు.పొగంతావేనులోకి ప్రవేసించింది. వేనులోదగ్గులుమొదలయ్యాయి.వేనులో అమ్మని, వత్సలని, తాతగాడిని, లహరినిపొగచుట్టేసింది.

డ్రైవరు చేతిలో కర్రవుంది. దాంతో తలుపు బద్దలకొట్టడానికి చూస్తున్నాడు. అప్పటికి ముందు టైర్లు కూడా కాలడం మొదలుపెట్టాయి. విజయహంస కున్న అసలు డీజిల్ టాంకు బద్దలైంది. దాంతో మంటలు విపరీతంగా పైకి లేచాయి. లోపల అమ్మ,వత్సల, అరుస్తున్నారు, బెంబేలుపడిపోతున్నారు. నాకు పిచ్చి ఎక్కినట్లనిపించింది. డ్రైవరు సరిగ్గా తలుపుని బద్దలు కట్టడం లేదనిపించింది. అతని చేతిలో కర్రని తీసుకుని

మంటల్లోకి వెళ్ళబోయాను. డ్రైవరు నన్ను గట్టిగా పట్టుకున్నాడు. అతని చెయ్యి కొరికాను. అతను వదలలేదు. ఏదో అంటున్నాడు. నాకేం వినబడటంలేదు. ఎదురుగా అగ్ని గుండంలోఅమ్మ, వత్సల, తాతగాడు, చిన్నారి లహరి ఎప్పుడో ఉడికిపోయుంటుంది. బుర్రబద్దలైపోతోంది. ఏం చేయాలి...?

డ్రైవరు నన్ను తట్టుకోలేక,. నన్ను గట్టిగా నెత్తిమీద బాదాడు. నేను ఏడుస్తూ రోడ్డుమీద పడిపోయాను. అప్పటికి టైర్లు కాలిపోయాయి. ముందు టైర్లు పెద్దశబ్ధంచేస్తూ పేలిపోయాయి. విజయహంస పూర్తిగా మంటల్లో చతికిలబడిపోయింది. చిక్కని పొగ మంటలు విజయహంసని పూర్తిగా చుట్టుముట్టేసాయి. సజీవదహనం ఆత్మీయుల సజీవదహనం...యెలా ఆపడం యెన్నో భయాలకి అతీతంగా దృఢంగా విజయహంస నిర్మించా, దాన్ని పగలగొట్టాల్సి వస్తుందని, నేనే అనుకోలేదు. డ్రైవరు యే చితుకుమీదనుంచో నడిపిఉంటాడు. కింద డీజిలు టాంక్ నిప్పంటుకుంది. చేసిన తప్పుకాక, ఇప్పుడు నన్ను అడ్డుకుంటున్నాడు. డ్రైవరు మీద కోపంతో వెనక్కు తిరిగా....

డ్రైవరు నానెత్తిమీద మరో దెబ్బవేసాడు. నాకు స్పృహతప్పిపోయింది. తిరిగి నాకు స్పృహవచ్చేసరికి గూడూరు హాస్పిటలు బెడ్ మీద వున్నాను.

గిరిజాదేవి గూడూరు వచ్చి నన్ను విశాఖ తీసుకొచ్చింది. గిరిజాదేవి గూడూరులో ఏడ్చిన ఏడుపు, ఆమె జీవితంలో ఏడ్చివుండదు. మూడునెలలపాటు గిరిజాదేవి ఇంటిలో ఆమెకి అతిధిగా ఉన్నాను. గెడ్డంగీయలేదు. తలకత్తిరించలేదు. అవి విపరీతంగా పెరిగాయి.

నేను మనుషుల్లో పడేసరికి మూడునెలలు అయింది. ఈమూడునెలలూ గిరిజాదేవి ఇంటిలో ఏం చేసాను. ఏమో వ్యాపారం అంతా గిరిజాదేవే చూసుకుంటోంది. నాకు కష్టంకలిగించలేదు.

ఈ ప్రపంచంలో రెండు భావాలున్నాయి.

నేను ఒంటరిని...........

కాదు..........

రెండూ చాలా హింస పెడుతున్నాయి

ఒక రోజు గిరిజాదేవి ఇంటినుండి మాఇంటికి వచ్చాను. పైడితల్లి, రంగి ఇంటిని చూసుకుంటున్నారు. నన్ను చూసి ఏడ్చారు. నేను ఆఇంటిలోరెండ్రోజులు ఉండడానికి ప్రయత్నించాను. కాని అమ్మ,వత్సల, తాతగాడు, లహరి జ్ఞాపకం రావడం వాళ్ళు ఆఇంట్లో తిరుగుతున్నట్టు ఉండడంతో, నా అసహనం, దుఃఖం ..., లోపలనుండి తన్నుకొచ్చేవి. ఇంక ఆఇంటిలో గడపలేని స్థితికి చేరుకున్నాను. ఇంటిని అమ్మకానికి పెట్టాను. అది తెలిసి గిరిజాదేవి,మంచిపనిచేసావుఅంది.

ఇల్లు అమ్ముడుపోయింది. ఇల్లు హేండోవరు చేస్తూ దేవుడిగదిలోకి వెళ్ళాను. దేవుడిగదిలో అమ్మకోరికప్రకారం పాలరాతిమందిరం కట్టించా... దాంట్లో వెండితో చేసిన దేవుడి పటాలు, వాటికి ఎదురుగా పెద్దపెద్ద వెండికుందులు వెండితో చేసిన హారతిపళ్ళెం, అవీ ఉన్నాయి. ఆ వెండివి అన్నీ తీసి అమ్మెద్దామని నిర్ణయించుకున్నాను.

కాని ఇల్లు కొనుక్కున్న అతను ,వాటి వెల ఇచ్చేస్తాను. వాటిని ఉంచేయండిఅన్నాడు. వెర్రివాడిలా వున్నాడు.

ఈ పటాలు వాటికి పూజలూ, ఏవీ ఎవర్నీ కాపాడవు. ఈ దేవుడోమిధ్య.. అలాగే పట్టుకుపో అన్నాను. ఆ విధంగా ఆఇంటిని ఇంటిజ్ఞాపకాలని, ఆఇంట్లో ముప్పొద్దులా పూజలు పొందిన దేవుడ్నీ వదిలించుకుని సముద్రపొడ్డున వెయ్యి గజాల స్థలం కొని చిన్నఇల్లు కట్టాను. పిచ్చిగా పెరిగిన జుత్తు కత్తిరించాను. కాని గెడ్డం మీసాలు తీయబుద్ధివేయలేదు. ట్రిమ్ చేయించాను. మళ్ళీ ఫర్మ్ కి వెళ్ళి వస్తున్నాను. ఖాళీ దొరికినప్పుడు సముద్రపు ఒడ్డున కూర్చుంటున్నాను. అలల నిరంతర అలజడి, నాలో అనేక ఆలోచనల్ని రేపేవి....

అమ్మ ఇన్ని సంవత్సరాలుగా పూజలు పునస్కారాలు చేసి, ఏం పొందింది. సుఖం అది ఆవిడకి ఆమడదూరంగా ఉండేది. ఏమిటి ఆవిడ చేసిన పూజల ఫలితం.

నా జీవితం అంత సజావుగా లేదు. ప్రతి విషయానికి ఘర్షణ, ఎంతో మానసిక ఆవేదన. ఈ దేవుడు వాడిని కొలిచిన వాడికే హాని చేయగలడు. ఇంక ఈ జీవితంలో ఏం మిగిలింది. యాభైఏళ్ళు దాటాయి. ఎంతో కష్టపడి , అనేక రిష్కులు తీసుకుని పెంచిన ఈ ఆస్తిని యెవరికి ఇవ్వను?

అనుభవించేవారు ఎవరు? నేను పోగానే సమీర కూతురు కొడుక్కి ఈ ఆస్తంతా పోతుందా? నేచేసినదంతా ఎవరికోసం? నాకున్న దంతా ఎవరు అనుభవిస్తారు? అనే ప్రశ్నలు నన్ను వెన్నేంటేవి.

పైన దేవుడు కూర్చుని పకాలున నవ్వినట్లు అనిపించింది! అవును ఈ ముప్పైఏళ్ళల్లో నేపడ్డ కష్టాలకి ఫలితంలేకపోయింది. నేనెక్కడికి వెళితే అక్కడ వాళ్ళు నన్ను మోసం చేసారు. నేనూ వూరుకోలేదు. నేనుఅదేచేసాను.

మామ్మ ఎన్నాళ్ళు ఆవిడ దగ్గర కూర్చోనూ, చావదే, బతికుండి చెప్పిన మాటవినదు. సమయానికి చావదు. ఎన్నిసార్లు యముడ్ని మోసం చేసింది. నేను యముడికి సాయంచేసాను. నాన్న------, నేచేసిన త్యాగం, తీసుకున్న రిస్కు అర్ధం చేసుకోలేదు. తనకి ఆస్థికనబడేసరికి శృంగారం నరనరాల్లో తన్నుకొచ్చింది.

రెండోపెళ్ళి చేసుకుని సంతానం కన్నారు. నన్ను మర్చిపోయారు. అమ్మ అక్కర్లేకపోయింది. మావయ్య నాకష్టాన్ని తన లాభంగా మార్చుకుందామనుకున్నాడు. ఆఖరికి ఏమయాడు?

గిరిజాదేవి, ఇల్లరికపు అల్లుడి కోసం చూసింది. కూతురే కాకుండా పోయింది. ప్రపంచంలో మనుషులందరూ హిపోక్రట్లు, కపటులు.... దోనెంబరీలు, ప్రతీవాడు తనకి ఎంతవరకూ కలసివస్తుందనే కాని, తనేమిటి? తనలో నిజాయితీ ఎంత? అని ఆలోచించరు.

ప్రతీవాడికి ఎదుటివాడి మీద అపనమ్మకం, ఎవడూ స్వార్ధం లేకుండా, నిజాయితీగా బతకడు బతకలేడు. దానికి ప్రస్తుతం వున్న విలువలు సహకరించవు. ప్రస్తుతం ఉన్న విలువలన్నీ కపటమైనవే, దోనెంబరీ (నల్ల) ధనం లేదే జీవితం వ్యాపారం, ప్రభుత్వం ఏలా నడవదో, దోనెంబరీ విలువలు లేనిదే జీవితం గడవటం లేదు.

ప్రిటెండ్ చెయ్యనిదే రోజు గడవటం లేదు, తల్లితో అనుబంధం నటనే దోనెంబరీదే, పెళ్ళాంతో సెక్సు దోనెంబరీదే, కొడుకుమీద అభిమానం దోనెంబరీదే, అల్లుడి మీద గౌరవం కపటమే, స్వంతమనుషుల పట్లబాధ్యత దోనంబరీదే, ఈ కపటనీతి, విలువలు అభిమానాలు, ఆరాధనలూ సంఘంలో పాతుకుపోయి వేళ్ళు తన్నేసేయి. వ్యాపారంలో దోనెంబరీ (నల్ల) కరెన్సీ లేనిదే వ్యాపారమేలేనట్టు ఈ కపటం ముసుగ్గా లేకపోతే ఈ జీవితం లేదు. కాదు నడవదు.

ఆఖరికి దేవుడికి సమర్పిస్తున్నవి దోనెంబరీ కానుకలు అయినపుడు దేవుడు దోనెంబరీ వరాలుకాక ఏమిస్తాడు?, ఏం చూస్తాడు.?

ఈ దేవుడు కూడా దోనెంబరీగా తయారయ్యాడు. ఇంతగా ఆస్థి కోసం నేను పడ్డపాట్లు వృధాపోనివ్వడు. తిరిగి ప్రయత్నం చెయ్యాలా? ఎలా? అని తెగ ఆలోచించాను. అద్దంలో మొహం చూసుకున్నాను. యాభైఏళ్ళు దాటినా మొహంలో బిగి తగ్గలేదు. వెంట్రుకలు అక్కడక్కడ నెరిసినా మొత్తానికి అందంగానే ఉన్నాను. శరీరం దాని బిగి, దాని అందం కాదు నాకు కావలసింది. శక్తి, నాకు పిల్లలు పుడతారా? నా సంతానం అని నాకు ఉంటుందా?.

నా అనేవాళ్ళు నా రక్తం పుచ్చుకు పుట్టిన వాళ్ళు నాకు కావాలి. ఎలా వస్తారు?దానికి ఏం చెయ్యాలి? పెళ్ళి అనే జంఝాటంలో పడే ముందు, నాకు పిల్లలు పుడతారా? లేదా? అన్నది తేల్చుకోవాలి. పిల్లల కోసమే పెళ్ళి!

........................................................................

మర్నాడు ఫర్మ్కి వెళ్ళి డాక్టర్స్ లిష్టులో ఎండోక్రైన్ స్పెషలిష్ట్ డాక్టరు కోసం చూసాను. ముగ్గురు ఎండోక్రైన్ స్పెషలిష్టుల పేర్లు తయారుచేసాను. మా ఫేమలీ డాక్టరుతో సంప్రదించి అందులో డా. ప్రసాద్ మంచి అనుభవం, పేరు వున్న ఎండోక్రైన్ స్పెషలష్టు అని తెలుసుకున్నాను. సెక్రటరీని పిలిచి డా. ప్రసాద్ తో ఎపాయింట్ మెంటు ఫిక్స్ చెయ్యమని చెప్పాను. డా.ప్రసాద్ తో ఎపాయింట్ మెంట్ ఫిక్స్ అయింది. నేను డా. ప్రసాద్ దగ్గరకి వెళ్ళాను. నా సమస్య అంతా చెప్పా-...

" సెమినల్ ఫ్లూయిడ్ టెష్టు చేయించండి." అన్నాడు.

"స్పెర్మ్ కలెక్షను ఎలా?" అన్నాను అమాయకంగా...

"మాష్టర్ బేషన్ తో స్పెర్మ్ తీయండి. ... స్పెర్మ్ బయటికి వచ్చిన వెంటనే టెష్టు చెయ్యాలి. లేకపోతే, స్పెర్మ్ టో జోవా ,, నశించడం మొదలుపెడతాయి. కౌంట్ డిఫర్ అవుతుంది."

"మీ లాబరేటరీలో వీలవుతుందా?",అని అడిగాను."

"యస్" అన్నాడు ప్రసాద్ . పక్కనున్న గది చూపించాడు.

ఆ గదిలోకి వెళ్ళి స్పెర్మ్ తీయడానికి ప్రయత్నించాను.

ఎంతకీ ఇజుక్యులేషన్ అవలేదు.

ఈ సైన్సు, ఈ టెక్నాలజీ వచ్చి శృంగారాన్ని దానికుండవలసిన మృదుత్వం, లాలన, మత్తులేకుండా చేసాయి. చాల కష్టపడిన తర్వాత స్పెర్మ్ ట్యూబులోకి కలెక్ట్ చెయ్యగలిగాను. దానిని డా. ప్రసాద్ కి ఇచ్చి నేను ఇంటికి చేరాను.

నేనిచ్చిన స్పెర్మ్ ఇన్ స్పెక్షన్ వల్ల నేను పిల్లలు కనడానికి ఆశక్తుడిని అని తేలితే ఏం చెయ్యాలి? హార్మోను ఇంజెక్షన్స్ తీసుకోవాలా? ,హార్మోను ఇంజెక్షన్స్ వల్ల అనేక బాధలు ఉంటాయని , అన్ అవాంటెడ్ ఛేంజెస్ శరీరంలో రావచ్చని చెప్పాడు డా. ప్రసాద్ . ఏం చెయ్యాలి? రిపోర్ట్ ఎప్పుడు వస్తుంది?.

చాల ఆతృతగా డాక్టర్ ప్రసాద్ రిపోర్టు కోసం మర్నాడు అతని డిస్పెంసరీకి వెళ్ళా....

డా.ప్రసాద్ రిపోర్టుఇస్తూ "యూ ఆర్ పెర్ ఫెక్ ట్లీ ఆల్ రైట్ స్పెర్మ్ టోజోవా ఎయిటీ మిలియన్ పెర్ సిసి ఉన్నాయి. అండ్ ది ఫ్లూయిడ్ క్వొంటిటీ ఈజ్ ఆల్ సో గుడ్,"అన్నాడు.

------------------------------------------------------------------------

ప్రసాద్ దగ్గర రిపోర్టు తీసుకుని తిన్నగా సముద్రపు ఒడ్డుకి వెళ్ళి కూర్చున్నాను. ఎదురుగా సముద్రపు అలలు ఒడ్డుతో సల్లాపాలాడుతున్నాయి. నిరంతరం ఈ అలల సల్లపాలు సణుగుడు ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. పెళ్ళి చేసుకోవాలి ఎవర్ని?, ఎవరితో ఈ ప్రపోజలు చెయ్యాలి ముందుగా గిరిజాదేవిని సలహా అడగాలి అనుకున్నాను. గిరిజాదేవి జీవితంలో ఎన్ని వొదుదుడుకులకు లోనైనా, తనపని మౌనంగా చేసుకుపోతోంది. అదే చాల విచిత్రం అనిపిస్తుంది. గిరిజాదేవికి విచారాలు ఆనందాలు వేటితో సంబంధం లేదా?

గిరిజాదేవికి ఫోను చేసి మొత్తం విషయం నిక్కచ్చిగా చెప్పాను. నేచెప్పిదంతా చాల ఓపిగ్గావింది. ఆలోచించి చెప్తాను అంది.

"ఇందులో ఆలోచించడానికి ఏముంది?." అన్నాను ఆశ్చర్యంగా

“ ఆలోచించడానికి ఏమీ లేకపోతే ఫోనెందుకు చేసావ్? , నాకు ఎందుకు చెప్పావ్? , అంది సూటీగా గిరిజాదేవి.

నేనేం మాట్లాడలేదు.

రెండ్రోజుల తర్వాత గిరిజాదేవి ఫోను చేసింది. “ నువ్వు తలచింది తలచినట్టూ జరగదు. కొంచెం ఆలోచించి నిర్ణయానికిరా నువ్వు పెళ్ళిచేసుకుంటే నాకేం అభ్యంతరంలేదు.” అంది.

జాగ్రత్తగా ఆలోచించాను. వత్సలని చూసా ..., హైసొసైటీ ఆడపిల్లలు ఎలా వుంటారో తెలుసు అలాంటివాళ్ళ జోలికి పోయి నాకలని చెదరగొట్టుకోడం కన్నా మిడిల్ క్లాసు నుండి వచ్చిన ఏ అమ్మాయిని చేసుకున్నా అణుకువగా ఉండి, నాకు విశ్వాసపాత్రంగా ఉంటుంది. అనిపించింది. అలాంటి అమ్మాయిని వెదకాలి ?.... నాకు నచ్చాలి.!నేను ఇలాఆలోచించానేగాని...నేను ఈ సొసైటీకి కనీసం యాభై ఏళ్ళువెనకబడి వున్నానని ఆలోచించ లేకపోయాను!

నాకు  అమ్మాయికి వయసులో బేధం ఉన్నా పర్వాలేదు. అదీ మిడిల్ క్లాసు వర్కింగ్ గర్ల్ అయితే మరీ మంచిది. ఆ ఆలోచన రాగానే ఆఫీసు స్టాపు లిస్ట్ అడిగా..., అందులో ఏజ్, మేరిటల్ స్టేటస్ మెన్షన్ చెయ్యమన్నాను. పెళ్ళైన వారందరిని చెత్తబుట్టలో పడేసాను. మొగవాళ్ళు పెళ్ళైన వాళ్ళు పోగా మొత్తం నాది,గిరిజాదేవిది, ఫారిన్ కొలాబరేషన్ తో నిర్మించిన ఫర్మలలో పనిచేస్తున్న ఆడపిల్లల సంఖ్య ఇరవై మందికి పైగా తేలింది. అందులో ఎక్కువమంది ష్రింప్స్ పేకింగ్  సెక్షనులో ఆడపిల్లలే....

ఆ ఇరవైమందివీ కాక మరి నలుగురు మేరేజి అయిన ఆడపిల్లల పేర్లు జతచేసి , వీళ్ళందరి బయోడేటా, ఫొటోలతో, వివరాలు కావాలని చెప్పాను.

ఆ వివరాలన్నీ టేబులు మీదకి వచ్చాయి. అందులో ఫొటోలు చూసి ఎనిమిది మందిని సెలక్ట్ చేసా...., ఆ ఎనిమిది మందీ గ్రాడ్యుయేట్స్ , పొటోజెనిక్ , అందరూ మీడిల్ క్లాస్ ఫేమిలీ లోంచి వచ్చారు. ఎందుకంటే అందరి ఫాదర్స్ ఇన్ కమ్ మంత్లీ పదివేల కంటే ఎక్కువకాదు. కొందరు ఆడపిల్లలు అండర్ ఎంప్లాయిమెంట్ చేస్తున్నారు.

నేను ఇదంతా ఎందుకు చేస్తున్నానో తెలియకుండా ఆలిస్టులో ఇద్దరు పెళ్ళైన ఆడపిల్లల్ని కూడా కలిపాను. వీళ్ళందరికీ సెక్రటరీ అన్న వొక జాబ్ సృష్టించి, ఇంటర్వ్యూకి పిలిచా... అందర్నీ ఇంటర్వ్యూ చేసాను. ఆ ఇంటర్వ్యూలో నలుగురు రాలిపోయారు. ఫొటోల్లో ఎంత బావున్నారో , ఫొటోలో రాని శరీరం నచ్చలేదు. అది నేను భరించలేను. అందం కూడా కావాలి. లోపలయెక్కడో ఆడపిల్లే కాదు సెక్సు కూడా కావాలి. శరీరంకూడా ముఖ్యం.

ఆఖరికి ముగ్గురు మిగిలారు. ముగ్గుర్నీ మళ్ళీ ఇంటర్వ్యూకి పిలిచాను. అందులో నువ్వూ ఉన్నావు. నిన్ను చాల ఇష్టపడ్డాను.

సెక్రటరీగా నియమించా .... మొదట్లో ఆఫీసు  చెప్పిన సేలరీ ఇచ్చినా, మెల్లగా నీకు మేనేజ్ మెంటు అప్పగించాను. బహుమతులు కొన్నాను. నీకూ డబ్బుమీద మనసుందని తెలుసుకోగానే, ఇంక ఆలస్యం చెయ్యలేదు. మీనాన్నగారిని కలిసాను. నా మనసులోని మాటను చెప్పాను.

ఆయన ముందు ఆశ్చర్యపోయారు. తర్వాత, “వయసులో చాలా బేధం ఉంటుందేమో?”అంటూ తన సందేహాన్ని వెలిబుచ్చారు.

“అవును నాకు యాభైదాటాయి. “ అన్నాను.

ఆయన చాలసేపు మాట్లాడలేదు. చివరికి “మహతికి ఇష్టం అయితే నాకేం అభ్యంతరంలేదు” అన్నారు.

ఆయనకీ డబ్బాస వుంది. డబ్బు నిత్యావసరవస్తువుకాదు కానీ హాయి కలిగించేగుణందానికి వుంది.



కౌముది

"అది మీరే అడగండి" అన్నాను.

"సరే," అన్నారాయన.

మర్నాడు నువ్వు ఆఫీసులోకి వచ్చి "నాకు ఫోనుచేసి నీకేం అభ్యంతరం లేదు" అన్నావు.

నీ ఇష్టాన్ని తెలుపగానే , మీ నాన్నగారికి , గిరిజాదేవికి ఈ విషయం తెలియచేసి, నిన్ను రిజిష్టర్ మేరేజ్ చేసుకున్నాను.

"అయితే ఇప్పుడు ఈ కధంతా నాకు ఎదుకు చెప్పినట్టు "అని అడిగింది మహతి.

నిజమే ఈ కధంతా మహతికి యెందుకు చెప్పా.

ఎందుకు చెప్పానంటే "నీకూ నాకూ పెళ్ళయి ఏడాది అయింది. కాని నేను అనుకున్నట్టుగా నీకు పిల్లలు పుట్టలేదు. నాకు ఎవరో వారసుడు కావాలి మహతి "అన్నాను మహతితో.

మహతి నన్ను సూటిగా చూసిందేగాని ఏ సమాధానం చెప్పలేదు......

" పిల్లల విషయంలో , చెక్ అప్ కోసం రేపు గైనకాలజిష్ట్ దగ్గరకి వెళదాం "అన్నాను.

దానికీ మహతి సమాధానం చెప్పలేదు.

గిరిజాదేవి వ్యాపారం పనిమీద యు.స్. వెళ్ళింది. అక్కడ మాసివ్ హార్ట్ ఎటాక్ వచ్చి చనిపోయింది.

న్యూస్ తెలిసి ఆశ్చర్యపోయాను. ఇంక సలహా చెప్పేమనిషి కూడాలేదు. ఆమె భౌతికకాయాన్ని ఇండియా తీసుకురావాలి. ఎంత ఖర్చు అవుతుంది అనే అంచనా వెయ్యకతప్పలేదు. వత్సల వుంటే ఈ తర్జనబర్జన వుండకపోను... కాని ఇప్పటి పరిస్థితి వేరు.

శవాన్ని తీసుకరావడానికి అయే ఖర్చుకి అర్ధం వుందా?, యెవరికోసం శవం?, యెవరికి కావాలి? తీసుకొచ్చి దాచుకోం కదా, తగలపెట్టాలి, తగలపెట్టడానికి ఇంత ఖర్చా, ఆవిడ సొమ్ము ఆవిడకి పనికి రాకుండా పోతోంది.

నాకు గూడా మనసు చికాకుగా వుంది. ఆవిడ అంత్యక్రియలు ఇక్కడే జరగాలని మనసుపడే వాళ్ళని ఆవిడ సంపాదించుకోలేదు.

గిరిజాదేవిని అక్కడే క్రిమటోరియంకి అప్పగించి, బూడిద తీసుకొచ్చి సముద్రంలో కలిపేసా, అదో తృప్తి, ఎవరికి?

..........................................

మహతి నేను గైనకాలజిష్ట్ రంజనాదేవి దగ్గరకి వెళ్ళాం . ఆమె చెక్ అప్స్ అన్నీ చేసి, మర్నాడు అమెరికన్ హాస్పిటల్ లో ఆపరేషన్ దియేటర్ బుక్ చెయ్యండి. డి అండ్ సీ చేస్తాను అంది. మర్నాడు అమెరికన్ హాస్పిటలులో మహతి డి అండ్ సి జరిగింది. రంజనాదేవి కొన్ని మందులు రాసింది. మళ్ళీ మూడు నాలుగు నెలల తర్వాత రమ్మంది. మూడు నాలుగునెలలలోనూ ఏ విశేషం జరగలేదు. తిరిగి రంజనాదేవి దగ్గరకి వెళ్ళాం, రంజనాదేవి మళ్ళీ టెష్టులు చేసింది.

"మహతి ఓరల్ కాంట్రా సెప్టివ్ స్ వాడుతోంది." అని నాకు చెప్పింది.

డాక్టరు చెప్పింది నిజమా కాదా అని మహతిని నిలదీసా ... మహతి నిజం వొప్పుకుంది.

"ఎందుకిలా" చేసావన్నాను.

"పిల్లల్ని కనడం తనకి చిరాకు" అంది.

"మరి నన్నెందుకు పెళ్ళిచేసుకున్నావు" అన్నాను కోపంగా.

“మిమ్మల్ని పెళ్ళిచేసుకునే ముందు పిల్లలకోసం నిన్ను చేసుకుంటున్నాను అని మీరు నాకు చెప్పలేదు. మీరు ఈ వయసులో సరదాకే చేసుకుంటున్నారనే అనుకున్నాను. అంతేకాదు నేను మిమ్మల్ని చేసుకున్నది కూడా మీ సంపద చూసే, డబ్బుతో సరదాలు తీరుతాయనే ఇందులో దాపరికం ఏం లేదు.”

నే మహతిని బలంగా లెంపకాయ వేసాను. మహతి నన్ను చాల తీవ్రంగా చూసి, వెళ్ళిపోయింది.

ఆనాటినుండి మహతి రెండు రోజులు నాతో మాట్లాడలేదు. నేనే పలకరించాను. ఆమె అలకతీరలేదు. నాలో ఆతృతమొదలైంది. ఇంక ఈ జీవితం ఎన్నాళ్ళు ఉంటుంది. పిల్లలు పుడతారా? పుట్టరా? గిరిజాదేవి ముందే హెచ్చరించింది. నువ్వు ప్లాను చేసి అనుకుంటున్నట్టుగా ఏవీ జరగదు. మహతి మధ్య తరగతిలో పుట్టినా, హైసొసైటీ లేవిష్  నెస్కి షాపింగ్స్ కి అలవాటు పడిపోయింది. హైసొసైటీ గేదరింగ్స్ లో పెద్దషేకుతో పేకాట ఆడడం, ఫారిన్ బ్రాందీలు, డైమెండ్స్ నక్లెస్  ఎంపిక, ఆమెకి ఇచ్చినంతసంతృప్తి, ఫర్మ్ వర్క్ గాని, నాతో కాపరం గాని, పిల్లలమీద మమకారంగాని లేవు.

అప్పటికే నాకు యాభైనాలుగు ఏళ్ళు. ఇలా ఎన్నాళ్ళు సాగుతుంది. మహతి నయాన లొంగడం లేదు. కనుక భయానవొప్పిద్దామని చూసాను.

ఇంకోరోజు ఆమెతో ఘర్షణకి దిగాను. విడాకులు ఇస్తానన్నాను. తంతానన్నాను. అని ఒక లెంపకాయబలంగా కొట్టాను. ఇంతకు ముందు లెంపకాయ కొట్టినప్పుడు తీవ్రంగాచూసినట్టే ఈసారీ చూసింది. కాని అక్కడ నుండి వెళ్ళిపోలేదు. నాచేతివేళ్ళు ముద్ర ఆమె లెంపమీద స్పష్టంగా కనిపిస్తోంది.

మహతి నా దగ్గరగా వచ్చింది. “చూడండి మీరు మొగాళ్ళు బలం ఉంది. కొట్టగలననుకుంటున్నారేమో నేను స్కూల్లో, కాలేజీలో ఎథలిటిక్ చాంపియన్ని, ఆ విషయం మీకు తెలియదు. రోజూ పొద్దున్నే అయిదు గంటలనుండి ఏడుగంటలవరకూ జిమ్ లో గడిపిన దాన్ని జాగ్రత్త” అంది.

”అంటే నువ్వు కొడతావా” అన్నాను కోపంగా.

“అవసరం అనిపిస్తే తప్పదు”

నేను కోపం ఆపుకోలేకపోయాను. మళ్ళీ మహతి దవడ పగలకొట్టేను.

ఆనిముషంలోనే నాదవడ పగలిపోయింది. మహతి చేతుల్లో ఇంతబలం ఉంటుందని నేను ఊహించలేదు.

ఛెళ్ళుమని చెంప పగిలిందా, ఫెఢీమని మహతి కొట్టిందా, అన్నది అనవసరం. నాకళ్ళ ముందు మెరుపు మెరిసింది.

ఆ మెరిపించింది మహతి, పెళ్ళాం మొగుడ్ని కొట్టిందా, అనికాదు. తగిలిన దెబ్బ అలాంటిది వేల వాట్టుల విద్యుత్తు మెదడులో ప్రవేశించి.... ప్రవహించి....చైతన్యంగా మారి....అరణిశిఖై చిచ్చుపెడుతోంది. ఏదో లోపం ఎక్కడో  తేడా, తప్పు ఏమిటో అర్ధం కావడంలేదు. ఈ దావానలం చల్లబడదు. చల్లబడ కూడదు, ఎదురుగా శీతకరుడు కూడా చల్లార్చలేని, హాలహలం కంఠంలో లేదు మెదడులో ప్రవేశించింది. ఆలోచన్లు ఆర్చుకుపోతున్నాయి. కార్చిచ్చు వెలుగవుతుందా.......,

అదే ఆలోచన ఎక్కడుందీ లోపం, కార్చిచ్చుఎందుకు రగిలింది?ఎందుకుదహిస్తోంది? నా స్వార్ధం తేడాతెచ్చిందా?.

స్వార్ధం లేనట్టుగా శకిలిస్తాం కానీ....., స్వార్ధం లేకుండా బొటనవేలుకూడా కదపం అది లోకం గుర్తించదా, గుర్తిస్తుంది.

అదికూడా మొహంమీద నవ్వదు, పక్కకి తిరిగి నవ్వుకుంటుంది. ఏభావమేనా. దాచడానికి ఎందుకు ప్రయత్నిస్తాం, ఎకౌంటబుల్ గా వుండకూడదు అనుకొంటాం.,

ముసుగు, కపటం, యుక్తి,జీవితంలో వుపయోగిస్తాం నిజం అని నమ్ముతాం, లేదా, నిజం చెయ్యడానికి ప్రయత్నం, తత్వం వేరు., ఆత్మ వేరుహృదయం వుండదు, మమేకం చెందం, ఏకంఅన్నసూత్రం జీవితంలో పెద్దగా వుపయోగపడదని అభిప్రాయం. జీవితం కూడా జవాబుదారీ కాకుండా ఏ నీతి, ఏధర్మం ఏ విలువలు లేని చట్రంలో బిగిసిపోకుండా... గడిపేస్తామో ఆ జీవితాన్ని నెంబర్ వన్ అంటామా? దోనెంబరీ అంటామా? లేక అనార్కిఅంటామా?

దూరంగా క్షితిజం మీద వుదయిస్తున్న నిండు తదియ చంద్రుడు తపిస్తున్న నా మనసునిగానీ, నిత్యఘోషతో అలసిన జలధిని కానీ తీర్చలేదు, మరి శీతకరుడు అని పేరెందుకు తెచ్చుకున్నాడు. సముద్రంలో కెరటాల్లా ఆలోచన్లు అల్లకల్లోలంగా వున్నాయి. నా పిల్లలే నా ఆస్తి అనుభవించాలి. అన్న ఆలోచన ఎందుకు వచ్చింది? అది తప్పనిపించలేదు. అది తప్పెందుకవుతుంది? అది తప్పో వొప్పో ఇప్పుడీ ఆలోచన యేమిటి? ఈ ఆస్తి ఎవరిది? వారసులకే ఎందుకు దక్కాలి? వారసులకేఎందుకు ఇవ్వాలి? ఎవరు వారసులు? చచ్చాక నాది అన్నదాన్ని వదలకపోవడం అంటే ఇదేనా? బతికుండగా నా కోరిక... నాకల సాకారంకాలేదు.

“కల..కల..కల..” మహతి ఏమంది. జీవితమంతా కలగానే గడిచింది. నా ఫ్రెండు ఎనిమిది వేల డ్రెస్ వేసుకుంటే నాకు చికాకు విసుగు... ఫ్రెండ్స్ అందరూ వేలరూపాయలు కంట్రిబ్యూటు చేసుకు, జగదాంబలో సినిమా చూసి దాల్ఫిన్స్ లో భోజనం చేసి సెలిబ్రేటు చేసుకుట్టుంటే..., వొంట్లో బాగులేదనే సాకు మనసుని దహించేది. యేది బాగులేదు?. అసలు బాగులేనిది..., లేని డబ్బు.... డబ్బే అవసరం తీరుస్తుంది. ఏ నైతికతకి లేని మారకం విలువ డబ్బుకి వుంది. నా కలని నిజం చేయగలది డబ్బు. జీవితంలో కురచతనం పోవాలి అందుకే మిమ్మల్ని పెళ్ళిచేసుకున్నా..., అన్నప్పుడేనా గ్రహించవలసింది.

ఇదేది నాది కాదు మరెందుకీ దేవులాట? ఇక్కడ నాకేదో వుందనే భ్రమ, ఎందుకు కలిగింది? ఇక్కడ నాదేం లేదా? మరినేనెందుకింత అతుక్కు పోతున్నా... ఇదేది నాది కాదా? కాదన్నట్టే వుంది... కానీ తెగటంలేదు. తెంచాలి, యెక్కడ మొదలుపెట్టాలి. యింతవరకూ నాకెదురులేదు. నాతెలివితేటలకి ఆపులేదు. కానీ అది తప్పని తేలింది. అదీ మహతి చెంపదెబ్బతో... ఇదంతా నాది, నాతెలివి తేటల ప్రభావం, జీవితంలో తిరుగులేదు. అనుకున్నా... విధి నన్ను అదఃపాతాళానికి తొక్కేసినా, జంకలేదు.అది తలపుకు రాగానే అరవాలనిపించింది.

కానీ చుట్టూ జనం అరవడం మానసిక రుగ్మత అనిపించుకుంటుంది., మహతి చెయ్యిచేసుకోగానే కంగుతిన్నా... అనుకోని సంఘటనకి ఆశ్చర్యపోయా తిరిగి చెయ్యిచేసుకునుండే వాడ్నే కానీ మహతి సంగతి తెలుసు, పరుగు పందాల్లోనూ, జావలిన్ త్రోలేనూ చాంపియన్, పెళ్ళయిన తర్వాత కూడా రోజూ జిమ్ కెళుతోంది. ఆ విషయం ఆ చెంపదెబ్బతో అర్థం అయింది. తనీ వయసులో మహతిని ఈ వయసులో పెళ్ళి చేసుకున్నదెందుకు?

చేసిన పనులన్నీ సక్స్ స్ లా కనిపిస్తున్నాయి. కానీ సక్స్స కావడంలేదు. యెందుకు? మహతి విషయంలో పొరపాటెవరిది? నాదా?

నా ఆస్తిని చూసి మోజుపడి మహతి పెళ్ళికొప్పుకుంది. అందుకు బదులుగా శరీరాన్ని యివ్వడంతో సరి అనుకుంది. మహతి నాజూకయిన శరీరం వెనుక యింత బలం వేగం వుంటాయంటే నమ్మబుద్దేయలా, ఇప్పుడు నమ్మకంతో పనిలేదు. నమ్మడానికి బుద్ధవసరం లేదు. మహతి చెంపదెబ్బకి బాధ ఆశ్చర్యం కలగలా, హీనపడ్డాను... అదే మనసుని దహిస్తోంది. లోపల తపన పెరుగుతోంది, అసహనం... ఎవరిమీద?

నా ఆలోచన ఎన్నడూ యింతే, తెలివి, సాహసం మీద ఆధారపడినంతగా, వేదన వుద్వేగానికి లోను గాలేదు.కానీ అలా అనుకోడానికి వీలులేదు. అమ్మ యెక్కడో యేదో తెలీని అంతఃకుహరల్లో మమతని మార్దవాన్ని తట్టిలేపింది. యెమోషనల్ ఫీలింగ్ కి అప్పుడప్పుడు అర్థం

చెపుతుంది. అమ్మ పిలుపే అంత ఆ పిలుపులో డేసిబెల్స్ మనసుని కలవరపరుస్తాయి. యెందుకో ఆ పిలుపు తప్పించి, యే పిలుపూ యే బంధుత్వమూ గుండెల్లోకి చొరబడలేదు.

సరిగ్గా ముప్పైఏళ్ళక్రితం నా ఆలోచనలకి పదును పెట్టవలసిన అవసరం వచ్చింది.

కానీ ఈ రోజు అసలు తీవ్రంగా ఆలోచించవలసిన అవసరం ఏర్పడుతోంది. జీవతానికి ఆలంబన కావాలి. కుటుంబం కావాలి. వ్యక్తిగత జీవితంలో స్వార్ధపు అంధత్వంతో నా అనేవాళ్ళని దూరంచేసుకున్నా యెందుకో కొన్ని విలువల్ని తెలుసుకోలేకపోయా, అంతా అయోమయంగా వుంది.

అప్పుడు రాగిణి గుర్తుకు రాకపోలేదు. ఆనాటి రాగిణితో నాకున్న సంబంధం చూచాయగా మనసులో మెదిలింది. మావయ్యా అత్త నా దగ్గరకి వచ్చి ప్రాధేయపడ్డానికి కారణం రాగిణి కడుపుతో వుండడమేనా?రాగిణి ప్రసవించిందా? ఇప్పుడు యెక్కడ వుంది. నా వారసుడా? రాగిణి పెళ్ళిచేసుకుంటే, మొగుడుకి ఈ పిల్లవాడిగురించి తెలుసా.

ముందుగా చాలవిషయాలు రాబట్టాలి.

అతి కష్టం మీద మావయ్య పోయిన విషయం తెలిసింది. అత్తయ్య కొడుకు దగ్గర హైదరాబాదులో వుంది. రాగిణి మావయ్యరెండోకూతురు యెక్కడున్నారో తెలియలేదు.

రాగిణిని పట్టుకోడం కష్టం. వునికి తెలుసుకున్నా రాగిణికి సంతానం సంసారం వుంటాయి. తనకాపురం చెడకొట్టుకుంటుందా డబ్బుకి ఆసపడుతుందా అక్రమసంబంధం పైకి వస్తుంది. రాగిణి మొగుడు దాన్ని యెంతవరకు వొప్పుకుంటాడు. ఇది జరిగేపనికాదు.

మరింక నావాళ్ళెవరు. నా తండ్రికి కావలసిన వాళ్ళు నా వాళ్ళు అవుతారా?

సమీర, సవతితల్లి ఆమె సంతానం, వాళ్ళ నెప్పుడూ నావాళ్ళుగా చూడలేదు. అలాగని వాళ్ళతో శతృత్వం లేదు. నాన్న పోకముందు యేదో వొకటి రెండుసార్లు వాళ్ళింటికి వెళ్ళానేమో, వొకటి ఆస్తిపనిమీద, రెండు నాన్నపోయినప్పుడు. సమీర నన్ను చేరదీస్తుందా? నా నిస్సహాయతని సానుభూతితో అర్ధం చేసుకుంటుందా? వయసులో యెంతో బేధంవున్న సమీర పిల్లలు నాకు తోబుట్టువులు అవగలుగుతారా? ఆనాడు నాన్న మీద అంత పగయెందుకు? అది సమీర మీద యెలాంటి ప్రభావం చూపింది?అది గుర్తుపెట్టుకుందా?

ఏది ఏమైనా సమీర దగ్గరికి వెళ్దాం అని నిర్ణయించుకున్నా....

నేను మీకు చేసిన అన్యాయం అనే కన్నా నేను నాన్నకి చేసిన అన్యాయం నన్ను వెన్నాడుతుంది. ఆరోజుల్లో నేను ఏమాత్రం సహనం వహించి నాన్నని అర్ధం చేసుకోడానికి ప్రయత్నించినా బావుండేది. కాని విపరీతమైన కసితో ఆనాడు నాన్నని ఏదో శత్రువులా చూసాను. చచ్చిపోతున్న మామ్మదగ్గర్నించి పల్లెటూర్లో ఆస్థిని సంపాదించడం నేను చేసిన త్యాగం, జీవితంలో తీసుకున్న రిస్కులాగ కనిపించింది. దాని ఫలితాన్ని మీతో పంచుకోబుద్ధి వెయ్యలేదు. అందుకే నాన్నని మోసం చేసాను.

ఎదురుగా సమీర కూర్చుని ఉంది దాదాపు నావయసు కన్నా నాలుగేళ్ళు పెద్దది, కొద్దిరోజుల క్రితం గవర్నమెంటు ఉద్యోగం నుండి రిటైర్ అయింది. పక్క కుర్చీలో హిరణ్ కూర్చని ఉంది. నాన్నగారి పోలికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆమెకి ముప్పైఏళ్ళు ఉండవచ్చు ఆమెకి. ఆరేళ్ళ కొడుకున్నాడు. వాడు తల్లి వడిలో కూర్చుని దీర్ఘంగా చూస్తున్నాడు. సమీర ఉద్యోగం చేస్తూ హిరణ్ ని కిరణ్ ని చదివించింది. హిరణ్ కి పెళ్ళి చేసింది. ఆమె భర్త కంప్యూటర్ ఇంజనీర్. కిరణ్ మెడిసిన్ చదివాడు. రెండేళ్ళక్రితం పెళ్ళయింది. అతని భార్య కూడా డాక్టరు. ఈవిషయాలన్నీ దయాకర్ ద్వారా మొన్ననే తెలుసుకున్నాను.

నా ఆస్తిని మహతిలాంటి శాఖిని చేతిలో పెట్టదల్చుకోలేదు. మహతికి పోటీ ఉండాలి. అదీ తన అయిన వాళ్ళయిఉండాలి. ఇలా ఆలోచించే, సమీరని పిల్లల్ని కలిసాను.

"అనవసరంగా శ్రమతీసుకున్నావ్ " అంది సమీర....

"ఇందులో శ్రమేముంది." అన్నా ఆశ్చర్యంగా.

"మాకెవరికి ఆస్తిమీదగాని, పోష్ లైఫు మీదగాని అంత అభిమానం లేదు. హిరణ్ జీవితం హాయిగా ఉంది. కిరణ్ హాయిగా ఉన్నాడు. ఇప్పుడు మేం నీ బిజినెస్ లో ప్రవేశిస్తే మహతి ఊరుకోదు. అక్కడనుండి ఘర్షణ, మానసికంగా శాంతికి దూరమవుతాము."

"నాకూ బిజినెస్ మీద ఏం ఇంట్రష్టు లేదు." అన్నాడు కిరణ్

"ఎందుకులెద్దూ లేనిపోని గొడవలు..." అంది. హిరణ్ కొడుకుని దగ్గరగా తీసుకుంటూ...

అయినానేను నిరాశ చెందలేదు.

"గొడవలేమున్నాయి. మెల్లగా ఆలోచించుకు చెప్పండి. మళ్ళీ వస్తాను. అని లేచి వచ్చేసాను.

హిరణ్ కి కిరణ్ కి ఆస్తి ఇవ్వడానికి ఉద్వేగంలో నిర్ణయించాను. కాని అక్కడకి వెళ్ళాక హిరణ్ ని కిరణ్ ని చెల్లెలు, తమ్ముడు అని సంభోదించలేకపోయాను. ఒకలా చూస్తే ఆ ఇంట్లో కూనిరాగాలు తీస్తూ గౌరవభిమానాలు పొందుతున్న శాంతి వాతావరణానికి అసూయ చెందాను. ఇలా ఆలోచించుకుంటుండగా ఫోను వచ్చింది. ఫోను ఎత్తి,"హలో" అన్నాను.

"నేను మహతిని," అంది. అవతల నుండి మహతి ఆపేరు వినగానే ఫోను క్రెడిల్ మీద పెట్టేసాను. పదిహేనురోజులుగా నేను ఇంటికి వెళ్ళడంలేదు. హోటల్ గ్రీన్ పార్కులో రూము తీసుకుని ఉంటున్నాను. మహతికి డబ్బు అందకుండా జాగ్రత్తపడ్డాను. ఇంట్లో మిగిలిన డబ్బు అయిపోయివుంటుంది. డబ్బుకోసం ఫోనుచేసింది రాక్షసి.

ఆ ఆదివారం మళ్ళీ సమీర ఇంటికి వెళ్ళాను. ఈసారి కుటుంబసభ్యులు అందరూ హాలులో కూర్చుని టి.వి చూస్తున్నారు.

సమీర సోఫాలో కూర్చుంది. ఆమెకి పక్కగా కార్పెట్టు మీద కిరణ్ కూర్చున్నాడు. సమీర కొడుకు తలమీద చెయ్యివేసి కొడుకుని లాలిస్తోంది.కిరణ్ కి పక్కగా హిరణ్ కొడుకు కూర్చున్నాడు. వాడు కిరణ్ ఉత్తుత్తి ఫైట్ చేస్తున్నారు. ప్రక్కగా సోఫాలో హిరణ్ భర్త కూర్చన్నాడు. అతని ప్రక్కన హిరణ్ కూర్చుని ఉంది. నన్ను చూడగానే కిరణ్ భార్య లోపలికి వెళ్ళిపోయింది. కాసేపట్లో ట్రేలో కాఫీలు తీసుకొచ్చింది.

అందరం కాఫీలు తాగాం.

"నేను చెప్పిన విషయం ఏం ఆలోచించారు." అన్నాను.

"ఎందుకులే లేనిపోని జంఝాటం అంటున్నారు పిల్లలు"అంది సమీర

నేనేం మాట్లాడలేదు. "మీ శాంతిని, ఆనందాన్ని పాడుచేయడానికి వచ్చిన రాక్షసుడ్లా కనిపిస్తున్నానా?" అని అడిగాను. నవ్వుతూ.

వాళ్ళెవ్వరూ నవ్వలేదు.

"నేనెంతో ఆశపడి వచ్చా.... ఈ వయసులో కూడా కుచ్చితమైన ఆలోచనతో మీదగ్గరకి వచ్చానని మీరు అనుకోవద్దు. నేను బి.పి పేషంటుని ఈరోజో రేపో పోవచ్చు. పోకపోవచ్చు. నాకు సాయం చెయ్యండి. మహతికి నేను అన్యాయం చెయ్యను. ఎన్నో కష్టాలకోర్చి సంపాదించి పెంచిన ఆస్తిని, పేకాటల్లోనూ, క్రికెట్ ఆటల బెట్టింగ్ ల్లోనూ, పోగొట్టుకోడం నాకిష్టం లేదు ప్లీజ్"అన్నానుప్రాధేయపడుతూ.

అందరూ చాలసేపు మౌనంగా కూర్చున్నారు. ఇంక వీళ్ళెవరూ నన్ను గౌరవించరు. నా ఆలోచనలూ, నేనూ, నా ఆస్తి వీళ్ళకి అవసరంలేదు. అనిపించింది. చాల నిరాశచెందాను. మళ్ళీ వంటరితనం నన్ను పట్టిపీడిస్తోంది.

"సరె వస్తా" అంటూ లేచాను.

"కూర్చో"అంది సమీర

నేను ఆశ్చర్యంగా సమీరవంక చూసాను.

"కుమార్ నువ్వు ఏదో మాట్లాడతానన్నావుగా. మాట్లాడు" అంది కుమార్ వేపు చూసి.

కుమార్ హిరణ్ భర్త.

కుమార్ కాసేపు దీర్ఘంగా సమీరని చూసాడు. మిగతా కుటుంబసభ్యులందరూ మౌనంగా కూర్చున్నారు.

నేనెంతో ఆశతో "ఏమిటి కుమార్ మీరు మాట్లాడేది, చెప్పండి."అన్నాను.

"నేను మీకు వ్యాపారంలో సహాయం చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను. దానికి నాకిప్పుడున్న ఉద్యోగం వదిలేయాలి అది చాలరిస్కు ఎందుకంటే నా పని, నేను, రేపు మీకు నచ్చకపోవచ్చు. అలా నచ్చని నాడు నేను రోడ్డుమీద ఉంటాను. అందుకని నేను కొన్ని షరతులు పెడతాను. తర్వాత ఎగ్రిమెంటు రాయించుకుందాం ఏమంటారు" అన్నాడు కుమార్ .

కుమార్ మాట్లాడిన తర్వాత సమీరగాని హిరణ్ గాని , కిరణ్ గాని ఏం మాట్లాడలేదు. అంటే ఈ విషయాన్ని ఆ కుటుంబసభ్యులు ముందుగానే ఆలోచించి పెట్టారు అన్నమాట.

నేను రెండు నిముషాలు ఆలోచించి "చూడు కుమార్ నీకు కావలసినట్టు అగ్రిమెంటు రాసిపట్రా" నేను సంతకం పెడతాను అన్నాను.
అని " ఈ రోజు నుంచి నువ్వు వత్సల ఇండస్ట్రీస్ కి మేనేజింగ్ డైరక్టర్ వి. యు ఆర్ వెల్ కమ్"అన్నాను. వెళ్ళడానికి లేస్తూ "వస్తాను" అని చెప్పి లేచాను.
"అన్నయ్యా భోజనానికి ఉండిపోకూడదా" అంది హిరణ్.

హిరణ్ వేపు చూసి, సమీరవేపు చూసాను.

"ఉండు భోజనం చేసి వెళ్దూగాని" అంది సమీర.

వాళ్ళందరితో కలిసి భోజనం చేస్తుంటే ఈ జీవితంలో మళ్ళీ జీవం వచ్చినట్లనిపించింది.

..........................

నేను కుమార్ మాపనిలో బిజీగా ఉండగానే మహతి మూడుసార్లు ఫోను చేసింది. కాని మాట్లాడలేదు. ఒకసారి సరాసరి మహతి నా ఫర్మకి వచ్చింది. ఆమెని గుర్తించలేనంతగా మారిపోయింది.

"నన్ను క్షమించండి . తప్పు జరిగిపోయింది. ప్లీజ్ ఇంటికి రండి." అంది.

ఆ అర్థింపులో సిన్సియారిటీ గుర్తించాను. అయినా ఇంటికి వెళ్ళడానికి మనస్కరించలేదు. డబ్బు చిక్కకనాటకమాడుతుందేమో, అన్న అనుమానం వచ్చింది. ఆరోజే ఇంటికిఫోను చేసాను. రంగి ఎత్తింది. రంగిని ఆఫీసుకి వచ్చి కలుసుకోమని చెప్పి ఫోను పెట్టేసాను. ఆరోజే మధ్యాహ్నం రంగి ఆఫీసుకొచ్చింది. మహతి వివరాలు చెప్పింది. ఆమె చెప్పిన వన్నీ వింటుంటే మహతి నిజంగానే పశ్చాత్తాపపడినట్లు అనిపించింది. మరి రెండురోజులు వెయిట్ చేసాను. ఆ రోజు మహతి మళ్ళీ ఫోను చేసింది. అప్పుడు ఆమెతో రేపు ఇంటికి వస్తున్నాను అని చెప్పాను.

ఆరోజు సమీర ఇంటికి వెళ్ళి కుమార్ రాయించిన ఎగ్రిమెంటు మీద సంతకం పెట్టాను. మర్నాడు కుమార్ ఆఫీసుకి వస్తానన్నాడు.

.......................................... .

వత్సలా ఇండస్ట్రీస్ బాధ్యత కుమార్ కి అప్పగించి నేను ఇంటికి చేరుకున్నాను. ఇంటివాతావరణం చాల ప్రసాంతంగా ఉంది. నేను వెళ్ళిన నాటినుండి మహతి ఇల్లు కదలలేదు.

నా ఫిషింగ్ బిజినెస్, చూసుకుంటున్నాను. ఒకటి రెండుసార్లు కుమార్ నా సలహా కోసం నా దగ్గరకి వచ్చాడు. గిరిజాదేవి ఇంటిని రెనవేట్ చేయించి.హిరణ్ కి వుండడానికి ఇచ్చాను. కుమార్ హిరణ్ ఆఇంటికి మారిపోయారు. సమీర కిరణ్ వాళ్ళున్నఇంటినుండి మారనన్నారు. హిరణ్ గిరిజాదేవి ఇంట్లోకి వచ్చినప్పటినుండి రోజు ఏదో టైములో వాళ్ళింటికి వెళ్ళిరావడం అలవాటైపోయింది. హిరణ్ కొడుకు "మావయ్య మావయ్య" అంటూ నావెనుక పడేవాడు. ఇద్దరం సముద్రపొద్దున షికార్లు చేసేవాళ్ళం. నేనూ హిరణ్ చాల అభిమానంగా మెదిలేవాళ్ళం. కిరణ్ గాని సమీరగాని అంత దగ్గరగా రాలేదు.

కుమార్ తన ఆఫీసుపనిలో బిజీగా ఉన్నాడు. మహతికి ఈ విషయం తెలిసినా ఏమీ అభ్యంతరం చెప్పలేదు. కాకపోగా హరణ్ ని వాడి కొడుకుని చాల అభిమానంగా చూసేది. మహతి రాత్రిళ్ళు పేకాట క్లబ్బులు అన్నీ మానేసింది. ఇంటి పనుల్లో శ్రద్ధ చూపిస్తోంది.

ఆఫీసు విషయాల్లో కూడా చాల సహాయం చేస్తోంది. అన్నీ అనుకున్నట్టు జరగవు. జరిగేవాటిని మనం ఆపలేము. ఈ ఫిలాసఫీ నాకే వంటపట్టిందా అన్న అనుమానం కలిగింది. దానికి నా వయసు జీవితంలో కలిగిన అలసట కారణం కావచ్చును. ఆ పరిస్థితిలోనే, మహతి కడుపుతో ఉన్నట్టు వార్త చెప్పింది

ఏడాది క్రితం మహతి ఈ వార్త చెప్తే, సమీరని గాని కిరణ్ ని గాని హిరణ్ నిగాని వెదక్కపోదునేమో జీవితంలో నా అహంభావం, నాతోనే కాలం చేసేవేమో కాని ఈనాడు కుమార్ వత్సలఇండస్ట్రీస్ తన స్వంత ఆలోచనలతో, నిర్ణయాలతో నడుపుతున్నాడు. హిరణ్ స్వంతఇంట్లో మనిషిలా కేజువల్ గా వుంటోంది. సమీర, కిరణ్ మాత్రం దూరంగానే ఉన్నారు. కాని అభిమానంగానే ఉంటున్నారు.

ఇప్పుడు ఏం చెయ్యాలి?. కొడుకు పుడతాడా? వాడి బాగోగులు చూడగలనా? ఎవరు పుడతారో ఎలా చెప్పగలను? ఈ విషయం కుమార్ తో చెప్తే ఏం చేస్తాడు. ఎగ్రిమెంటు రెండేళ్ళవరకే, కుమార్ కూడా తన జాబ్ కి రిజైన్ చెయ్యలేదు. ఈ మధ్యనే హిరణ్ కి ప్రత్యేకంగా కారుకొనిఇచ్చాడు.

మహతి కడుపుతో ఉంది. అనగానే తనకి వారసుడు పుడతాడనగానే తనెందుకిలా ఆలోచిస్తున్నాడు. ఈ ఆలోచనలతో మధనపడుతూ, హిరణ్ ఇంటికి వెళ్ళడం తగ్గించేసాను.

మహతితోనే సాయం కాలాలు గడుపుతున్నా . మహతే భవిష్యత్తుగా కనిపిస్తోంది. ఒక రోజు సమీర దగ్గర్నించి రమ్మనమని కబురొచ్చింది. నేను వెళ్ళాను. నేను వెళ్ళేసరికి హిరణ్, కుమార్,సమీర ఇంట్లోఉన్నారు. "మావయ్యా మావయ్యా" అంటూ హిరణ్ కొడుకు వచ్చి నామీద పడ్డాడు.

నేను వాడ్ని వొళ్ళోకూర్చోబెట్టుకుని సోఫాలో కూర్చున్నాను.

"ఎందుకురమ్మన్నావు" అని అడిగాను.

"మహతి కడుపుతో ఉందట కదా?"

"అవును మూడోనెల"

"చూడు నువ్వు నీకు మహతి వారసుడ్ని ఇవ్వలేకపోతోందని బాధపడుతూ ఇక్కడకి వచ్చావు. మాకు తోచింది చేతనైంది సహాయం చేద్దామనుకుని, మాపరిధిల్లో నీకు సహాయం చేసాం. లేదా నీమనసుకి శాంతిచేకూర్చేం. దాని కోసం మేమేం త్యాగం చెయ్యలేదు. ఇప్పుడు మహతి నీకోరిక తీరుస్తోంది. నీ మనసులో వున్నది చెప్పు. హిరణ్,కుమార్ ఏమనుకోరు. ఏదో ఘర్షణ జరగడం కన్నా మర్యాదగా తప్పుకుంటే మంచిది. కుమార్ కి తన ఉద్యోగం ఉండనే ఉంది. నువ్వు మనసు విప్పి నీమనసులో ఏముందో చెప్పు. మీనాన్నగారి నాటి పరిస్థితి రాకూడదని నాఆశ " అంది సమీర.

కుమార్ గాని హిరణ్ గాని ఏం మాట్లాడలేదు. నేను రెండు నిముషాలు ఆలోచించాను. మనిషి ప్రవర్తనలో చూపించే ఏక్ నెంబరీ విలువలకి దోనెంబరీ విలువలకి తేడా నమ్మకం మనిషి మీద మనిషికి ఉండవలసిన నమ్మకం. నేను ఏం నిర్ణయించుకున్నా వాళ్ళకి ఇష్టమే, కాని అది ఓపెన్ గా నిర్మొహమాటంగా ఉండాలి. ఏం చెయ్యాలా? అని చాలసేపు ఆలోచించాను. ఏ విషయం రెండురోజుల్లో చెప్తాను అని లేచి వచ్చేసాను.

..........................

రెండు రోజుల తర్వాత సమీర ఇంటికి వెళ్ళాను. కుటుంబసభ్యులు అందరూ కూర్చుని మాట్లాడుకుంటున్నారు. కిరణ్ అంటున్నది నాచెవిని పడింది.,"ఇతరుల మీద ఆధారపడే కన్నా మనది అని మన జాబ్ మనకుండడం మంచిది" అని

నన్ను చూసి వాతావరణం మారింది. నన్ను చూడగానే హిరణ్ కొడుకు మావయ్యా అంటూ వచ్చి మీదకి ఎక్కేసాడు. హిరణ్ లేచి కాఫీ అంటూ లోపలికి వెళ్ళింది. అందరూ నన్నే చూస్తున్నారు. కాని, వాళ్ళకినేను తీసుకునే నిర్ణయం మీద ఆశక్తిలేదు. అన్న విషయం అర్ధం అయింది. ఎందుకంటే నాకధని ఈ పాటికి కుమార్ విని ఉంటాడు. తను జాబ్ జాయిన్ అవడం ష్యూర్ గా నిర్ణయించుకుని ఉంటాడు.

నేను కుమార్ ని నీ ఎగ్రిమెంటు కాపీ తీసుకురా అన్నాను. కుమార్ లోపలికి వెళ్ళి ఎగ్రిమెంటు కాపీ తీసుకొచ్చాడు ఇది నా ఎగ్రిమెంటు కాపీ అన్నాను. రెండూ కలిపి చింపిపోగులు పెట్టాను.

"నౌదేర్ ఈజ్ నో ఎగ్రిమెంట్" అన్నాను.

ఎవ్వరూ వాట్లాడలేదు . కిరణ్ వెళ్ళిపోదామని లేచాడు. "నువ్వు కూర్చోకిరణ్ " అన్నాను.

"ఇలా చింపెయ్యగానే పోతే ఇంక ఎగ్రిమెంటుకి విలువేముంది." అన్నాను. ఎవ్వరూ సమాధానం చెప్పలేదు. "నమ్మకం ఉండాలేమో ఆనమ్మకం లేనప్పుడు ఇవేవీ పని చెయ్యవు.అంతే కాదు వొదిలించుకోడం తెలియాలి, అన్నీ వొదిలించుకోవాలి.., యేదేనా వొదిలి పోతుంటే బాధ కల్గకూడదు, ఇది జీవితంలో అతిచిన్న విషయం ఎవరికీ అర్ధంకాదు. అర్ధంకానివ్వదు. అదే మాయా?" అంటూ బ్రీఫ్ కేస్ నుండి మరో సెట్ పేపర్లు తీసాను.

"హిరణ్" అని పిలిచాను."ఇంక ఏ విషయమైనా నీ చేతుల్లోఉంది వత్సల ఇండస్ట్రీస్ నీపేర రిజిష్ట్రేషన్ చేయించాను."

"గిరిజాదేవి ఇండస్ట్రీస్ మహతిపేర రిజిష్ట్రేషన్ చేయించాను. ఆమే దానికి మేనేజింగ్ డైరెక్టరు. నాకు నాచేపల కంపు ఎలాగూ తప్పదు. అది ఎవరికీ ఇవ్వను." అని లేచి , హిరణ్ కొడుకుని తీసుకుని బయలుదేరాను. వాడికి తెలుసు మావయ్యతో వెళితే బాగా కిడుతుందని. అందుకే ఆనందంగా కేరింతలు కొడుతూ నాతో పాటు కారెక్కాడు. వెనకాల మనుషులు నేను చెప్పినవిషయాలు ప్రేక్షకులు అర్ధం చేసుకునేలోగా, నా కారు ముందుకు నడిచింది.

.........................

పసివాడితో బీచిలో ఎంతవరకూ ఆడానో ... ఎంత అలసిపోయానో ఎందుకో మనసంతా తేలికగా వుంది. పసివాడు ఏది తింటే అది నేను తిన్నాను వాడు ఎలా ఆడిస్తే అలా ఆడాను. ఎలా పరిగెత్తిస్తే అలా పరిగెట్టాను. బాగా అలసిపోయి హిరణ్ కొడుకుని సమీర ఇంటి దగ్గర దించి ... ఇంటికివచ్చాను. అప్పటికి తెలిసింది నీరసం .... పనివాడ్ని పిలిచి "అమ్మగారుఏరీ?" అని అడిగా

"హాస్పటల్ కి వెళ్ళి అలా వాళ్ళ ఇంటికి వెళ్తానన్నారండి."

"సరే వేడి పాలు తీసుకురా" అని మేడెక్కి రూములోకెళ్ళి బట్టలు మార్చుకుని బాత్రూములోకెళ్ళి స్నానం చేసివచ్చి మంచం మీద దిండుకానుకుని కూర్చున్నాను. ఎదురుగా గోడమీద టి.వి ఆన్ చేసాను.

ఏదో కార్యక్రమం వస్తోంది.

చాలా నీరసంగా వుంది. .. పిల్లాడితో సమానంగా గంతులు వేసినందుకు వళ్ళంతా నొప్పులుగా వుంది. నీరసం ఎక్కువైంది. దిండుకానుకునే కళ్ళుమూసుకున్నా.... తలంతా చెమట్లు పడుతోంది. దిండుకిందకి జార్చి పడుకున్నా... కన్ను మూతపడింది. తలుపు బద్దలైపోతోంది. నేను లేవడంలేదు. ఏమైంది. తలుపు గడియ విరిగి, తలుపు తీసుకు మహతి నౌకర్లు అందరూ లోపలికి వచ్చారు. అందులో వొకడు ముందు కొచ్చి నన్ను తాకి చూసి "అమ్మా అయ్యగారు పోయారు." అన్నాడు. నా భౌతికసంబంధం తెగిపోయింది.

మహతి నన్నే దీర్ఘంగా చూస్తోంది.

"కిందపడుకోబెడితే మంచిది ..." అన్నాడు నౌకరు

మహతి తలూపింది.

ఒక చాప తెచ్చారు దాని మీద పడుకోబెట్టారు. నిటారుగా పడుకోబెట్టడానికి కష్టపడ్డారు. మహతి కిందకి వెళ్ళి తండ్రికి ఫోనుచేసింది. మావగారు వచ్చారు. ఆయన వచ్చాక నాతల దగ్గర దీపం వెలిగింది. సమీర వచ్చింది. కిందకి వెళ్ళి కూర్చుంది. ఎవరూ ఏడవడంలేదు ఎవరికి కన్నీరులేదు. వాతావరణం విషాదంగా వుంది. నాకూ అక్కడ నుండి వెళ్ళాలనుంది, కానీ వదిలి వెళ్ళలేకపోతున్నా, మర్నాడు అంత్యక్రియలు జరుగుతాయి.

అంతే అర్ధం అయింది. అంత్యక్రియ.... దహనసంస్కారం జరిగింది. ఏదో మరుగైపోతోంది. జ్ఞానం నశిస్తోంది. మళ్ళీ జన్మతప్పదు, ఎక్కడ? ఎవరి గర్భంలో...? ఎంపిక ఎవరు చేస్తారు, విధి నిర్ణయం ఏమిటి? ఏకర్మ చెయ్యడానికి...?

"చూసావా ఏం జరిగిందో,,..?"

"ఏం జరిగింది?"

"నీ కర్మకి ఫలితం దక్కింది."

"అవును మరి ఫలితం ఏదీ?"

నిన్ను చూస్తే అర్ధం అవుతోంది. అది నిన్నోమొన్నో జరిగినట్టుంది.

అవును ఈ అనంతవిశ్వానికి కాల నిర్ణయం చేస్తే నీ జీవితకాలం వొక చిన్న నల్లని చుక్కగా గుర్తింపబడతావు.

"అర్థం కాలేదు."

నీవు భూమిమీద వున్నావు రేయి పగలు వున్నాయి. రోజులు నెలలు సంవత్సరాలు వున్నాయి. నీజీవితానికి అదే కొలమానం అదే నువ్వు శనిగ్రహం మీద వుంటే నీజీవితం. 24 సంవత్సరాలు అదే సూర్యగ్రహంమీద వుంటే ఇరవైసంవత్సరాలే ఇది సూర్యగ్రహం కేంద్రంగా చేసుచేసిన కొలమానం కానీ దృవుడ్ని కేంద్రంగా చేసుకుంటే అనంత విశ్వానికి కాలం కొలిస్తే పుట్టుక చావు ఒక బిందుసమానం నీ కంటికి కనిపించని బిందుసమానం.

"ఫలితం వుండదు" అన్నావు.

"నిజమే జరుగుతున్నది చూడు."

అక్కడ సమావేశం జరుగుతోంది. మహతి ఇంట్లో మహతి తండ్రి మహతితో చెప్తున్నాడు "జరిగిందేదో జరిగిపోయింది. ఇలా జరుగుతుందని ఎవరేనా అనుకున్నామా? కాని అనుకోనిది జరిగిపోయింది. చిరంజీవి ఇప్పుడులేరు. కానీ నీ జీవితం ఇంతచిన్న వయసులో బుగ్గిపాలు కావడం నాకిష్టం లేదు. ఇవన్నీ మరుపున పడిపోతాయి. మళ్ళీ నీ జీవితం చిగురించచ్చు.. ఆ అవకాశంవుంది. ఎవరైనా నిన్ను పెళ్ళిచేసుకోవచ్చు., లేదా నీకు నచ్చి నువ్వు ఎవరినైనా చేసుకోవచ్చు. అప్పుడు నీకు చిరంజీవి సంతానం అడ్డంకి కావచ్చు... ఇప్పటికీ మించిపోయిందిలేదు ఎబార్షన్ చేయించుకో... కొన్నాళ్ళకి అన్నీ మర్చిపోతావు. జీవితం సాఫీగా వుంటుంది. ఈ లంపటం వుండదు."

అక్కడ కూర్చున్న సభ్యులెవరూ చిరంజీవికి వారసుడుండాలని కానీ మరే విధంగాగానీ అనలేదు మహతి తండ్రిని సమర్ధించారు.
మహతి కూడా ఎబార్షన్ కి ఇష్టపడింది.